ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తిరుపతి

fb.com/vaartha Digital

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-6-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 126 పేజీలు: 10+4 వెల: 6.50

భారత్‌లో 'ఎయిర్ ట్రంక్' భారీ పెట్టుబడులు

కొత్త ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నాం: అన్నామలై 5లో

కర్ణాటక కేబినెట్‌లో లుకలుకలు
ఓ మంత్రి రాజీనామా 5లో



మోడీ మిత్రుడే.. అయినా సుంకాలు తప్పవు: ట్రంప్ 5లో



రాజ్యసభకు ఖర్గే నామినేషన్ దాఖలు 2లో



బెంగళూరులో రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేస్తున్న ఖర్గే



## స్మార్ట్ సిటీలకు రష్యా చేయూత

### సెయింట్ పీటర్స్‌బర్గ్ అధికారులతో మంత్రి లోకేష్ చర్చలు

### ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు ఇరుపక్షాల నిర్ణయం

### డిజిటల్ విద్య, మౌలిక సదుపాయాలపై ప్రధానంగా దృష్టి

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సేఫ్ అండ్ స్మార్ట్ సిటీల నిర్వహణ కోసం రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్, సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రభుత్వ రీజనల్ ఫారిన్ ఎఫైర్స్ విభాగం చీఫ్ ఎక్స్‌పర్ట్ పోలినా పోలుఖినాతో >>2

## విశాఖలో సిఎం సైకిల్ యాత్ర



**ప్రభాతవార్త-విశాఖపట్నం:** మహావిశాఖలో భగభగమండుతున్న ఎండనూ లెక్కచేయ కుండా సీఎం ఎన్.చంద్రబాబు సైకిల్ తొక్కుతూ మరోసారి తన ఉత్సాహాన్ని >>2

# ఆక్వా గ్లోబల్ హబ్‌గా ఎపి

### అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరును కలుపుతూ ఆక్వాకారిడార్

### 'ఆంధ్రా ష్రింప్, ఇండియా సీఫుడ్' బ్రాండ్ రూపొందిస్తున్నాం

### కేంద్ర మత్స్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి 15 రోజుల్లో స్థలం ఇస్తాం: సిఎం చంద్రబాబు

### రూ.72 కోట్లతో కాకినాడ పోర్ట్ ఆధునీకరిస్తాం: కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్



శుక్రవారం విశాఖలో జరిగిన సీఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్‌లో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విశాఖపట్నం, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఆక్వా రంగం అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఆక్వా రంగానికి భారతదేశం లైట్ హౌస్‌లా ఉంటే. దానికి ఏపీని కేంద్ర బిందువు చేస్తామన్నారు. అమరావతి, భీమవరం, కాకినాడ, విశాఖపట్నం, కృష్ణపట్నం, నెల్లూరు ప్రాంతాలను కలుపుతూ ఆక్వా కారిడార్ అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. ఈ కారిడార్లో ఆక్వా అభివృద్ధికి అవసరమైన రీసెర్చ్, ఇన్నో వేషన్, స్టార్టప్స్, టెక్నాలజీని అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అతి తక్కువ వ్యయంతో అత్యధిక ఉత్పత్తి సాధిం చడమే లక్ష్యమని చెప్పారు. ఆక్వా ఉత్పత్తులకు సంబంధించిన ఉప ఉత్పత్తులతో కూడా ఆర్థిక ప్రగతి సాధించవచ్చన్నారు. శుక్రవారం విశాఖలో జరిగిన సీఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్ షాప్‌లో ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'ఆంధ్రా ష్రింప్, ఇండియా సీఫుడ్' బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తున్నామని చెప్పారు. ఆక్వా రంగ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన నాలుగు శాఖలకు చెందిన కేంద్ర మంత్రులు ఒకే వేదికపై రావడం శుభపరిణామంగా అభివర్ణించారు. రాష్ట్రంలో మెగా సీఫుడ్ ప్రాసెసింగ్ పార్కులు 'రూ.72 కోట్లతో కాకినాడ పోర్ట్ మోడ్రనైజేషన్ చేపడతామని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించినందుకు సంతోషమని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. కేంద్ర మత్స్యశాఖకు ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15రోజుల్లో కేటాయిస్తామన్నారు. నెల రోజుల్లో కార్యాలయానికి శంకుస్థాపన చేసి నిర్మాణం ప్రారంభించాలని కేంద్రాన్ని కోరుతున్నా >>2

## జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్



### నేడు నామినేషన్

**విజయవాడ,జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని రమేష్ పేరు ఖరారైంది. పార్టీ ముఖ్యనేతలతో జరిగిన సమావేశంలో అధినేత పవన్ కల్యాణ్ కొన్ని అభిప్రాయాలు పంచుకున్నారు. కష్టసమయంలోనూ పార్టీని వీడకుండా జనసేనతో ఉన్నవారికే పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని నేతలతో అన్నారు. ఇప్పటివరకు కేటాయించిన పదవులు పార్టీ పట్ల అంకితభావంతో ఉన్నవారికే ఇచ్చామని తెలిపారు. ముమ్ముందు పదవుల కేటాయింపులోనూ ఇదే వర్తిస్తుందని పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. లింగమనేని రమేష్ పార్టీకి అధికారంలో ఉన్నా లేకున్నా వెన్నంటి ఉన్నారని పవన్ సమావేశంలో పవన్ ప్రస్తావించారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యానే పవన్ ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు అభ్యంతరం లేదని సమావేశంలో పాల్గొన్న నేతలు తెలిపినట్లు సమాచారం. దీంతో లింగమనేని రమేష్ పేరు ఖరారైనట్లు >>2

# నాటిన మొక్కలు రక్షించండి

### పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియకు శ్రీకారం

### స్వయంగా విత్తన బంతులు తయారు చేసిన డి.సిఎం పవన్

### డ్రోన్ల ద్వారా వెదజల్లిన సీడ్‌బాల్స్



శుక్రవారం మూలపాడులో విద్యార్థినిలతో కలిసి సీడ్‌బాల్స్ తయారు చేస్తున్న డి.సిఎం పవన్

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాదు, వాటిని సంరక్షించడం కీలకమన్నారు. పర్యావరణ దినోత్సవంలో భాగంగా చేపట్టిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి సమీపంలోని మూలపాడు బటర్‌ప్లైపార్కుకు పవన్ కల్యాణ్ వచ్చారు. సీడ్ బాల్స్ తయారు చేసే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. విద్యార్థులు, మూలపాడు గ్రామస్థులతో కలిసి సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియలో పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 ప్రాంతాల్లో విస్తృతంగా సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూలపాడు బటర్ ప్లైపార్క్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని పవన్ కల్యాణ్ వీక్షించారు. సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియలో పాల్గొన్న ప్రజలతో ముచ్చటించారు. ఏ ఏ విత్తనాలతో సీడ్ బాల్స్ తయారు చేస్తున్నారు? ఎంత మొత్తంలో రూపొందిస్తున్నారు? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రతి సీడ్ బాల్‌కు ఒక చెట్టును సృష్టించగలిగే శక్తి ఉంటుందన్నారు. ప్రతి చెట్టు వాతావరణ మార్పుల ప్రభావం నుంచి భూమిని కాపాడుతుంది. సీడ్ బాల్స్‌ను అడవులు, కొండ ప్రాంతాలు, నదీతీరాల్లో వెదజల్లే ఏర్పాటు చేస్తున్నాన్నారు. మనుషులు వెళ్లలేని ప్రాంతాల్లో డ్రోన్ సాయంతో సీడ్ బాల్స్‌ను జల్లుతామన్నారు. మొక్కలు >>2



## వైసిపి మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అరెస్టు

### నకిలీ జీవోలతో హైదరాబాద్ గండిపేటలో పదెకరాల సర్కార్ భూమి కాజేసే కుట్ర

### ఇప్పటికే ఐదుగురు అరెస్టు

### పరారైన మాజీ ఎమ్మెల్యేను కాంచీపురంలో అరెస్టు చేసిన పోలీసులు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** హైదరాబాద్ శివార్లలోని గండిపేట్ మండలంలో గల పదెకరాల ప్రభుత్వ భూమిని సొంతం చేసుకునేందుకు నకిలీ పత్రాలు, నకిలీ జిఓలు సృష్టించిన కేసులో ఎపిలోని వినుకొండకు చెందిన వైకాపా మాజీ ఎంఎల్ఎ బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టయ్యారు. తమిళనాడులోని కాంచీపురంలో ఆయనను సైబరాబాద్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి అక్కడి కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారంట్‌పై హైదరాబాద్‌కు తర లిస్తున్నారు. గత నెల 23వ తేదీన వెలుగు చూసిన ఈ కేసులో మొదట ముగ్గురు నేరగాళ్లు అరెస్టవగా ఆ తరువాత మరో ఇద్దరు పట్టుబడ్డారు. అయితే ఈ కేసులో అసలు నిందితుడు బొల్లా బ్రహ్మనాయుడు పారిపోగా ఆయన కోసం సైబ రాబాద్ పోలీసులు ఎపిలోని పలుచోట్ల గాలిం చిన ప్రయోజనం లేకుండా పోయింది. అయితే బ్రహ్మనాయుడు తమిళనాడు పారిపోయి కాంచీపురంలో తలదాచుకున్నట్లు సమాచారం అందు కున్న సైబరాబాద్ పోలీసులు స్థానిక పోలీసుల సహకారంతో ఒక హోటల్‌లో ఉండగా పట్టుకు న్నారు. గండిపేట్ మండలంలోని సర్వే నంబర్ 18లో గల పదెకరాల సర్కారు భూమిని కాజేసేం దుకు బ్రహ్మనాయుడు తనకు తెలిసిన న్యాయ వాదులు, రియల్టర్ల సహాయంతో తప్పుడు పత్రాలతో పాటు నకిలీ జిఓలు సృష్టించడం తెలిసిందే. అనంతరం ఐదువందల కోట్ల రూపాయలకు పైగా విలువచేసే ఈ భూమి తనదంటూ బోర్డులు పాతేందుకు యత్నించి, ఏకంగా మరో వ్యక్తికి అమ్మేందుకు సిద్ధమయ్యాడు. దీనిపై గండిపేట్ తహసీల్దార్ నార్సింగి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా గతనెల 23వతేదీన కేసు నమోదయ్యింది. దీని తరువాత కేసును విచారించగా బ్రహ్మనాయుడు ఈ గోల్‌మాల్ వ్యవహారానికి సూత్రధారిగా తేలింది. నకిలీ పత్రాలు, నకిలీ జిఓల తయారీకి బ్రహ్మనాయుడు తన >>2

## నేటి నుంచి 'యోగాంధ్ర' రిజిస్ట్రేషన్లు ఆరంభం



### వైద్యారోగ్య శాఖలో ప్రత్యేకంగా వార్‌రూమ్

### యోగా మాస్టర్ల ద్వారా 2.5లక్షల మందికి శిక్షణ

### లేపాక్షి ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం

**విజయవాడ, జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ 12వ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 7 నుంచి 21 వరకు ప్రత్యేక యోగా కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో కలిపి కోటి మందిని యోగాసనాల కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలుగా 'యోగాంధ్ర2026' పోర్టల్ ద్వారా శనివారం నుంచి రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. రాష్ట్రం లోని గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఈ రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఆయుష్ శాఖకు చెందిన అధికారులను ప్రతి జిల్లాకు ఒక నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,600 యోగా మాస్టర్ ట్రైనర్ల ద్వారా 2.5 లక్షల మందికి యోగాసనాలపై శిక్షణా కార్యక్రమాలు జరగబోతున్నాయి. జిల్లా కేంద్రం నుంచి మండల స్థాయి వరకు జరిగే ఈ శిక్షణా కార్యక్రమాలు మూడు రోజులపాటు జరుగు తాయి. ఒక్కొక్క యోగా మాస్టర్ కనీసం 50 మంది ట్రైనర్ల కు శిక్షణ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. వీరు మిగిలివారిచే యోగాసనాలపై శిక్షణ ఇస్తారు. అలాగే ఈ నెల 7నుంచి 20వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో కలిపి 56 కార్యక్రమాలు జరిపే విధంగా వైద్య ఆరోగ్యశాఖ, ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ నెల21న రాష్ట్ర స్థాయి కార్యక్రమం >>2

## తిరుమలలో భక్తుల క్రమబద్ధీకరణ భేష్

### ఎఐ ఆధారిత సేవలు బాగున్నాయి

### కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కేంద్రమంత్రి పీయూష్ గోయెల్



**తిరుమల,జూన్ 5ప్రభాతవార్తప్రతినిధి:** గోవిందా గోవింద నామంతో తిరుమలకు వస్తున్న పెద్ద సంఖ్యలో భక్తులకు సత్వర దర్శనం, వసతి సేవలందించడంలో నిత్యం పర్యవేక్షణ చేస్తున్న కృత్రిమ మేధస్సు(ఎఐ)ఆధారిత కమాండ్ కంట్రోల్ సెంటర్ పనితీరు అద్భుతంగా ఉందని కేంద్ర వాణిజ్యపరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ తెలిపారు. ఈ కేంద్రం నుండి అధికారులు, సిబ్బంది భక్తుల క్యూలైన్లు, వైకుంఠమ్ క్యూ కాంప్లెక్స్ కంపార్టుమెంట్లు, ఆలయం పరిసరాలు, తిరుమల ఘాట్‌రోడ్లులో పరిస్థితి పర్యవేక్షిస్తూ తీసుకుంటున్న చర్యలు బావున్నాయని గోయల్ కితాబిచ్చారు. వైకుంఠం1 క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసిసిసి) ద్వారా వసతి గదుల ఆక్యుపెన్సీ వివరాలు, భక్తుల రాకపోకలు, దర్శన క్యూలైన్లు, లడ్డూ ప్రసాదాల పంపిణీ వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వల్ల భక్తులకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని చెప్పారు. ఈ కేంద్రం ద్వారా గదుల లభ్యత, వివిధ కంపార్ట్మెంట్లలో వేచి ఉన్న భక్తుల సంఖ్య, గంటల వారీగా తిరుమలకు చేరుకుంటున్న భక్తుల వివరాలు, లడ్డూ >>2



## లోయలో పడిన టెంపో

### మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో ఘోర ప్రమాదం

### 25మంది టూరిస్టులకు గాయాలు

### ఇద్దరి పరిస్థితి విషమం

**చింతూరు, జూన్ 5 ప్రభాతవార్త:** చింతూరు మారేడుమిల్లి ఘాట్‌రోడ్డులో శనివారం మిట్ట మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. 25 మంది టూరిస్టులతో ప్రయాణం చేస్తున్న టెంపో వాహనం అదుపుతప్పి లోయలోకి పల్టీలు కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న టూరిస్టులకు తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో చింతూరు >>2



శుక్రవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా
విజయవాడలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మంత్రులు అనిత, సవిత, నిమ్మల

# ఆక్వా గ్లోబల్ హబ్‌గా ఏపి

>> న్నారు. ఆక్వా ఉత్పత్తులను మరింత పెద్ద స్థాయిలో ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఆక్వా రంగ అభివృద్ధికి కేంద్రం తీసుకునే చర్యలకు రాష్ట్రం వైపు నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. మెగా సీఫుడ్ ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు కేంద్రం సహకరిస్తామని ఇప్పటికే చెప్పిందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలు చేరుకోవడానికి బ్లూ ఎకానమీ ఎంతో కీలకమని, పాండ్ టు పోర్ట్, ఫార్మర్ టు గ్లోబల్ కన్స్యూమర్, బ్లూ ఎకానమీ టు వికసిత్ భారత్ అనే విధానంతో పని చేయాలన్నారు. భారత ఆకలను, ఆశ యాలను నెరవేర్చేందుకు ఏపీ బ్లూ ఎకానమీ దోహ దపడు తుందని భావిస్తున్నామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరిగే సీఫుడ్ బిజినెస్‌లో ఇండియా వాటా కేవలం 5శాతం మాత్రమే ఉందని, ఈ రంగంలో ఇండియాకు పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి.' అని ముఖ్య మంత్రి అన్నారు. ఏటా రూ.28,000 కోట్ల ఎగుమతులు'భవిష్యత్తే అంతా బ్లూ ఎకానమీదే. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతున్నాయి, ఏపీలో గోదా వరి, కృష్ణ వంటి జీవ నదులు ఉన్నాయని సీఎం చంద్రబాబు వివరించారు. సీఫుడ్ ఉత్పత్తిలో ఏపీ రెండో అతి పెద్ద రాష్ట్రం. 197 లక్షల మెట్రిక్ టన్నుల సీఫుడ్ ఉత్పత్తి ఏపీలో జరుగుతోంది. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహద పడుతుందన్నారు. భారతదేశం మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28శాతంగా ఉందన్నారు. భారతదేశం మొత్తం రొయ్యల ఉత్పత్తిలో ఏపీ షేర్ 66 శాతమని, భారతదేశం మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో దాదాపు ఏపీ నుంచే 38 శాతం ఆదాయం వస్తోందన్నారు.ప్రధాని మోదీని మరింత బలపరుద్దాం ఆక్వా పరిశ్రమలో ఇన్నోవేషన్లు చేసే వారిని ఆంధ్రప్రదేశ్ ఆహ్వానిస్తోందని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంతో ఏపీ పని చేస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేవారికి.. ఆ పెట్టుబడులకు ప్రోత్సా హమిచ్చి, అభివృద్ధి చేస్తాం. ఆక్వా ఉత్పత్తులతో చక్కటి ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రజలు ఇప్పుడు ప్రొటీన్ ఉత్పత్తులనే ఆహారంగా తీసుకుంటున్నారు. ఆక్వా ఉత్పత్తుల్లో ప్రొటీన్ పుష్కలంగా ఉం టుందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. సరైన సమయంలో సరైన నేత నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండటం అదృష్టమని, 21వ శతాబ్దం నరేంద్ర మోదీదే అని తెలిపారు. భవిష్యత్తులో భారత దేశాన్ని అగ్ర భాగంలో నిలపడానికి ప్రధాని మోదీ అద్భుతంగా పని చేస్తున్నారన్నారు. ప్రధానిగా 12 ఏళ్ళ పూర్తి చేసుకుంటున్న మోదీని మరింత బలపర్చాల్సిన అవసరం ఉందని సీఎం చెప్పారు. కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఉత్పత్తులుఆక్వా రంగం అభివృద్ధిపై కేంద్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉమ్మడి ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆక్వా రంగం విషయంలో కేంద్ర ప్రభుత్వం సంక్షోభం నుంచి అవకాశాలను అన్వేషిస్తోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చెప్పారు. అమెరికా టారిఫ్‌లు విధించినప్పటికీ గతేడాది కంటే మిన్నగా ఆక్వా ఎగుమతులు చేసుకోగలిగామని, అంతర్జాతీయంగా కొత్త మార్కెట్లకు భారత ఆక్వా ఎగుమతులు వెళ్తు న్నాయని... ఇప్పుడు మన ఆక్వా ఉత్పత్తులకు మరిన్ని మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆక్వా ఎగుమతులతో ఆర్థికాభివృద్ధితో పాటు మత్స్యకారులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. మెకనైజ్డ్ బోట్లను మత్స్యకారులకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని, 200 మెకనైజ్డ్ బోట్లు ఏపీకి వస్తున్నాయని చెప్పారు. ప్రజల ఆహార అలవాట్లు మారాయని, ప్రొటీన్ ఆహారాన్ని అధికంగా తీసుకుంటున్నారని, దీంతో ప్రొటీన్ ఎక్కువ ఉండటం వల్ల ఆక్వా ఉత్పత్తులకు రోజు రోజుకూ డిమాండ్ పెరుగుతోందన్నారు. ఆక్వాలో కేవలం 12 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేస్తున్నాం... సీ ఫుడ్ ప్రాసెసింగ్ విషయంలో మరింత అభివృద్ధి చేయాలి. ఆక్వాలో టెక్నాలజీ, ఇన్నోవేషన్లకు పెద్ద పీట వేయాలి. వ్యవసాయంతో పోల్చుకుంటే ఆక్వాలో ఎక్కువ అభివృద్ధి కనిపిస్తోంది. ఆక్వాకు రూ.1.50కే విద్యుత్ ఇస్తున్నాం. ఫిష్ ఫీడ్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఫిష్ మీల్ ఎగుమతులను 50 శాతానికి పరిమితం చేయాలని కోరుతున్నాం. సోయా విషయంలోనూ కేంద్రం నుంచి సహకారం అవసరం. ఇతర దేశాలతో ట్రేడ్ అగ్రిమెంట్లు జరుగుతున్నాయి. దీనికి కేంద్రం ఇప్పటికే సహకరి స్తోంది. ప్రపంచంలోని ప్రతి కిచెన్‌లోకి ఇండియన్ ఆక్వా ఉత్పత్తులు వెళ్లేలా కేంద్రం ప్రణాళికలు రూపొందించడం సంతోషంగా ఉంది.'అని అన్నారు. 'పీఎంఎంకేఎస్ఎస్‌వై పథకాన్ని ఏపీలో అమలు చేస్తున్నాం. విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం, ఏడాది 30 బిలియన్ యూఎస్ డాలర్ల విలువైన ఎగుమతులు చేసేలా కేంద్ర ప్రభుత్వ లక్ష్యం పెట్టుకుంది. కేంద్రం నిర్దేశం చుకున్న లక్ష్యంలో 30 శాతం ఏపీ వాటా ఉంటుందని హామీ ఇస్తున్నాం. సర్కులర్ ఎకానమీకి ఆక్వా రంగాన్ని అనుసంధానం చేసేలా భీమవరంలో ప్రాజెక్టుకు కేంద్రం సహకారం అందిస్తోందని సీఎం వివరించారు. మార్కెట్ ఇబ్బందులతో మద్దతు ధర కోల్పోయిన వివిధ పంటల రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు.

# రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యం

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎయులో మొక్క నాటిన సిఎం చంద్రబాబు

**విశాఖపట్నం, జూన్ 5 ప్రభాతవార్త:** రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రోజురోజుకూ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, ఓవైపు విపరీతమైన ఎండలు, లేదంటే తుఫానులు వస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం ముఖ్యమంత్రి పాల్గొన్నారు. శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు దీనికి హాజరయ్యారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి మొక్క నాటారు. తిరుమల తరహాలో ఏయూ క్యాంపస్‌లోనూ గ్రీనరీ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం క్యాంపస్‌లో 25 శాతమే గ్రీనరీ ఉందని దీనిని 50 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలంటూ ఏయూ వీసీని సీఎం ఆదేశించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ 'స్వచ్ఛత, పచ్చదనం, పర్యావరణానికి ఏయూ క్యాంపస్ ఆదర్శంగా మారాలి. నెట్ జీరో క్యాంపస్‌గా ఏయూను నిలపాలి. ఆంధ్ర యూనివర్శిటీకి 450 ఎకరాల సువిశాల క్యాంపస్ ఉంది. ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచడంతో పాటు... బిల్డింగుల మీద సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. క్యాంపస్‌కు అవసరమైన విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలి. ఇప్పటికే రూ.5,18,000విలువైన విద్యుత్ ఆదా అయింది. క్యాంపస్ నుంచి ఒక్క చుక్క నీరు కూడా బయటకు వెళ్లకూడదు. శుద్ధి చేసిన నీటిని చెట్లకు ఉపయోగించాలి. నెట్ జీరో విధానం అమలు చేయడానికి ప్రొఫెసర్స్ టీం ఏర్పాటు చేయాలి. విశాఖలో కాలుష్య నియంత్రణ చర్యలువిశాఖలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పోర్టు దగ్గర నుంచి మొదలుకుని అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు.

# టెట్ నోటిఫికేషన్ విడుదల

**విజయవాడ,జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరు ద్యోగులకు శుభవార్త తెలిపింది, ఏపీ విద్యాశాఖ టెట్- 2026 జూన్ సెషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. జూన్ 5 నుంచి అంటే నేటి నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. బీఈడ్, డీఎల్ఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులతో పాటు ఫైనల్ సెమిస్టర్ విద్యార్థులు కూడా ఈ కింది డైరెక్ట్ లింక్ ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. రాష్ట్రంలోని ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ, ఏపీ మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రైవేట్ ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 8వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులకు టెట్ అర్హత తప్పనిసరి. టెట్ అర్హత కలిగిన నిరుద్యోగులకు డీఎస్సీ రాసేందుకు అవకాశం ఉంటుంది.. ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (తిశి గినిగి 2026) జూన్ 2026 సెషన్ నోటిఫికేషన్‌ను ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసింది. బీఎడ్, డీఎడ్ కోర్సులు పూర్తి చేసిన వారితోపాటు ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ బడుల్లో విధుల్లో ఉన్న ఉపాధ్యాయులందరికీ టెట్ అర్హత తప్పనిసరి. కాబట్టి వీరంతా ఆన్‌లైన్ విధానంలో జూన్ 5, 2026వ తేదీ నుంచి ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోండి.. ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీసం 40 నుంచి 50 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఈఎల్ఈడీ లేదా బీఈడీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఫైనల్ సెమిస్టర్ చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అర్హతలు కలిగిన వారు జులై 5, 2026వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ ఫీజు కింద ప్రతి పేపర్‌కు ప్రతి ఒక్కరూ విడివిడిగా రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. వీరికి టెట్ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. టీచర్ రిక్రూట్‌మెంట్‌లో టెట్ స్కోరుకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. టెట్ ఆన్‌లైన్ రాత పరీక్షలు ఆగస్ట్ 5 నుంచి 21 వరకు రోజుకు రెండు సెషన్లలో జరుగుతాయి. ఆయా తేదీల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయి. రాత పరీక్ష మొత్తం 150 ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలకు 150మార్కులకు ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ ఉండదు.

# నాటిన మొక్కలు రక్షించండి

>> నాటడం ప్రతి ఒక్కరూ అలవాటుగా చేసుకోవాలని. నాటడమేకాదు, వాటిని సంరక్షించడం కూడా కీలకమన్నారు. అంకుడు, తెల్లపొణికి, వేప, కుంకుడు, రావి, మర్రి, వెదురు, ఉసిరి, చింత, మోదుగ తదితర స్వదేశీ జాతి విత్తనాలతో సీడ్ బాల్స్ తయారు చేశారు. "ఏక్ పేడ్ మా కే నామ్" అం టూ ప్రధాని మోడీ ఇచ్చిన పిలుపు మేరకు తన తల్లి పేరిట పవన్ కల్యాణ్ మొక్కను నాటారు. ఇవాళ్టి నుంచి ఈనెల 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర కోట్ల సీడ్ బాల్స్ తయారీ లక్ష్యంగా నిర్దేశిం చుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విత్తన బంతుల (సీడ్ బాల్స్)ను అడ వులు, కొండ ప్రాంతాలు, నదీ తీరాల్లో వెదజల్లే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి సీడ్ బాల్‌కు ఒక చెట్టును సృష్టిం చగలిగే శక్తి ఉంటుందన్నారు. వన సంరక్షణకు పని చేస్తున్న మహనీయుల స్ఫూర్తితో విత్తన బంతుల తయారీ ప్రక్రియను బాధ్యతగా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. సీడ్ బాల్స్ ఆవశ్యకతను వివరించిన చిన్నారులను అభినందించారు. అనంతరం డ్రోన్ల సహాయంతో కొండ శిఖరాలపై విత్తన బంతులు జార విడిచే ప్రక్రియను పరిశీలించారు. మూలపాడు బటర్ ఫ్లై పార్కులో అటవీ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పవన్ కల్యాణ్ సందర్శించారు. బటర్ ఫ్లై పార్కు నమూనా పరిశీలనలో అక్కడ యోగా హాల్ నిర్మాణం ఆయనను ఆకట్టుకుంది. ప్రతి ఎకో టూరిజం పార్కులో ఒక యోగా హాల్ నిర్మించే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఉడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని వాగ్దనం:** కొండపల్లి కొయ్య బొమ్మలు తయారీకి వినియోగించే తెల్ల పొణికి దుంగలను పరిశీలించారు. అదేవిధంగా పక్కనే ఏర్పాటు చేసిన కొండపల్లి కొయ్య బొమ్మలు, ఉదయగిరి కళాకారులు నిర్ధ, బిళ్ల నిర్ధ, వేప కర్రతో తయారు చేసిన గ్లాసులు, గరిటలు మొదలైన ఇంటి సామాగ్రిని ఆసక్తిగా తిలకించారు. కళాకారులు రూపొందించిన చెక్క వాచ్, ల్యాప్ టాప్ పవన్ కల్యాణ్‌ని ఆకట్టుకున్నాయి. చిత్తూరు నుంచి వచ్చిన కళాకారులు బొమ్మల తయారీకి అవసరం అయిన చెక్క లభించడం లేదని తెలుపగా, వుడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొయ్య బొమ్మల కళాకారుల చేత ప్రముఖ స్వతంత్ర సమర యోధు లు, హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రతిమను తయారు చేయించాలని కోరారు. అద్భుతమైన కళారూపాలకు మార్కెటింగ్ కల్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకి ఓ ప్రాంతంలో చేతి వృత్తుల కళాకారులను కలిసే ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణప్రసాద్ గారు, అటవీ, పర్యావరణ శాఖల ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే ు, పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు , అటవీశాఖ సలహాదారుడు మల్లికార్జునరావు , ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ , జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను , మైలవరం ఇంఛార్జ్ అక్కల రామ్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

# లోయలో పడిన టెంపో

>> నుంచి భద్రాచలం, భద్రాచలం నుంచి రాజమండ్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివ రాలు ఈ విధంగా ఉన్నాయి. కడియం మండలం వేమగిరి, సామర్లకోట మండలం మేడపాడు,జగ్గంపేట మండపేట,గంటి పెద్దపుడి గ్రామాలకు చెందిన సుమారు 25 మంది వారి చిన్నారులతో కలిసి మారేడు మిల్లిలోని వాటర్ ఫాల్స్ వీక్షణ కోసం బయలుదేరారు. మారేడుమిల్లిలో వాటర్ ఫాల్స్ వద్ద నీళ్లు లేకపో వడంతో, వారితో ఉన్న చిన్నారులు నీళ్లలో జలకాలాడాల్సిందే అని పట్టు పట్టడంతో అక్కడి నుంచి వారు చింతూరు వైపు ప్రయాణమయ్యారు. ఘాట్ రోడ్డు మొత్తం క్రిందకు దిగిన తర్వాత పెద్దమ్మతల్లి గుడి దాటి చింతూరు వైపు వస్తుండగా రెండో మలుపు వద్ద వాహనము అదుపుతప్పి రైలింగును ఢీకొని లోయలోకి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో 12 మందికి కాళ్లు చేతులు విరగగా మరో 13 మందికి గాయా లయ్యాయి. హుటా హుటిన అంబులెన్స్‌లో క్షతగాత్రులను చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలిం చడంతో ఆసుపత్రి మొత్తం క్షతగాత్రుల ఆహాకారాలతో మారుమ్రోగింది. తీవ్రంగా గాయాలైన 12 మందిని చింతూరు ఏరియా ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి భద్రాచలం తరలించారు. 12 సం వత్సరాల వయసున్న హరి అనే బాలుడుతో పాటు ఆరు సంవత్సరాల వయసున్న శ్యామల అనే చిన్నారికి తలకు గాయాలు కావటంతో పాటు అంతర్గతంగా రక్తస్రావమైనట్టు గమనించిన డాక్టర్లు వారిని చింతూరు నుంచి భద్రాచలంకు రిఫర్ చేయగా అక్కడ కూడా వారి పరిస్థితి విషమంగా ఉంది అక్కడ నుంచి రాజమండ్రిలోని న్యూరో సర్జన్ వద్దకు రిఫర్ చేశారు. స్వల్ప గాయాలతో ఉన్న క్ష తగాత్రులను వారి స్వగ్రామాలకు తరలించడం కోసం చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి శుభం నొక్వాల్ ఆదేశాల మేరకు చింతూరు ఏఎస్పీ బొడ్డు హేమంత్, డివిజనల్ రెవెన్యూ అధికారి అంబేద్కర్ ఆధ్వర్యంలో అంబులెన్సులు ఏర్పాటు చేసి స్వల్ప గాయాలైన 13 మందిని రెండు అంబులెన్స్ ద్వారా వారి స్వగ్రామాలకు తరలించారు.

# తిరుమలలో భక్తుల క్రమబద్ధీకరణ భేష్

>> తక్షణమే అందుబాటులోకి వస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ సాంకేతికతను ప్రోత్సహిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ప్రవాస భారతీయ భక్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, కేవలం వంద రోజుల లోపే ఎఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిన టిటిడి అధికారులను ఈ సందర్భంగా కేంద్రమంత్రి పీయూష్‌గోయల్ అభినందించారు. తిరుమలలో భక్తుల సేవల నిర్వహణలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరు ప్రశంసనీయమని అన్నారు. శుక్రవారం ఉదయం కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనానంతరం వైకుంఠమ్ 1 లోని ఐసిసిసిని సందర్శించారు. అక్కడ టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఇఒ భాస్కర్, డిప్యూటీ సిఎఫ్ఒ ఫణికుమార్‌నాయుడుతో కలసి ఎఐ ఐసిసిసి పనితీరును మంత్రి స్వయంగా పరిశీలించారు. భక్తులు విశ్రాంతి తీసుకుంటున్న ప్రాంతాన్ని కూడా ఇక్కడ నుండి మంత్రి పర్యవేక్షించారు.

# స్మార్ట్ సిటీలకు రష్యా చేయూత

>>భేటీ అయ్యారు. ఈ భేటీలో ఒక ఉమ్మడి వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి లోకేష్ స్వయంగా వెల్లడించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించినట్లు లోకేష్ వివరించారు. ప్రధానంగా సేఫ్ స్మార్ట్ సిటీల నిర్మాణం కోసం పౌరులతో చర్చలు జరపడం, డేటా ఆధారిత నగర నిర్వహణ, డిజిటల్ విద్యను ప్రోత్సహించడం, నగరాల్లో విశ్వసనీయమైన మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి. ఏపీలో స్మార్ట్ సిటీల అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి సాంకేతిక పరిజ్ఞానం, అనుభవాన్ని పంచుకునేందుకు ఈ ఉమ్మడి వర్కింగ్ గ్రూప్ దోహదపడుతుందని భావిస్తున్నారు. ఈసహకారంతో రాష్ట్రంలోనినగరాలను మరింత సురక్షితంగా, ఆధునికంగా తీర్చిదిద్దేందుకు మార్గం సుగమం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పాలుపంచుకోండి**

రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా పాలు పంచుకోవాలని రష్యా పారిశ్రామికవేత్తలను, ప్రముఖ సంస్థలను ఏపీకి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆహ్వానించారు.రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్థిక ఫోరం వేదికగా ప్రసంగించారు. కేవలం పెట్టుబడిదారులుగానే కాకుండా,భారత్‌రష్యాల మధ్య బంధం కేవలం వ్యాపార ఒప్పందాలకే పరిమితం కాదని, అది ఒక దృఢమైన అనుబంధమని లోకేష్ పేర్కొన్నారు. భిలాయ్ స్టీల్ ప్లాంట్ నుంచి గగన్‌యాన్ ప్రాజెక్టు వరకు అనేక కీలక సందర్భాల్లో రష్యా భారత్‌కు అండగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిర్దేశించుకున్న 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, 2047 నాటికి రాష్ట్ర జీడీపీని 2.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని వివరించారు. వెయ్యి కిలోమీటర్ల మేర విస్తరించిన సుదీర్ఘ తీరప్రాంతం, ఆరు ప్రధాన ఓడరేవులు, పటిష్టమైన మౌలిక సదుపాయాలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా వంటి అంశాలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఎంతో అనువైనవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఖీస్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ఖికు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు. అంతరిక్ష రంగంలో ఇరు దేశాల మధ్య సహకారం నూతన శిఖరాలకు చేరుతోందని, భారత దేశపు ఏకైక స్పేస్‌పోర్ట్ శ్రీహరికోట ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని లోకేష్ గుర్తుచేశారు.

ఈ క్రమంలో రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న స్పేస్ సిటీలలో పెట్టుబడులు పెట్టాలని రోస్‌కోస్మోస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలను ఆహ్వానించారు. ఏరోస్పేస్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో రష్యన్ సంస్థలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఉమ్మడిగా ఉజ్వల భవిష్యత్తును నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

## రాజ్యసభ ఇవ్వడాన్ని పదవిగా కాదు, బాధ్యతగా భావిస్తా: లింగమనేని రమేశ్

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:**రాజ్యసభ ఇవ్వడాన్ని పదవిగాకాదు, బాధ్యతగా భావిసా అని జనసేన రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైనా లింగమనేని రమేశ్‌స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జనసేన అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కు, మద్దతిచ్చిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 'నాకు పదవికాదు, బలమైన బాధ్యత అప్పగించారని భావిస్తున్నా. ప్రజల ఆకాంక్షలపై, రాష్ట్ర అభివృద్ధిపై రాజ్యసభలో మాట్లాడతా. సామాన్యుడి గొంతును రాజ్యసభలో వినిపించడమే లక్ష్యంగా పనిచేస్తా. పవన్ నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకొంటా'అని రమేశ్

# విశాఖలో సిఎం సైకిల్ యాత్ర

>> చాటిచెప్పారు. ఆరోగ్యకర జీవ నశైలి, ఫిట్‌నెస్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలనే లక్ష్యంతో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఆయన స్వయంగా పాల్గొని అందరికీ ఆదర్శంగా నిలిచారు.ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవోటెల్ వరకు సుమారు 5.5 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 21 నిమిషాల 18 సెకన్లలో పూర్తి చేసిన సీఎం, ప్రయాణం మొత్తం ఉత్సాహంగా కనిపించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మార్గాల మీదుగా సాగిన ఈ సైకిల్ యాత్రనగర ప్రజల దృష్టిని ఆకర్షించింది.ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ఎక్కడా అలసటకు లోనుకాకుండా సైకిల్ తొక్కిన సీఎం,మార్గమధ్యంలో కనిపించిన ప్రజలకు అభి వాదం చేస్తూ ముందుకు సాగారు. ఆయనను చూసిన పలువురు యువత, వృద్ధులు, మహిళలు సైతం ఉత్సాహంగా స్పందించారు. ప్రజలతో మమేకమవుతూ సాగిన ఈ సైకిల్ ప్రయాణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈర్యాలీలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో పా ల్గొన్నారు. ఆరోగ్యం,పర్యావరణ పరిరక్షణ, శారీరక దృఢత్వం కోసం సైక్లింగ్ ఎంత ముఖ్య మో ఈ కార్యక్రమంద్వారా ప్రజలకు సందేశం చేరింది.ప్రస్తుతం వేగవంతమైన జీవనశైలిలో వ్యాయా మానికి సమయం కేటాయించడం తగ్గిపోతున్ననేపథ్యంలో, రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా సైకిల్ తొక్కడం ద్వారా ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలనే సానుకూల సందేశాన్ని సమాజానికి అందించారు. ఎండలోనూ ఆయన చూపిన చురుకుదనం, క్రమశిక్షణ, ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధ పలువురికి స్ఫూర్తిగా నిలిచింది.



శుక్రవారం సూరత్‌లోని హజీరాలో ఉన్న ఎల్ అండ్ టి ప్లాంట్‌ను సందర్శిస్తున్న ప్రధాని మోడీ

# రాజ్యసభకు ఖర్గే నామినేషన్ దాఖలు

## రాహుల్ గాంధీ, సిఎం డికె శివకుమార్, సిద్ధరామయ్య హాజరు

**బెంగళూరు, జూన్ 5:** కర్ణాటక నుంచి రాజ్యసభ ఎన్నికలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శుక్రవారం విధానసౌధలో తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తదితరులు పాల్గొన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభకు ద్వైవార్షిక ఎన్నికలు జూన్ 18న జరగనున్నాయి. అంతకుముందు, ముఖ్యమంత్రి డికె శివకుమార్ నేతృత్వంలోని కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో, నామినేషన్ పత్రాల దాఖలు కోసం రాహుల్ గాంధీ, ఖర్గే శుక్రవారం బెంగళూరుకు చేరుకున్నారు. వారు రాగానే ముఖ్యమంత్రి డికె శివకుమార్, కాంగ్రెస్ రాష్ట్ర నూతన అధ్యక్షుడు బి.కె.హరిప్రసాద్, కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ (సిడబ్ల్యుసి) సభ్యుడు, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వారికి ఘన స్వాగతం పలికారు. కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్ గాంధీ ఒక మొక్కను నాటి, నీరుపోశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి డికె శివకుమార్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్‌సింగ్ సూర్జేవాలా, సిద్ధరామయ్య, మంత్రి ఎం.బి.పాటిల్ పాల్గొన్నారు.

# బ్రహ్మానాయుడు అరెస్టు

>> ముఠాలోని సభ్యులకు ఎనిమిది కోట్ల రూపాయలు ఇచ్చిన ట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసింది. ఆయన ముఠాలో ఐదుగురిని అరెస్టు చేయగా వీరి వద్ద నకిలీ పత్రాలతో పాటు నకిలీ జిఓలు స్వాధీనం చేసు కున్నారు. కేసు నమోదు కాగానే బ్రహ్మానాయుడు పారిపోయి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోగా న్యాయస్థానం దీనిని డిస్మిస్ చేసింది. దీని తరువాత తన అరెస్టు ఖాయమని భావించిన బ్రహ్మ నాయుడు అజ్ఞాతంలోకి వెళ్లి పలుప్రాంతాలను మార్చి చివరకు శుక్రవారం కాంచీపురంలో పట్టుబడ్డారు. బ్రహ్మానాయుడును శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ తీసుకువచ్చిన తరువాత వైద్య పరీక్షలు నిర్వహించి స్థానిక న్యాయస్థానం ఎదుట హాజరుపరచి కోర్టు ఆదేశాల మేరకు రిమాండుకు తరలిస్తారు. కాగా ఈ కేసులో మరింత సమా చారం సేకరించేందుకు బ్రహ్మానాయుడును వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరను న్నారు. ఈ పిటిషన్ శనివారం లేదా సోమవారం దాఖలయ్యే వీలుంది. ఈ కేసులో కొందరు రెవెన్యూ అధికారులు,మాజీ అధికారుల పాత్రపై ఆరోపణలు రావడంతో బ్రహ్మానాయుడును విచారిస్తే అసలు విషయం వెలుగుచూసే వీలుందని సైబరాబాద్ పోలీసులు భావిస్తున్నారు.

# షర్మిలకు దక్కని రాజ్యసభ సీటు

**విజయవాడ,జూన్ 5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు ఏఐసీసీ అనుహ్యంగా షాక్ ఇచ్చింది.ఆమెకు రాజ్యసభకు సీటు వచ్చినట్లుగానే పీసీసీ వర్గాలు విస్తృతంగా ప్రచారం చేసాయి.జోరుగా సాగిన ఊహాగా నాలకు ఇప్పుడు తెరపడింది. కాంగ్రెస్ అధిష్ఠానం తాజాగా ప్రకటించిన రాజ్యసభ అభ్యర్థుల తుది జాబితాలో షర్మిలకు చోటు దక్కలేదు. కర్ణాటక నుంచి ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాలను భర్తీ చేసే క్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే. ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి పవన్ ఖేడా, కేంద్ర మాజీ మంత్రి రెహ్మాన్ ఖాన్ కుమారుడు. మన్సూర్ ఆలీఖాన్‌లను కర్ణాటక నుంచి రాజ్యసభకు పోటీ చేసే అభ్యర్దులుగా ఉన్నారు.

# రిజిస్ట్రేషన్లు ఆరంభం

>> అమరావతిలో,నిర్వహించాలని తలపెట్టగా దీనికి కొనసాగింపుగా ప్రతి జిల్లా కేంద్రంలో యోగాసన కార్యక్రమాల నిర్వహణకు వీలుగా భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం నిర్వహించిన సమీక్ష (వర్చువల్)లో ఆయనకు ఉన్నతాధికారులు ఏర్పాట్లపై వివరించారు.ఈ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు మంగళగిరిలోని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక వార్ రూము ఏర్పాటైంది. ఆయుష్ వైద్య ఆరోగ్యశాఖ, జాతీయ ఆరోగ్య మిషన్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు, సెకండరీ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కార్యాలయాలకు చెందిన 30 మందితో ఈ వార్ రూము ఏర్పాటైంది.

# జనసేన రాజ్యసభ అభ్యర్థిగా లింగమనేని

>> జనసేన వర్గాలు తెలిపాయి.పవన్ కల్యాణ్ అధికారికంగా వెల్లడిస్తారని జనసేన నేతలు చెబుతున్నారు. నిన్న జరిగిన ఎన్డీఏ నేతల సమావేశంలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తోపాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక, సర్, రెండేళ్ల పాలన విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై భేటీలో ప్రధానంగా చర్చించారు. అలాగే రాష్ట్రంలో త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపైనా చర్చ జరిగింది. అందులో భాగంగా మూడు రాజ్యసభస్థానాలను టీడీపీ, ఒక స్థానాన్ని జనసేన తీసుకోవాలని నిర్ణయించారు. జనసేనకు దీంతో రాజ్యసభలో తొలిసారి ప్రాధాన్యత లభించింది.ఈ క్రమంలో లింగమనేని రమేష్‌కు జనసేన సీటు కేటాయించింది.ఇక లింగమనేనికి పార్టీతో 2015 నుంచి అనుబంధం ఉందని పవన్ రాజకీయ కార్యదర్శి హరిప్రసాద్ తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలనే పవన్ ఆలోచనలకు లింగమనేని ఆకర్షితులయ్యారన్నారు. శనివారం మధ్యాహ్నం లింగమనేని రమేష్ నామినేషన్ వేస్తారని వెల్లడించారు.2019 ఎన్నికల్లో ప్రతికూల ఫలితాలు వచ్చినా లింగమనేని, పవన్ వెంటే ఉన్నారని గుర్తు చేశారు. నేతల కులమతాలు పట్టించుకోకుండా అవకాశం కల్పించామని తెలిపారు. ఇదే సూత్రాన్ని రాజ్యసభ అభ్యర్థి ఎంపికలోనూ పవన్ అనుసరించారని హరిప్రసాద్ స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

06-06-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
షష్ఠి రా.2.39
శ్రవణ ఉ.6.03
వర్జ్యం : ఉ.10.21–మ.12.05
దు.ఆ.5.33–ఉ.7.13
రాహుకాలం - ఉ.9.00–10.30

## వార్తాఫలం

మేషం: జీవిత భాగస్వామి ద్వారా ధన, ఆస్తి లాభాలు పొందుతారు. కొత్త పెట్టుబడులు అనుకూలంగా ఉంటాయి. వస్త్రలాభం.

వృషభం: నూతన వ్యక్తుల పరిచయాలు, మాట సహాయం అందిస్తారు. ఇంటి యందు శుభకార్యాలు జరుగుతాయి.

మిథునం: కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. చాకచక్యంగా వ్యవహరించి పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వాహనసౌఖ్యం.

కర్కాటకం: భావావేశాలను అదుపులో ఉంచుకోవాలి. మానసిక ఒత్తిడి నుంచి బయటపడతారు. గృహనిర్మాణాలు చేపడతారు.

సింహం: ముఖ్యమైన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పొందుతారు.

కన్య: అదృష్టం అనుకూలంగా ఉంటుంది. రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు ఫలిస్తాయి. వస్త్రలాభం.

తుల: ఆర్థికపరమైన లావాదేవీలలో మధ్యవర్తిత్వ వ్యవహారాలు లాభిస్తాయి. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి.

వృశ్చికం: బాధ్యతలు సమర్థవంతంగా నెరవేర్చి ఉన్నతాధికారుల ప్రశంసలు పొందుతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

ధనుస్సు: చేపట్టిన పనులలో ఆటంకాలు ఎదురైనను ఓర్పుతో అధిగమిస్తారు. ఏ మాత్రం శ్రమ పడకుండా ఫలితాలు పొందుతారు.

మకరం: భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కుటుంబ పురోభివృద్ధికి విశేషంగా కృషి చేస్తారు. స్వర్ణాభరణ లాభం.

కుంభం: కార్యాలయంలో సానుకూల వాతావరణం నెలకొని ఉంటుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది.

మీనం: శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. వివాదాలు తీరి ప్రశాంతత పొందుతారు. శుభవార్తలు అందుకుంటారు.

– శ్రీమతి ములుగు శివప్రియ, కోఠి, హైదరాబాద్

# పలువురు డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

## • పోస్టింగ్‌లపై కీలక ఉత్తర్వులు జారీ

**విజయవాడ, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో పలువురు డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. మరికొందరికి పోస్టింగ్‌లు పదోన్నతులు ఇచ్చింది. కె.అద్దయ్యకు అడ్మినిస్ట్రేటర్, జీజీహెచ్ ఒంగోలు నుండి డీఆర్‌వో, పల్నాడు జిల్లాగా నియామకం. కె.మాధురికి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్నందున ఆర్‌డీఓ, పార్వతీపురంగా నియామకం. భుజంగరావు ఎం.నూతనంగా డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది ఆర్‌డీఓ, పాడేరుగా పోస్టింగ్ షేక్ మహమ్మద్ హుస్సేన్‌కు ఆర్‌డీఓ, కుప్పంగా నియామకం మన్నెం సూర్యారావుకు అసిస్టెంట్ సెక్రటరీ, సీసీఎల్ఏ నుండి ఆర్‌డీఓ, తాడేపల్లిగూడెంగా బదిలీ. వి.పుల్లారెడ్డి ఎస్‌ఎస్‌వో, చిత్తూరుగా పోస్టింగ్ ఎస్.రుష కుమార్ ఆర్‌డీఓ, వుయ్యూరుగా బదిలీ. ఈశ్వరమ్మ రేలంగి ఎస్‌డీసీ పోలవరం ఏటపాక యూనిట్-2గా నియామకం కె.గోపాలకృష్ణ ఆర్‌డీఓ, సత్తెనపల్లిగా బదిలీ. కె.శ్రీరమణి కి ఆర్‌డీఓ, తెనాలిగా పోస్టింగ్. వెంకట సన్యాసి శర్మ వేదుల కి ఎస్‌డీసీ, ఆర్ఎంసీ యూనిట్ -2 పీఏపీ ఏలూరుగా బదిలీ. ఎన్.నరసింహారావు కు ఆపిక్ జోనల్ మేనేజర్, అనకాపల్లి నుండి ఆర్‌డీఓ ,చీరాలగా నియామంక ఎ.హరికుమార్ ఆర్‌డీఓ, బాపట్లగా పోస్టింగ్, అరుణ కుమారి మండపాటి ఆర్‌డీఓ, గూడూరుగా నియామకం. పి.వెంకటరమణకు అదనపు కమిషనర్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్గా నియమించేందుకు ఎంఏ యూడీ శాఖకు సేవలు కేటాయింపు. పి.విజయకుమారికి ఎస్‌డీసీ, కెఆర్ఆర్‌సీ శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం డిదిసిలకు ఎస్‌డీసీ, కెఆర్ఆర్‌సీ పార్వతీపురం మన్యం జిల్లా. రవికుమార్ కాకికి ఎస్‌డీసీ సివిల్ సప్లైస్, ప్రకాశం జిల్లాగా నియామకం. కె.జె.ప్రకాశ్ బాబుకు డీపీఎం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తూర్పు గోదావరి జిల్లా. పి.తేజేశ్వరరావు ఎస్ఈఎస్, లీగల్ సెల్, తిరుపతి కలెక్టరేట్, నాగార్జున కావడి ఎస్‌డీసీ ప్రోటోకాల్-2 తిరుపతి, కలెక్టరేట్ అమృత ఉమా దాసరి ఎస్‌డీసీ ఈ ఆర్‌టీటీ డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.మధుసూధనరావు డీపీఎం, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ చిత్తూరు జిల్లా. ప్రసాద్ రాజు అంబాలకి ఎస్‌డీసీ అమరావతి అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవే ఒంగోలు. శాంతి ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ ప్రకాశం జిల్లా వి.వెంకటనారాయణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఇరిగేషన్ ఎల్ఏ హెచ్ఎన్ఎస్ఎస్, ఎం రామమోహన్ ఎస్‌డీసీ, కెఆర్ఆర్‌సీ, అనంతపురం బదిలీ. తాడేపల్లిగూడెంకు కొత్త ఆర్‌డీఓగా మన్నెం సూర్యారావు నియామకం. బాపట్ల గూడూరు చీరాల, తెనాలి, వుయ్యూరు, కుప్పం, పాడేరు తదితర ప్రాంతాలకు కొత్త ఆర్‌డీఓల నియామకం. పలువురు నూతన డిప్యూటీ కలెక్టర్లకు కీలక రెవెన్యూ భూసేకరణ, విపత్తు నిర్వహణ, సివిల్ సప్లైస్ విభాగాల్లో బాధ్యతలు అప్పగించారు. సంబంధిత అధికారులు వెంటనే రిలీవ్ అయి కొత్త పోస్టింగ్ స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది.

# కాకినాడ జిల్లా కలెక్టరేట్ ఉద్యోగి ఇంటిలో ఎసిబి సోదాలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 5 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చోడవరపు శివ రామకృష్ణపై ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు కేసు నమోదు చేసి విస్తృత స్థాయిలో సోదాలు నిర్వహించారు. కాకినాడ రమణయ్యపేటలో ఎస్ఆర్ఎంటీ షాపింగ్ మాల్ వెనుక ఉన్న అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న శివ రామకృష్ణ ఇంటితో పాటు ఆయనకు సంబంధించిన ఇతర ఆస్తులు, కార్యాలయం మరియు బంధువుల ఇళ్లలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. అడిషనల్ ఎస్పీ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఇతర సిబ్బందితో కలిపి సుమారు 15 మంది అధికారుల బృందం ఈ సోదాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహిస్తూ ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, పెట్టుబడులు, నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులకు సంబంధించిన పత్రాలను పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా పొందిన చట్టబద్ధ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అనుమానాలపై ఈ దాడులు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. సోదాల సందర్భంగా లభ్యమైన పత్రాలు, ఆస్తుల వివరాలను అధికారులు స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. సోదాలు పూర్తయిన అనంతరం స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల వివరాల ఆధారంగా పూర్తి స్థాయి నివేదిక రూపొందించనున్న ఎసిబి అధికారులు, విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు కావడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారగా, ఎసిబి సోదాల్లో వెలుగులోకి వచ్చే వివరాలపై ఆసక్తి నెలకొంది.




# కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు ఘనస్వాగతం

**విజయవాడ, జూన్ 5 ప్రభాతవార్త:** కేంద్ర ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు గన్నవరం విమానాశ్రయంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. శుక్రవారం రాత్రి విశాఖపట్నం నుండి ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో మంత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్.విజయకుమార్లు విమానాశ్రయంలో పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డుమార్గాన విజయవాడ తరలి వెళ్లారు. గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రమణ్యం తదితరులు మంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

# ప్రయోగాత్మకంగా 'శ్రీవారి వైద్య సేవ' ప్రారంభం

## వైద్య నిపుణులకు టిటిడి ఆహ్వానం




**తిరుమల, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసేవ్య తిరుమల తిరుపతి దేవస్థానం వైద్య, విద్య రంగాల్లో కూడా విశేష సేవలు చేస్తోంది. ఈ సేవల్లో భాగంగా టిటిడి ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు శ్రీవారి వైద్యసేవ అమలుచేస్తున్నారు. ఈ సేవల్లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టిటిడి ఆసుపత్రుల్లో 'శ్రీవారి వైద్య సేవ' కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా శుక్రవారం మొదలైంది. ఈ సందర్భంగా ఇఒ ముద్దాడ రవిచంద్ర ప్రత్యేకంగా రూపొందించిన ఐటీ అప్లికేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణులు సేవలను శ్రీవారి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రయో గాత్మక దశలో కార్యక్రమాన్ని అమలు చేసి, పాల్గొనే వైద్య నిపుణుల నుంచి అభిప్రాయాలను సేకరించి మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు విద్య, వైద్యం, ఐటీ తదితర రంగాల్లో సేవా భావంతో ముందుకు వచ్చే నిపుణులకు టిటిడి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. టిటిడి ఆసుపత్రులు, విద్యా సంస్థల్లో సేవలందించేందుకు వచ్చే నిపుణులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో అమలు చేసి ఎక్కువ మంది నిపుణుల సేవలను వినియోగించుకునేలా చర్యలు చేపడతామని వివరించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఐటీ అప్లికేషన్ ద్వారా శ్రీవారి భక్తులు, వైద్య నిపుణులు తమకు అనుకూలమైన తేదీల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని సేవలందించవచ్చు. సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులకు మూడు రోజుల పాటు, ఎంబీబీఎస్ వైద్యులకు ఏడు రోజుల పాటు స్వచ్ఛంద సేవ చేసే అవకాశం కల్పించనున్నారు. వీరికి తిరుమల, తిరుపతిలో వసతి, భోజన సౌకర్యాలు టిటిడి ద్వారా అందించబడతాయి. తిరుమలలోని అశ్విని ఆసుపత్రి, తిరుపతిలోని స్విమ్స్, బర్డ్ ఆసుపత్రి, ఆయుర్వేద ఆసుపత్రి, పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి, ఎస్వీ గోశాల తదితర టిటిడి అనుబంధ సంస్థల్లో వైద్య నిపుణులు తమ సేవలను అందించనున్నారు. హిందూ మతానికి చెందిన ఆసక్తిగల వైద్య నిపుణులు ఆన్‌లైన్ ద్వారా టిటిడి వెబ్‌సైట్ హెచ్‌టిటి పిఎస్:// టిటిదేవస్థానమ్స్. ఎపి.జివొవి.ఇన్/ శ్రీవారి-సేవ/ఇన్‌స్టిట్యూషన్స్‌లో తమ స్లాట్‌ను బుక్ చేసుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఐ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ప్రొఫెసర్ వెంకటాచలం, సికింద్రాబాద్‌లోని కృష్ణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌వి కృష్ణ, వైజాగ్ ఆంధ్ర మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, బెంగళూరు ఇఎస్ఐ హాస్పిటల్ ఆర్థో హెచ్ఒడి డాక్టర్ పురుషోత్తం ఇతర వర్చువల్‌గా మాట్లాడారు. టిటిడి ఆసుపత్రుల్లో సేవలందించే అవకాశం కల్పించడం శ్రీవారి అనుగ్రహంగా భావిస్తున్నామని విశ్వాసం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, జెఇఒలు (విద్య, వైద్యం) డాక్టర్ శరత్, వీరబ్రహ్మం, బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ గూడూరు జగదీశ్, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రామ్, సివిఎస్ఒ మురళీకృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి వివిధ ఆసుపత్రుల డైరెక్టర్లు, వైద్యులు,



# కన్నులపండువగా వేదనారాయణస్వామి పుష్పయాగం

**తిరుపతి, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని చిత్తూరుజిల్లా నాగలాపురం వేద నారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం 11 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత వేద నారాయణస్వామి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఆలయంలోని రాములవారి మండపంలో అర్చకుల వేదమంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ పుష్పయాగం వైభవంగా జరిగింది. తులసి, చామంతి, గన్నేరు, మల్లెలు, రుక్షి , కనకాంబరాలు, రోజా, తామర, కలువ, మొగలిరేకులు వంటి 10 రకాల పూలు, 3 రకాల ఆకులతో స్వామి, అమ్మవార్లకు యాగం నిర్వహించారు. ఆద్యంతం శోభాయమానంగా సాగిన ఈ పుష్పయాగ మహోత్సవాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. పుష్పయాగం అనంతరం సాయంత్రం స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు,

# హజ్‌యాత్రికులకు ఘనస్వాగతం

**విజయవాడ, జూన్ 5 ప్రభాతవార్త:** పవిత్ర హజ్‌యాత్రను విజయవంతంగా పూర్తిచేసుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చిన యాత్రికులకు గన్నవరం విమానాశ్రయంలో హజ్‌కమిటీ చైర్మన్ సభ్యులు ఘనస్వాగతం పలికారు.

# గోమాతను జాతీయ మాతగా ప్రకటించాలి

## - కేంద్ర ప్రభుత్వానికి శివకుమార్ విజ్ఞప్తి



**తిరుమల, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** గోమాతను అధికారికంగా జాతీయ మాతగా ప్రకటించాలని యుగ తులసి ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్, టిటిడి బోర్డు మాజీ సభ్యుడు కె. శివకుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2021వ సంవత్సరంలో తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తన తీర్మానం 426 ద్వారా గోమాతను 'జాతీయ మాత'గా ప్రకటించాలని ఏకగ్రీవంగా తీర్మానించిందని ఆయన గుర్తుచేశారు. ఈ తీర్మానానికి మద్దతుగా దేశవ్యాప్తంగా ఉన్న మఠాధిపతులు, పీఠాధిపతులు, జగద్గురువులందరినీ ఏకం చేస్తూ గో మహా సమ్మేళనం నిర్వహించామని, ఆ సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను, డిమాండ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి పంపామని ఆయన వివరించారు. శుక్రవారం తిరుమలలో శివకుమార్ మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ముస్లిం సోదరులు సైతం గోమాతను జాతీయ మాతగా ప్రకటించాలని డిమాండ్ చేస్తుండటం దేశ సామాజిక సమరసతకు ఎంతో శుభపరిణామమని ఆనందం వ్యక్తం చేశారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Tender Notice No.15/2026-27/CE(GVMC)/SE(W-II)/EE (PW-MDW)/DB, dt. 03-06-2026

Number of works : 01 Work, Value of work: Rs.3,38,90,269.00

Starting Date : Dt.04-06-2026, Ending Date: 19-06-2026.

Note: Further details at http://www.tender.apeprocurement.gov.in

O/o. the EE(PW-MDW) Cell No. 99480 95518 For Commissioner

# తిరుమల సమాచారం



# ప్రజల సంక్షేమానికి మరింత కృషి

## ● తనకు ఆ శక్తినివ్వమని శ్రీవారిని ప్రార్థించా: కేంద్రమంత్రి గోయల్

**తిరుమల, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు అనూభూతి పొందుతుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం తన జన్మదినం సందర్భంగా తిరుమలను సందర్శించి శ్రీవారి ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా కొనసాగుతోందని చెప్పారు. దేశ సేవకు, ప్రజల సంక్షేమానికి మరింత కృషి చేసేలా శ్రీవారిని ప్రార్థించినట్లు మంత్రి తెలిపారు. శుక్రవారం ఉదయం కుటుంబంతో కలసి తిరుమల ఆలయం వద్దకు చేరుకున్న కేంద్ర మంత్రి గోయల్‌కు రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్ స్వాగతం పలికారు. ఆలయం లోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించిన మంత్రి గోయల్ దంపతులు ఆనందనిలయంలోని శ్రీవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఇఓ రవిచంద్ర. అదనపు ఇఓ వెంకయ్యచౌదరి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించారు. పుట్టినరోజున శ్రీవారి దర్శనం తన జీవితం ధన్యమవుతోందని అన్నారు. కేంద్రమంత్రి వెంట టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ, ఆలయ పేష్కార్ రామకృష్ణ ఉన్నారు.

**తిరుచానూరులో ఆధ్యాత్మిక శోభ:** దేశ ప్రగతి, క్షేమం కోసం తిరుచానూరు పద్మావతి అమ్మవారి సన్నిధిలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ దంపతులు ప్రార్థన చేశారు. ఆలయ సంప్రదాయాలతో శుక్రవారం ఉదయం కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ దంపతులకు స్వాగతం పలికారు. పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి టిటిడి అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మంత్రికి స్వాగతం పలికారు. బిజెపి నేత గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పీయూష్ గోయల్‌కు అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించి, దుశ్శాలువతో సత్కరించారు.

# నావద్ద తీసుకున్న డబ్బులు ఎప్పుడిస్తావ్ నాని!

## వ్యక్తిగత విమర్శలు మానుకో: యార్లగడ్డ



**విజయవాడ, జూన్ 5 ప్రభాతవార్త:** గతంలో ఎన్నికల సమయంలో తన వద్ద అప్పుగా తీసుకున్న డబ్బులు ఎప్పుడు ఇస్తావని మాజీమంత్రి పేర్ని నానిని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సూటిగా ప్రశ్నించారు. శుక్రవారం ఉదయం విజయవాడలో మీడియాతో మాట్లాడిన యార్లగడ్డ గత కొంతకాలంగా పేర్ని నాని తనపై అసత్య ప్రచారాలు చేయటం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు. తాను దివాళా తీసానంటూ పేర్ని చేసిన వ్యాఖ్యలను ఖండించిన యార్లగడ్డ ఎనిమిదేళ్ళ క్రితం తన వద్ద తీసుకున్న అప్పు ఎప్పుడు తీరుస్తావంటూ మీడియా ముఖంగా ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం చేసే తప్పులను, లోపాలను ఎత్తిచూపటం ప్రతిపక్ష పార్టీల బాధ్యత అని కాని రాజకీయపార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పేర్ని తనపై లేనిపోని ఆరోపణలు చేయటం తగదన్నారు. వ్యక్తిగత విమర్శలు చేయటం తరచు బురద చల్లటం తగదని హితవు పలికారు. పేర్ని మంత్రిగా ఉన్న సమయంలో గన్నవరం నియోజకవర్గానికి ఏం చేసారని ప్రశ్నించారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని సమయం, ప్రదేశం చెప్పాలని సవాల్ విసిరారు. గన్నవరంలో తాను మట్టి అమ్ముకోలేదని, రైతులకు పేదలకు మట్టిని ఉచితంగా ఇచ్చానని ఈవిషయం గన్నవరం ప్రజలను అడిగి తెలుసుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం తనపై పెట్టిన అక్రమ కేసుల కారణంగా తాను 19 నెలలుగా అమెరికా వెళ్ళలేకపోయానని, ప్రస్తుతం కోర్టు అనుమతితో వ్యక్తిగత పనులపై అమెరికా వెళుతున్నట్లు యార్లగడ్డ వివరించారు. తాను అమెరికాలో ఉన్న సమయంలో అసత్య ప్రచారాలు చేయవద్దని, తాను వచ్చిన తరువాత బహిరంగ చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. రాజకీయాల్లో పౌరుషపదజాలానికి తావులేదని పార్లమెంటరీ బాషలో ప్రజాసమస్యలపై నినదించాలని హితవు పలికారు. గన్నవరం అభివృద్ధి ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు యార్లగడ్డ స్పష్టం చేసారు. తరచు పవన్‌కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు చేయటం తగదన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాటిడిపి అధ్యక్షులు వీరంకి గురుమూర్తి, జనసేన నాయకులు చలమలశెట్టి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌టిఆర్ హెల్త్ వర్సిటీలో మొక్కలు నాటిన రిజిస్ట్రార్ సాయిసుధీర్

**విజయవాడ, జూన్ 5 ప్రభాతవార్త:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎన్‌టిఆర్ హెల్త్ యూని వర్శిటీలో రిజిస్ట్రార్ డాక్టర్ టి.సాయిసుధీర్ మొక్కలు నాటారు. వర్శిటీ ఆవరణలో పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించి శుభ్రం చేసారు. ఈ సందర్భంగా సుధీర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టి భవి ష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతా వరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సుధ, ఫైనాన్స్ ఆఫీసర్ టి.కృష్ణ, జాయింట్ రిజిస్ట్రార్లు జి.అజయ, పి.ప్రవీణ్‌కుమార్, జె.సుసన్న రామ్‌రాస్, ఆర్.జయశ్రీ, కె.బాలకృష్ణ, వర్సిటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : 09, కమ్యూనిటీ సెంటర్, బసంత్ లోక్, వసంత్ విహార్, న్యూఢిల్లీ - 110057

ఫోన్ : 011 49267000, టోల్ ఫ్రీ నం: 1800 212 8800, ఇ-మెయిల్: customer.care@herohfl.com వెబ్‌సైట్ : www.herohousingfinance.com | CIN : U65192DL2016PLC30148 సంప్రదించు చిరునామా : 246/1, ప్లాట్ నెం. 9, 1వ అంతస్తు, ఉత్తర భాగం, రాయల చెరువు రోడ్, పళని థియేటర్ ఎదురుగా, తిరుపతి, ఆంధ్రప్రదేశ్-517501.

సంప్రదించు చిరునామా: 246/1, ప్లాట్ నెం.9, 1వ అంతస్తు, ఉత్తర భాగం, రాయల చెరువు రోడ్, పళని థియేటర్ ఎదురుగా, తిరుపతి, ఆంధ్రప్రదేశ్-517501.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(సెక్యూరిటీ ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 యొక్క నిబంధన 8(1)తో చదువబడే అనుబంధం-IV ప్రకారం)

ఇది ఇలా ఉండగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తూ హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి అయిన క్రింది సంతకందారుడు రుణగ్రహీతలను రుణ బాకీ సొమ్మును సదరు నోటీసు యొక్క తేదీ నుండి 60 రోజులలో తిరిగి చెల్లించవలసినదిగా పిలుపునిస్తూ డిమాండ్ నోటీసు జారీ చేసారు. రుణగ్రహీత రుణ బాకీ సొమ్ము తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారుడు సదరు నిబంధనల యొక్క నిబంధన 8తో చదువబడే సదరు చట్టం యొక్క 13(4) సెక్షన్ క్రింద అతనికి సంక్రమించబడిన అధికారాలను వినియోగిస్తూ నోటీసులో వివరించబడిన ఆస్తి స్వాధీనం చేసుకున్నారని ఇందుమూలముగా ఋణగ్రహీతకు ప్రత్యేకంగా మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది.

రుణగ్రహీత ప్రత్యేకంగాను మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వర్తించరాదు. ఎటువంటి లావాదేవీలు నిర్వర్తించినా రుణం ఒప్పందం ప్రకారం మొత్తం సొమ్మును దాని వడ్డీతోసహా మరియు అపరాధ వడ్డీ, ఛార్జీలు, ధరలు వగైరా హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క ఛార్జికి లోబడి ఉండునని తెలియజేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తులు తిరిగి పొందడానికి లభ్యమయ్యే సమయానికి సంబంధించి చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) యొక్క ఏర్పాట్లను రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది.

| రుణ ఖాతా నం. | ఆబ్లిగార్(లు)/చట్టవారసుడు(లు) చట్టప్రతినిధి(లు) యొక్క పేరు | డిమాండ్ నోటీసు తేదీ/డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం | స్వాధీనం యొక్క తేదీ (నిర్మాణాత్మకం/భౌతికం) |
|---|---|---|---|
| HHFTRULAP 24000055553 | Lt లోకనాథం కరూరు యొక్క చట్టబద్ధవారసులు (తెలిసిన & తెలియని) కె.జీవిత | 06-02-2026 రూ.940605/- 06-02-2026 నాటికి బకాయి | 02.06.2026 (సింబాలిక్‌గా) |
| సెక్యూర్డ్ ఆస్తులు/స్థిరాస్తులు యొక్క వివరణ :- తిరుపతి జిల్లా, తొట్టంబేడు ఉపజిల్లా, KVB పురం మండలం, పూడి @చెన్నకేశవపురం గ్రామం, చెన్నకేశవపురం గ్రామం గ్రామ కంఠంలో, సర్వే నం. 130-4 ఖాళీ స్థలం, దానిలో RCC బిల్డింగ్‌తో, పాత ఇల్లు నం. 3-23, కొత్త ఇం.నం. 1-61, అసెస్‌మెంట్ నం. 71. ఆక్రమిస్తున్న ఆస్తి యొక్క మొత్తం అదంతా. ఈ క్రింది సరిహద్దులతో, సరిహద్దులు : తూర్పుచే: ఎస్.రాజయ్య ఖాళీ స్థలం. దక్షిణంచే: ఎస్.రాజయ్య ఇల్లు, పడమరచే : సందు వీధి, ఉత్తరంచే : వి.కాంతమ్మ ఇల్లు. స్థలం కొలతలు; తూర్పు వైపు: 49అ॥ లేదా 14.93మీ. పడమర వైపు: 49అ॥ లేదా 14.93 మీ. ఉత్తరం వైపు: 50అ॥ లేదా 15.24మీ. దక్షిణం వైపు: 50అ॥ లేదా 15.24 మీ. కొలత 2450 చ.అ. లేదా 272.22 చ.గ. యొక్క ఖాళీ స్థలం పూర్తిగా మరియు దీనిలో RCC ఇల్లు కొలతలు: తూర్పు పడమర వైపులు-19అ. ఉత్తర దక్షిణ వైపులు: 26అ॥ కొలత 494చ.అ. యొక్క RCC ఇల్లు కట్టడాలు, ఫిక్చర్‌లు, తలుపులు, తలుపు ఫ్రేమ్‌లు, కిటికీలు, విద్యుత్ సర్వీస్‌లు వగైరా.. | | | |
| HHFTRUHOU 24000054834 | చైతన్య T చిలకమ్మ T | 18-02-2026 రూ.1298773/- 15-02-2026 నాటికి బకాయి | 02.06.2026 (సింబాలిక్‌గా) |
| సెక్యూర్డ్ ఆస్తులు/స్థిరాస్తులు యొక్క వివరణ :- సర్వే నం.58, నం: 74 తిమ్మసముద్రం రెవెన్యూ గ్రామం, కుప్పన్నగారి పల్లి వద్ద వున్న (కోటిగుంట) చిత్తూరు మండలం ప్రకారం, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ ఏరియాలోని ఈ స్థలం తిమ్మ సముద్రం రెవెన్యూ గ్రామ అకౌంట్స్‌లో వున్నట్లుగా చూపబడింది. స్థలం మరియు పూర్తి కానటువంటి RCC బిల్డింగ్ కొలత 1200చ.అ॥ సరిహద్దులు కొలత 356.5 చ.గ॥ చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్-517004. సరిహద్దులచే: ఉత్తరం: టి.సుబ్రమణ్యంకు చెందిన స్థలం. దక్షిణం: రోడ్. తూర్పు: చంద్రకు చెందిన స్థలం. పడమర : రోడ్. | | | |

తేది: 06.06.2026 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం : చిత్తూరు/తిరుపతి. హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరఫున

# ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.1.11 కోట్లు విరాళం



**తిరుమల, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా అన్నప్రసాదాలు అందిస్తున్న వెంగ మాంబ అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు తమవంతుగా విరాళాలం దిస్తున్నారు. శుక్రవారం బెంగళూరుకు చెందిన వినాయక ఎంటర్ప్రైజస్ ఎండి మునిస్వామి నారాయణగౌడ్ రూ.1.11కోట్ల విరాళాలిచ్చాడు. తిరుమలలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుని కలిసి విరాళం అంద జేశాడు. ఏడుకొండల వేంకటేశ్వర స్వామిపై భక్తి విశ్వాసాలతో విరాళం అందజేసినట్టు దాత తెలిపారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ బిఆర్‌నాయుడు అభినందించారు.

# నేటి నుండి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



**తిరుమల, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి అనుబంధంగా ఉన్న చిత్తూరు జిల్లా కార్వేటి నగరంలో వేణుగోపాలస్వామి ఆలయం భక్తుల కోరికలను తీర్చే కల్పవృక్షంగా, సంతానం లేని దంపతులకు సంతాన భాగ్యాన్ని ప్రసాదించే దివ్యక్షేత్రంగా విశేష ఖ్యాతి పొందింది. ఈ పవిత్ర ఆలయంలో నేటి నుండి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించ నున్నారు. బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా శుక్రవారం సాయంత్రం మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం నిర్వహించి అనంతరం అంకురార్పణ కార్యక్రమం నిర్వహించారు.

బంగారం వేలం నోటీసు

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ("BFL");
రిజిస్టర్డ్ కార్యాలయం: ముంబయి - పూణె రోడ్డు,
అకుర్ది, పూణె 411035

BAJAJ FINANCE

ఋణగ్రహీత(లు) మరియు సాధారణ ప్రజానీకానికి ఇందు మూలంగా తెలియచేయునది ఏమనగా ఈ కింద పేర్కొనబడిన ఋణగ్రహీతలకు పలుమార్లు నోటీసులు పునరావృతం చేసినప్పటికీ తిరిగి చెల్లింపు చేయడం లో విఫలమయ్యారు లేదా కావలసిన లాభం కేటాయించడం లో విఫలమయ్యారు, ఈ పేర్కొనబడిన కారణం వలన, లోన్ చెల్లింపు కోసం సెక్యూరిటీగా ఋణగ్రహీత(లు) అందచేసిన గోల్డ్ ఈ కింది నియమాలకు లోబడి "యథాతథంగా" వేలం వేయబడుతుంది:

1. పబ్లిక్ నోటీసు యొక్క పూర్తి వివరాలు యాక్సెస్ చేయడానికి కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. (గోల్డ్ వివరాలు & స్థూల బరువు); 2. All about our Terms and Conditions - Bajaj Finance Limited పై పూర్తి బిడ్డర్ నియమాలు ఉపలబ్ధం ఉన్నాయి; 3. వేలం వేసే రోజు లేదా అంతకంటే ముందుగా ఆన్‌లైన్ ద్వారా బిడ్డర్స్ ₹25,000/- ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD) తప్పనిసరిగా డిపాజిట్ చేయాలి; 4. వేలం వేసే వేదిక వద్ద ఉదయం 10 గంటలకి చెల్లుబాటయ్యే గుర్తింపు & చిరునామా తో తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలి.

వేలం తేదీ లో ఏదైనా మార్పు గురించి వేలం కేంద్రం లో ప్రదర్శించబడుతుంది. బిడ్ సమర్పణ పైన పేర్కొన్న నియమాలను అంగీకరించినట్టుగా పరిగణించబడుతుంది. ఏదైనా సందేహాల కోసం, wecare@bajajfinserv.in ను సంప్రదించండి.

(10-07-26) అమలాపురం - మెయిన్ రోడ్: PGC2SGL19588709, 22972750. అనకాపల్లి - భార్గవి ప్లాజా: PBV8SGL18403987, 20385549. అనంతపుర్ - కళ్యాణదుర్గ్ రోడ్: PIV9SGL19806410, 19801572, 20927211. అనంతపుర్ - సుభాష్ రోడ్: PGA7SGL19435527, 22797204, 23170130. బద్వేల్ - ఫోర్ రోడ్ సర్కిల్: PJU6SGL19615301, 21061583, 23155711, 23545087, 23550149. భీమవరం - ప్రకాశ్ చౌక్: PEG7SGL21685473. బొబ్బిలి - పెద్ద బజార్ మెయిన్ రోడ్: PKI4SGL20946839, 22832271. చిలకలూరిపేట్ - ఎన్ఆర్‌టి సెంటర్: PJU5SGL16775254, 16897937, 18394437. చీరాల - సంత బజార్: PEJ9SGL18616163, 19441036, 22936381, 23557205. (13-07-26): చిత్తూరు - డి ఐ రోడ్: PMM5SGL20135603. ఏలూరు - వసంత్ మహల్ స్ట్రీట్: PEG8SGL22234455. గుంటకల్ - వెజిటబుల్ మార్కెట్: PBV9SGL19331804, 20192519, 20937377. గుంటూర్ - మంగళగిరి: POL8SGL20300410. గుంటూరు - వినుకొండ: PMM3SGL22502870, 22795895. హిందూపుర్ - ధన లక్ష్మి రోడ్: PEG4SGL19159608, 19157816, 19149695, 20891251, 20890530, 22119301, 22425326, 22970129, 23234977. జంగారెడ్డిగూడెం - ఏలూరు మెయిన్ రోడ్: PGH1SGL21778909, 23218336. (14-07-26) కదిరి -

బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్

# తిరుమలలో మొక్కనాటిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్



**తిరుమల, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి:** పవిత్రపుణ్యక్షేత్రం పవిత్రతను మరింత కాపాడుకోవడానికి మొక్కలు నాటడం అలవరచుకోవాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో పాల్గొని మొక్క నాటారు. తిరుమలలో తన తల్లి పేరుతో మొక్క నాటడం ఎంతో సంతోషాన్ని కలిగించింద న్నారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి చిన్నారి తమ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటి, జీవితాంతం దానిని సంరక్షి ంచాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి మోడీ ప్రారంభించిన ఈ కార్యక్రమం పచ్చదనం పెంపొందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ ఎం. లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్, డిప్యూటీ సిఎఫ్ఒ ఫణికుమార్ నాయుడు, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ పాల్గొన్నారు.

వార్త

పరుగెత్తేవారు వెనక్కి చూడకుండా ఎలా పరుగెడతారో, విజయం వైపు పయనించేవారు కూడా ముందుకే కానీ వెనక్కి చూడకూడదు.

– న- దిజ్రేలి


# 'వెట్టి'కి సుంకమే ప్రాయశ్చిత్తమా!

ఉన్నట్టుండి శ్వేతసౌధాధిపతి డోనాల్డ్ ట్రంప్‌కు వెట్టి చాకిరీ మీద కరుణరసం పుట్టుకొచ్చింది. 'వెట్టి' అనాదిగా ఉన్నా రానురాను ప్రపంచం అధునాతన రూపం సంతరించుకుంటున్న కొద్దీ వెట్టిచాకిరి ఏ రూపంలో ఉన్నా దాని అసలు రూపాన్ని మార్చుకుం టోంది. ట్రంప్ ఏ సందర్భంలో ఇలాంటి ప్రస్తావనలు తెచ్చినా హాస్యాస్పదంగానే ఉంటాయి. బానిసత్వం గురించి అమెరికాలో పాతతరం వారు ఎన్నో విషయాలు చెబుతారు. అక్కడ బానిసత్వం ఏ స్థాయిలో ఉండేదో'రూట్స్' పుస్తకం చదివితే తెలుస్తుంది. బానిస శృంఖలాలలో ఎవరెలా మగ్గిపోయారో స్పష్టం చేసిన పుస్తకమది. ఏడు తరాల బాధామయ కథ అది. భారత్‌తో మధ్యంతర వాణిజ్య ఒపనపందాలు ఓ కొలిక్కి రానప్పుడల్లా ఔరంగజేబు విధించిన 'జిజియా' పన్ను వంటి కొత్త ఆలోచనలు చేయడం ట్రంప్‌కు అలవాటుగా మారింది. ఈసారి ఆయన మదిలో భారత్ వంటి 54 దేశాలపై 12.5 శాతం అదనపు టారిఫ్ విధించడానికి సిద్ధపడ్డారు. దానికి కారణం బహు విచిత్రంగా ఉంది. వెట్టిచాకిరీతో కార్మికుడు తయారు చేసిన వస్తువులను తమ దేశానికి సరఫరా చేసిన నేరానికన్నట్లు వినడానికే విచిత్రంగా అనిపిస్తోంది. విశేషమేమిటంటే ఇదే ఆరోపణలపై అదనపు పారిశ్రామిక సామర్థ్యానికి సంబంధించి జరుగుతున్న ఆందోళనలపై భారత్ తదితర 60 దేశాలపై మొన్న మార్చి 11న యుఎస్‌టిఆర్ (అమెరికా వాణిజ్య ప్రతినిధుల కార్యాలయం) ప్రారంభించింది. ఆ విచారణ పర్యవసానంగా వెల్లడైన వివరాలను కూడా అమెరికా వెల్లడించింది. భారత్‌తోపాటు చైనా,జపాన్, బ్రెజిల్, ఆస్ట్రేలియా, బ్రిటన్, ఇజ్రాయెల్, ఖతార్, రష్యా, సింగపూర్, దక్షిణ కొరియా, శ్రీలంక తదితర దేశాలపై 'వెట్టి చాకిరి' బాపతు ఆరోపణలపై యూఎస్‌టిఆర్ రాయబారి జెమీసన్ గ్రీన్ పలు అంశాలను ఏకరువుపెడుతూ కొన్ని రకాలు సుంకాలను విధించాలని సూచించింది. ఆమేరకు 54 దేశాలపై 12.5 శాతం, పాకిస్థాన్‌తో సహా ఆరు దేశాలపై 10 శాతం సుంకాలను విధించమని ప్రతిపాదిస్తూనే బ్రెజిల్ దేశంపై కాస్త ఎక్కువే 25శాతం వడ్డించింది. కార్మికుల స్వేదాన్ని ఉపయోగించుకొని ఆయా దేశాల తయారీరంగం బతికేస్తోందని అమెరికా అభ్యంతరం. బలవంతపు శ్రమ శక్తి లేకుండా ఏ దేశమూ తమ తయారీ రంగాన్ని అభివృద్ధి పంచుకుందన్న దాఖలేవీ లేవు. అధునాతన యంత్రాలెన్నో ఉన్నా శ్రామిక శక్తి వంతు పాత్ర దానికీ ఉంటుంది. యంత్రాలలో పని చేయించారన్న మిషతో దాని మీద, రేపెపుడో కృత్రిమ మేధలో చేశారని వాటి మీద, సుంకాలు విధించడం, ఇకపై అమెరికాకే చెల్లుతుందేమో! అగ్రరాజ్యం ఇలాంటి చిత్ర విచిత్ర విన్యాసాలకుకారణమవుతూ 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు! అన్న మాదిరి ట్రంప్ వ్యవహరిస్తుంటే నివ్వెరపోవడం తక్కిన ప్రపంచానిది అన్నట్లుంది. భారత్ వంటి దేశం కూడా వేతన, భద్రతా ప్రమాణాలుపాటించట్లేదన్నది అమెరికా పాట.అసలు సిసలు వస్తు కొనుగోలుదారు కేవలం వస్తు నాణ్యత మాత్రమే చూసుకుంటాడు కానీ ఎలా తయారైంది?ఎవరితో తయారు చేయించారు? అనే సందర్భాలపై దృష్టిసారించడు.కానీ ఇక్కడ అమెరికా వ్యవహారం మరోలా ఉంది. పక్క వారు ఉత్పత్తి చేసిన ఉత్పత్తులు నాణ్యత లేనివనో, నాసిరకంగా ఉన్నాయనో సరుకును తిరస్కరించడం ఓ వాణిజ్య పద్ధతి. అంతే తప్ప వాటి తయారీలో లోపభూయిష్టతను స్పష్టం చేయకుండా ఆరోపణలు చేయడం, సుంకాలు వడ్డించడం అమెరికాకే చెల్లింది. జగతంతా ఇదెక్కడి వాదన? అని ప్రస్తావించుకోవాల్సిన అగత్యమేర్పడింది. ఒకపక్క భారత్‌ను తమకు అత్యంత ప్రధాన భాగస్వామిగా ఉన్నదేశంగా ప్రస్తుతిస్తూనే ఎగుమతి నిబంధనలను ఎవరూ ఉల్లంఘించినా ఒప్పుకోమంటూ నిబంధనల ఉల్లంఘనకు భారత్ ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందేనని అమెరికా హుంకరిస్తోంది. భారత ప్రధాని నరేంద్రమోడీ తనకిష్టుడని, ఆయన వల్లే తమకు బోలెడంత ఆదాయం వస్తోందని ట్రంప్ చెప్పడం చూస్తే భారత్ మీద ఆయనకెలాంటి ప్రేమ ఉందో అర్థమవుతోంది. ఒకపక్క ఇరాన్‌తో యుద్ధ విరమణ ఒప్పందమేమీ ఖరారు కాక సతమతమవుతున్న ట్రంప్ ఆటవిడుపుగా భారత్‌పై సుంకాల విధింపు వంటి చర్యలకు పాల్పడుతున్నారేమో!.ఇరాన్‌పై తదుపరి సైనిక చర్యలు చేపట్టి మరికొన్ని ఉద్రికత్తల ద్వారా మరింత పరాభావం పొందకూడదన్న అభిప్రాయంతో అలాంటి చర్యలేమీ వద్దని ట్రంప్‌ను కాంగ్రెస్ ప్రతినిధుల సభ నిలువరించింది. ఈ సందర్భంలో కూడా ట్రంప్ కొందరు సొంత పార్టీ వారి మీద అక్కసు వెళ్లగక్కారు. ఈ సమయంలో తీర్మానమేంటని విరుచుకుపడుతూ, వారిని దేశద్రోహులుగా చిత్రీకరించడానికే వెనుకాడలేదు. సభలో మెజార్టీ ఉన్నా కొందరు అధికార రిపబ్లిక్ పార్టీ సభ్యులు సైతం అమెరికన్ అధ్యక్షుడి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానించారు. ఆమేరకు ప్రవేశపెట్టిన తీర్మానానికి ఆమోద ముద్రపడింది. నలుగురు రిపబ్లికన్ పార్టీ సభ్యులు తనకు వ్యతిరేకంగా వ్యవహరించడంతో ఆ తీర్మానం నెగ్గింది తప్ప ప్రత్యేకత ఏమీలేదని ట్రంప్ సరిపెట్టుకున్నారు. దూకుడు స్వభావం తొందరపాటు నిర్ణయాలే తప్ప తనకు వ్యతిరేకంగా గళం విప్పుతున్న వారి మనోగతం తెలుసు కోవడానికి ఏమాత్రం ఆయన ముందుకు రావడం లేదు. ఈ తీర్మానం ఆమోదంతో ఇరాన్‌పై అమెరికా చేసిన యుద్ధానికి ఆమోదం లభించనట్లే. ఈ పరిస్థితు ల్లో అమెరికా తన ప్రేలాపనలన్నీ ఉపసంహరించుకుని తోకముడవడం ఒక్కటే తక్షణ కర్తవ్యం. 'ది వార్ పవర్ యాక్ట్' 1973 ప్రకారం అమెరికా ఏ ఇతర దేశంపైనైనా యుద్ధం ప్రకటిస్తే 60 రోజుల్లోగా ఆమోదం పొందాలి. కానీ ఇప్పుడది వీగిపోయింది కనుక ఇరాన్‌పై అమెరికా యుద్ధం ముగిసినట్లే.



చెడును వేలెత్తిచూపడం కాదు, ఆ స్థానంలో మంచిని ప్రతిష్ఠించటమే అసలైన సంస్కరణ.

– జ.ముర్రే



దూరంగా ఏముందో ఆలోచన చేయనివారికి, సమీపంలోనే ప్రమాదం కాచుకుని ఉంటుంది.

– హెచ్. లాంగ్‌ఫెలో

## ప్రజావాక్కు

### యోగా చేద్దాం రండి..

మనం 2026లో జీవిస్తున్నాము. అత్యంత ఆధునిక జీవితాన్ని ప్రపంచ ప్రజలు అనుభవిస్తున్నారు. కానీ మనం మాత్రం మన ఆలోచనలు చేష్టలు వెనక్కి వెనక్కి పోతున్నట్లుగా ఉంది.పూర్వకాలంలో మన కథలలో చెప్పుకునే ఋషులుమునులు,గోచీలుపెట్టుకొని,కమండలం చేతపట్టి అడవులకు వెళ్ళితపస్సు,ధ్యానం చేసుకునేవారు.అలాంటిదేయోగా. పతంజలి క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల క్రితం యోగాను ప్రతిపాదించాడు. మొదటిలోనే చెప్పుకున్నాడు.యోగా అనేది ఈ జీవాత్మను పరమాత్మలో లీనం అయ్యేందుకుదగ్గరి మార్గంయోగాఅని. జీవాత్మ పరమాత్మలో కలవడంఅంటే చనిపోవడం.మరి అలాంటి యోగాను బీజేపీ వారు ప్రచారం చేస్తున్నారు. యోగా చేసే క్రమంలో మెదడుకు ఆక్సిజన్ శాతంతగ్గి, కార్బన్ డయాక్సైడ్ శాతంపెరిగి ఇలాంటి భ్రమలు వస్తాయని తెలియక ఇవన్నీ తన యోగవలనే వస్తాయని తన యోగా శాస్త్రంలో రాసుకున్నందున , అది చదివిన వారు యోగ వలన ఈ శక్తులు వస్తాయని భ్రమించి ప్రచారం చేస్తున్నారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ప్రవర్తన నియమావళి పాటించాలి

ఇటీవల దిగ్భ్రాంతి కలిగిస్తున్న రోడ్ ప్రమాదాల్లో ఆర్‌టిసికి చెందినవి కొంత తక్కువే అని చెప్పొచ్చు. డ్రైవర్ విధులు తన ఆరోగ్యం, కంటిచూపుతోపాటు ఎంతో ఏకాగ్రత, ముందుచూపుతోఉంటాయి.ప్రత్యేక అవసరమైనది కొంత నియమిత దూరం, కాలంతర్వాత అదనపు డ్రైవర్ అందుబాటు, సిబ్బంది కొరతఉన్నా, రాబోయే సమయం, పొరపాటు అనూహ్యమైనది. వీటి దృష్ట్యా సిబ్బందికి వైద్య పరీక్షలు కార్పొరేషన్ స్వయంగా చేసేది మంచి విధానం. దానితో పాటు ఇతర నియమాలు, ట్రాఫిక్ అధికారులు ప్రతీనెలతనిఖీ చేస్తే దుస్సంఘటనల నివారణ సాధ్యమే. ఉద్యోగులు వారి ప్రవర్తన నియమావళి పాటించాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### భక్తులకు వసతులు కల్పించాలి

రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో నిరంతరం దేవాలయ సందర్శనానికి విచ్చేసే భక్తులకు సరైన వసతులు అయినటువంటి నీరు, పరిశుభ్రత లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున అధికారులు ఎప్పటికప్పుడు సందర్శించి భక్తులకు సరైన వసతులు కల్పించి భక్తుల సమస్యలను పరిష్కరించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### అగ్నికి అలసత్వమే ఆజ్యం

ఢిల్లీలో ఒకహోటల్‌లో అగ్నిప్రమాదం సంభవించి, 21 మంది ప్రాణాలు కోల్పోవడం,మరికొంత మంది తీవ్ర గాయాలు పాలవ్వడంశోచనీయం. అగ్నిప్రమాదానికి కారణాలు ఏవైనా, ఇంత స్థాయిలో ప్రాణ నష్టం జరగడం, అదీ దేశ రాజధాని నడిబొడ్డున జరగడం ఆక్షేపణీయం. అధికార గణం అవసరమైన నిబంధనల్నివాణిజ్య సముదాయాలు పాటించేలా చూడకపోవడం వల్లనే ఇలా మాటిమాటికీ ప్రమాదాలు, ప్రాణ నష్టాలు జరుగుతున్నాయి. కాబట్టినేరంలో అధికభాగం వాటా వారిదే.ఆ 21 మందిలో విదేశీయులు కూడా ఉన్నట్లు, వారు చికిత్స నిమిత్తమై వచ్చినట్లువార్తలు చెబుతున్నాయి. భారత్‌లో నాణ్యమైన వైద్యం చవకగా దొరుకుతుందని ఆశించి వచ్చిన వాళ్ళు ఇలా అగ్నికి ఆహుతికావడం మాటల్లో చెప్పలేని విషాదం. సదరు హోటల్‌కిరాకపోకలకు ఒకటేదారి. ప్రవేశమైనా, బయటకుపోవడమైనా ఆ ఒక్క ద్వారమే గతి. ఎలాంటి అనుమతులూ లేకుండా నడుస్తున్నట్లు అధికారులిప్పుడు చెప్తున్నారు. ఈఅంతర్జాల యుగంలో, దేశానికేరాజధానిలో అంత కష్టమా?తెలిసిన తర్వాతనైనా చర్యలు తీసుకోవాలి కదా!

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### మనవతా విలువలు గొప్పవి

ఆప్తులు అర్థాంతరంగా మరణిస్తే రాజకీయాలకు స్వస్తి పలికిన వారు, పదవులను తృణప్రాయంగా భావించి వాటిని వదులుకున్నవారు చాలా తక్కువగా ఉంటారు. కానీ వారి వారసులమంటూ రాజకీయాల్లోకి వస్తున్న వారు ఎక్కువ. ఇలాంటి వారు ఎన్నికల్లో పోటీ చేస్తూ, గెలిచిన మూడో రోజు మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న వారు, పదవుల కోసం అధికారం కోసం ఆప్తులైన వారికి వెన్నుపోటు పొడుస్తున్నవారు కోకొల్లలుగా ఉంటున్నారు.అయితే ధనం, పదవులు, అధికారం కన్నా మానవతా విలువలు గొప్పవి. పదవులు ఈ రోజు ఉంటాయి, రేపు పోతాయి. కనుక పదవుల కోసం ఆరాటపడేవారు ప్రజలను ఎక్కువ పట్టించుకోరనే భావన ప్రజల్లో ఉంది. దీనిని రూపుమాపాలి.

- శాస్త్రి, హైదరాబాద్

### పెండింగ్ కేసులను పరిష్కరించాలి

తెలంగాణా రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లోన్యాయం జరుగుతుంది అని భావించిన ప్రజలు పెట్టుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. భూమి కబ్జాలు,అక్రమ నిర్మాణం గురించి దరఖాస్తు చేసి సంవత్సరాల నుండి ఎదురు చూస్తున్నారు. రెవిన్యూ అధికారులు భూమి రికార్డుల్లే అని తపిస్తున్నారు. పోలీసులు కూడా ఏం న్యాయం చేయడం లేదు.

- కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# బలిపీఠంపై విద్యార్థి లోకం!

**తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి లక్షలాది రూపాయలు తల్లిదండ్రులు తమ భవిష్యత్ కోసం ఫీజుల రూపంలో చెల్లించడం, వారు ఆశించిన మేరకు తాము చదవలేకపోవడం, చదివినా మనస్సుకు ఎక్కకపోవడంతో మానసిక సంఘర్షణకు గురై అటు తల్లిదండ్రులకు తాము ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు చెప్పి ఒప్పించలేక, ఇటు బోధన చేస్తున్న అధ్యాపకులతో మనస్సు విప్పి తమ బాధను వివరించలేక మానసిక ఒత్తిడిని తట్టుకోలేక తనువు చాలిస్తున్నారు. అయితే కొందరు అధ్యాపకులు కొన్ని సందర్భాల్లో విద్యార్థుల ఒత్తిడి, ఇబ్బందులు అర్థమైనా యాజమాన్యాల వ్యాపార కాంక్షకు వెరసి పెదవి విప్పలేకపోతున్నారు. ఇలా ఈ చావులకు ఎన్నో కారణాలున్నాయి. రాజకీయాలకు అతీతంగా పాలకులు ఆలోచించాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడిలేని విద్యావిధానాల రూపకల్పన దిశగా మేధావులు అడుగులు వేయాలి. విద్యార్థి లోకాన్ని ఈ బలవంతపు చావుల నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన తరుణమిది.**

దామెర్ల సాయిబాబ

మేధస్సును పంచేవారు మనిషి, మనస్సును పంచే వారు మహర్షి అన్నారు. మన విద్యాలయాల్లో అంతో ఇంతో మేధస్సును అందిస్తున్నారు. కానీ మనస్సును పంచేవారు కరవైపోతున్నారేమోననిపిస్తున్నది. అందుకే పరిస్థితులు వికటించి భావి భారత పౌరులుగా ఎదిగి ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాల్లో అంధకారం అలుముకొని అర్థాంతరంగా బలవన్మరణాలకు బలైపోతున్నారు. దీనికితోడు పరీక్షల నిర్వహణలో జరుగుతున్న అవకతవకలు ప్రధానంగా అధికార గణం అసమర్థత, అలక్ష్యం,అవినీతి తదితర కారణాలు ఎన్నో విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఏదో కిందిస్థాయిలో పరీక్షల నిర్వహణ కాదు కీలకమైన, విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసే, 'నీట్, సిబిఎస్ఇ' లాంటి పరీక్షలు కూడా సమర్థవంతంగా నిర్వహించలేకపోవడం దురదృష్టకరం. విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందినప్పటి నుండి ఈ దురదృష్టపు పరిస్థితులు దాపురిస్తున్నాయి. పాలకుల చేతగాని తనానికి నిర్లక్ష్యానికి, అసమర్థతకు విద్యార్థి దశలోనే అర్థాంతరంగా తనువు చాలిస్తున్న భావిభారత పౌరులను చూసి దేశం నివ్వెరపోతున్నది. ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏటా దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతుండడం సర్వత్రా ఆవేదన, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తల్లిదండ్రుల ఆశల, ఆకాంక్షలను నెరవేరుస్తూ కుటుంబాల్లో కాంతులు వెదజల్లి భవిష్యత్‌లో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన దివ్వెలు అర్థాంతరంగా ఆరిపోతున్నాయి. కని, పెంచిన వారిఆశలను చిదిమేస్తూ కుటుంబాల్లో అంధకారాన్ని నింపుతూ కనుమరగవుతున్న ఈ విద్యాదీపాల వెనుక ఎన్నో కారణాలు పైకి కన్పిస్తున్నా ఒత్తిడి తట్టుకోలేకపోవడమే ప్రధాన కారణమనేది కాదనలేని వాస్తవం. మొన్న 'నీట్' పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవలు పరాకాష్ఠగా చెప్పొచ్చు. ఒక్కసారి పరీక్షలు రాసి ఊపిరిపీల్చుకొని సెలవుల్లో బంధుమిత్రులతో గడిపేందుకు వెళ్లిన విద్యార్థులకు మళ్లీ పరీక్షలు రాయడమనేది ఎంత కష్టమో, మరెంత ఒత్తిడికి గురవుతారో మాటల్లో వర్ణించలేం.గత నెల మూడో తేదిన జరిగిన నీట్ పరీక్షలను రద్దుచేసి మళ్లీ ఆ పరీక్షను ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు పాలకులు ప్రకటించారు. దీంతో మళ్లీ పరీక్ష రాయాలనే ఒత్తిడి పెరిగి మధ్యప్రదేశ్‌కు చెందిన నీట్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఉదంతం అందరిని కదిలించి వేస్తున్నది. కేవలం కుమార్తె ఆకాంక్ష చతుర్వేదిని డాక్టర్‌ను చేయాలనే లక్ష్యంతో వ్యవసాయం ఆధారంగా జీవనం సాగించే ఆ కుటుంబం నాగపూర్ చేరుకొని కోచింగ్ ఇప్పించారు. వంటవాడిగా మారి సంపాదించిన డబ్బు సరిపోకపోవడంతోమరో మూడు లక్షలరూపాయలకు పైగా అప్పులు చేశాడు. గత నెలలో జరిగిన నీట్ పరీక్షల్లో బాగా రాసానని, ఎక్కడో దగ్గర మెడికల్ సీటు వస్తుందని కుమార్తె చెప్పడంతో ఆ కుటుంబం ఎంతో సంతోషపడింది. ఈ తరుణంలో నీట్ పరీక్షాపత్రాలు లీక్ కావడంతో రద్దు చేయడం మళ్లీ పరీక్షలు పెడుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో నిస్పృహకు గురైన ఆకాంక్ష తనకు మళ్లీ పరీక్షలు రాసే శక్తి లేదని, కుటుంబ సభ్యుల ఆశలను నెరవేర్చలేకపోతున్నాననిఅందుకు క్షమించాలని తల్లిదండ్రులను కోరుతూ లేఖ రాసి ఆత్మహత్య చేసుకొంది. ఇక పోతే ప్రతిష్టాకరమైన సిబిఎస్ఇలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు కొంతకాలంగా వినిపిస్తున్నా అంతగా పట్టించుకోలేదు. ఈ అవకతవకలపై

## ఒక్క మాట

ఆన్‌లైన్ మూల్యాంకన సేవలు అందించే సంస్థ ఎంపికలో చోటు చేసుకున్న అక్రమాలపై బాధితుడైన ఒక విద్యార్థి పార్లమెంట్ స్థాయీ కమిటీ ముందు ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆ సంస్థ ఛైర్మన్, కార్యదర్శులపై బదలీవేటు వేసి కొత్తవారిని నియమించింది. సిబిఎస్‌సి వ్యవహారాలపై కూడా నీలి నీడలు కమ్ముకొంటున్నాయి. ఉన్నత స్థాయిలో పరీక్షలేకాదు దేశంలో పరీక్షలు నిర్వహణ ఒక మిథ్యగా మారిపోతున్నది. ఏది ఏమైనా దేశంలో రానురాను విద్యార్థుల ఆత్మహత్యలు అంతకంతకు పెరిగిపోతున్నాయి. శుక్రవారం నాడు కూడా ఇంటర్మీడియేట్ సెకండియర్ విద్యార్థి హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ కాలేజీలో ఆత్మహత్య చేసుకున్నాడు. జాతీయ నేర గణాంకాల విభాగం (ఎన్‌సీఆర్‌పీ) లెక్కల ప్రకారమే 2023లో దేశవ్యాప్తంగా పదమూడువేల ఎనిమిది వందల తొంభై మందికిపైగా విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. భారత్‌లో 1995–2019 మధ్యకాలంలో వివిధ కారణాలతో లక్షాడెబ్భైవేల మందికిపైగా విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడినట్లు అధికార రికార్డులే వెల్లడిస్తున్నాయి.ప్రతిగంటకు సగటున ఒక విద్యార్థి మరణానికి పాల్పడుతున్నాడని గతంలో ఎన్‌సీఆర్‌బి పార్లమెంటుకు నివేదించింది. పోని పది, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులతో పాసై పోటీ పరీక్షల్లో ర్యాంకులు సంపాదించి ఐఐటీల్లో సీట్లు పొందిన వారు సైతం ఈ చదువుల ఒత్తిడికి బలైపోతున్నారు. ప్రతిష్టాకరమైన ఐఐటీ, మెడిసిన్ సీట్లు వచ్చాయని ఆనందంగా చేరుతున్న విద్యార్థులు అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. కారణాలు పాలకులకు తెలియనివి కావు. ప్రాచీన భారత విద్యావిధానంలో కళలకు చక్కని స్థానం ఉండేది. ఆచరణాత్మక పరీక్షా విధానాలను అవలంబించేవారు. మారుతున్న కాల,మాన పరిస్థితులకు అనుగుణంగా తల్లిదండ్రుల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన విద్యను అందించడంలో ప్రభుత్వపరంగా విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. విధానాలు, ఆలోచనలు ఎన్నో ఉన్నాయి. కానీ అమలుకు నోచుకోవడంలేదు. ఫలితంగా ప్రైవేట్ విద్యపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.మరొకపక్క పిల్లల చదువులకై తల్లిదండ్రులలో ఆరాటం, ఆసక్తి అంతకంతకు పెరిగిపోతున్నది. వారిని చదివించుకోవడం ఒక్కటే జీవిత లక్ష్యంగా మారి అందుకోసం తల్లిదండ్రులు చేస్తున్న త్యాగాలు చూస్తుంటే విస్తుపోవాల్సిందే. పిల్లల చదువుల కోసం పుట్టి పెరిగిన ఊరును వదిలి కడుపు చేతపట్టుకొని పట్టణాలకు, నగరాలకు వలసవచ్చి చిన్నచితక ఉపాధితో జీవనం సాగిస్తున్నారు. వచ్చే కొద్దిపాటి జీతంతో అర్థాకలినైనా భరిస్తూ పొదుపు చేసి ఫీజులు కడుతున్నారు. కేవలం కార్పొరేట్ కాలేజీల్లో చదువుకుంటేనే తాము కోరుకున్న కాలేజీల్లో కావాల్సిన కోర్సులో సీటు దొరుకుతుందనే ప్రచారం పెరిగిపోయింది. ఇంజినీరింగ్, ఐఐటి, మెడికల్లాంటి ప్రొఫెషనల్ విద్యను అభ్యసించే పిల్లలకు వెంటనే ఉద్యోగం దొరకడం, లేక విదేశాల్లో జీవనోపాధి లభించడం చూస్తున్న తల్లిదండ్రులు తమ పిల్లలకు కూడా అలాంటి జీవన సుఖం అందాలని ఆరాటపడుతున్నారు. ఈ బలహీనతలను సొమ్ము చేసుకోవడానికి కొన్ని కార్పొరేట్ కాలేజీలు వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరంగా ఉంది. ఇక పిల్లలపై పడుతున్న ఒత్తిడి అంతా ఇంతాకాదు. ఆటపాటలు లేవు. మరో ధ్యాసా వ్యాపకానికి అవకాశం లేకుండా చదివే లక్ష్యంగా రాత్రింబవళ్లు వారిపై ఒత్తిడి పెంచి చదివిస్తున్నారు. అటు మానసిక ఒత్తిడిని భరించలేక ఇటు తల్లిదండ్రులను ఒప్పించలేక తమలో తాము నలిగి నలిగి విపరీతమైన టెన్షన్‌కు గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో తాము ఎందుకు ఆత్మహత్య చేసుకోవాల్సివచ్చిందో స్పష్టంగాలేఖలు రాసి తనువు చాలిస్తున్నారు. తలతాకట్టుపెట్టి అప్పోసొప్పో చేసి లక్షలాది రూపాయలు తల్లిదండ్రులు తమ భవిష్యత్ కోసం ఫీజులరూపంలో చెల్లించడం, వారు ఆశించిన మేరకు తాము చదవలేకపోవడం, చదివినా మనస్సుకు ఎక్కకపోవడంతో మానసిక సంఘర్షణకు గురై అటు తల్లిదండ్రులకు తాము ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులు చెప్పి ఒప్పించలేక, ఇటు బోధన చేస్తున్న అధ్యాపకులతో మనస్సు విప్పి తమ బాధను వివరించలేక మానసిక ఒత్తిడిని తట్టుకోలేక తనువు చాలిస్తున్నారు.అయితే కొందరు అధ్యాపకులు కొన్ని సందర్భాల్లో విద్యార్థుల ఒత్తిడి, ఇబ్బందులు అర్థమైనా యాజమాన్యాల వ్యాపార కాంక్షకు వెరసి పెదవి విప్పలేకపోతున్నారు.ఇలా ఈ చావులకు ఎన్నో కారణాలున్నాయి. రాజకీయాలకు అతీతంగా పాలకులు ఆలోచించాలి.స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడిలేని విద్యావిధానాల రూపకల్పన దిశగా మేధావులు అడుగులు వేయాలి.విద్యార్థిలోకాన్ని ఈ బలవంతపు చావుల నుంచి బయటపడేసేందుకు ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన తరుణమిది. ●

# రైతు డిస్కంతో మెరుగైన వ్యవ'సాయం'!

తిప్పర్తి శ్రీనివాస్

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే వ్యవసాయ రంగం ఎన్నో దశాబ్దాలుగా అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. రైతు శ్రమతో దేశానికి అన్నం అందుతున్నప్పటికీ, అతని జీవితంలో స్థిరత్వం మాత్రం ఇప్పటికీ కలగలేదనే వాస్తవం మన ముందుంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వాలు వ్యవసాయ రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ పలు సంస్కరణలు చేపడుతున్నాయి. ఆ క్రమంలో 'రైతు డిస్కం'ఏర్పాటు అనే ప్రతిపాదన ఇప్పుడు చర్చనీయాంశమైంది. విద్యుత్ సరఫరా వ్యవస్థను రైతు అవసరాలకు అనుగుణంగా ప్రత్యేకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో తీసుకొస్తున్న ఈ ఆలోచన వ్యవసాయ రంగానికి ఎంతవరకు మేలు చేస్తుందన్నది విశ్లేషణీయ అంశం. ప్రస్తుతం వ్యవసాయానికి విద్యుత్ సరఫరా అనేది సాధారణ డిస్కంల పరిధిలోనే కొనసాగుతోంది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తున్న రాష్ట్రాల్లో డిస్కంలపై భారీ ఆర్థిక భారం పడుతోంది. రైతులకు నిరంతరాయంగా విద్యుత్ అందకపోవడం, లో వోల్టేజ్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ దెబ్బతినడం, పంట కాలంలో సరైన సమయానికి విద్యుత్ అందకపోవడం వంటి సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యవసాయ విద్యుత్ అవసరాలను ప్రత్యేకంగా చూసుకునే విధంగా రైతు డిస్కం ఏర్పాటు చేయాలనే ఆలోచన ముందుకు వచ్చింది. రైతు డిస్కం ఏర్పాటుతో వ్యవసాయానికి ప్రత్యేక విద్యుత్ పంపిణీ వ్యవస్థరూపొందే అవకాశం ఉంది. దీని ద్వారా వ్యవసాయ అవసరాలను ప్రాధాన్యంగా తీసుకొని సరఫరా నిర్వహణ జరగవచ్చు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం, పంపింగ్ సెట్లకు తగిన వోల్టేజ్ అందుబాటులో ఉంచడం, విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా పర్యవేక్షించడం వంటి ప్రయోజనాలు కలగవచ్చు. ముఖ్యంగా సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహిస్తూ వ్యవసాయ రంగాన్ని పునరుత్పాదక ఇంధనాల వైపు మళ్లించే అవకాశమూ ఉంది. అయితే రైతు డిస్కం ఏర్పాటు అంత సులభమైన ప్రక్రియ కాదు. ప్రత్యేక సంస్థ ఏర్పాటు అంటే అదనపు పరిపాలనా వ్యయం, కొత్త మౌలిక వసతులు,



సిబ్బంది నియామకాలు, సాంకేతిక వ్యవస్థల అభివృద్ధి వంటి అంశాలు అవసరం అవుతాయి. ఇప్పటికే నష్టాల్లో ఉన్న విద్యుత్ సంస్థల పరిస్థితిలో కొత్త డిస్కం ఏర్పాటు ఆర్థికంగా ఎంత వరకు సాధ్యమన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు ఉచిత విద్యుత్ అందించే రాష్ట్రాల్లో ప్రభుత్వ బకాయిలు పెరుగుతున్న తరుణంలో రైతు డిస్కం ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే సమగ్ర ప్రణాళిక అవసరం. ఇంకో ముఖ్యమైన అంశం విద్యుత్ వినియోగ నియంత్రణ. వ్యవ సాయ రంగంలో ఉచిత విద్యుత్ కారణంగా నీటి వనరుల అధిక వినియోగం జరుగుతోందన్న విమర్శలు చాలా కాలంగా ఉన్నాయి. భూగర్భ జలాలు క్షీణిస్తున్న పరిస్థితు ల్లో విద్యుత్ వినియోగాన్ని శాస్త్రీయంగా నియంత్రించడం కూడా అవసరమే. రైతు డిస్కం ఈవిషయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి స్మార్ట్ మీటరింగ్, సమయపాలిత సరఫరా, సౌర పంపుల వినియోగం వంటి చర్యలు తీసుకుంటే దీర్ఘకాల ప్రయోజనాలు కలగవచ్చు. అయితే ఏ సంస్కరణైనా రైతు ప్రయోజనాలను కేంద్రంగా ఉంచుకుని అమలు కావాలి. రైతు డిస్కంపేరుతో భవిష్యత్తులో ఉచిత విద్యుత్ విధానాన్ని క్రమంగా ఉపసంహరించుకునే ప్రయత్నాలు జరగకూడదు. విద్యుత్ ఛార్జీల భారం రైతులపై మోపే పరిస్థితి రాకూడదు. ఇప్పటికే వ్యవసాయం లాభసాటిగా లేక ఇబ్బందులుపడుతున్న రైతుకు అదనపుభారం మోపితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. రైతు డిస్కం విజయవంతం కావాలంటే కొన్ని కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. మొదట విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచాలి.సౌర విద్యుత్ ఆధారిత వ్యవసాయ విధానాలను విస్తరించాలి.రైతుసంఘాలు, నిపుణులు, విద్యుత్ రంగ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి పారదర్శక విధానాలు రూపొందించాలి. వ్యవసాయ విద్యుత్ సబ్సిడీల విషయంలో స్పష్టతఉండాలి.ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతుల ప్రయోజనాలను రక్షించే విధంగా విధానాలు ఉండాలి.వ్యవసాయ రంగం దేశ భవిష్యత్తుకు ఆధారం. రైతు సంక్షేమం లేకుండా ఆర్థికాభివృద్ధి అసంపూర్ణమే. కాబట్టి రైతు డిస్కం ఏర్పాటు కేవలం పరిపాలనా మార్పుగా కాకుండా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే సంస్కరణగా మారాలి. దీనికి రాజకీయ సంకల్పం, ఆర్థిక ప్రణాళిక, సాంకేతిక సామర్థ్యం, ముఖ్యంగా రైతుల విశ్వా

# దేశ ఆర్థిక స్థిరత్వానికి విదేశీ మారక నిల్వలు

ఇస్కా రాజేష్ బాబు

విదేశీ మారక నిల్వలు అంటే ఒక దేశ కేంద్ర బ్యాంకు వద్ద భద్రపరిచే విదేశీ కరెన్సీలు, బంగారం అంతర్జాతీయ ద్రవ్యనిధి ఆస్తుల మొత్తం. ఇవి అంతర్జాతీయ వాణిజ్యానికి,దేశ ఆర్థిక స్థిరత్వానికి అత్యంత కీలకం.విదేశీమారక నిల్వల భాగాలు భారతదేశ ఫారెక్స్ నిల్వలు ప్రధానంగా అమెరికన్ డాలర్, యూరో, పౌండ్ స్టెర్లింగ్, జపనీస్ యెన్ వంటి ప్రధాన విదేశీ కరెన్సీలు. అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ అకస్మాత్తుగా పడిపోకుండా లేదా హెచ్చుతగ్గులకు గురికాకుండా నిరోధించడానికి డాలర్లను విక్రయించడం ద్వారా ఆర్‌బిఐ జోక్యం చేసుకుంటుంది. ముడి చమురు, ఇతర అత్యవసర వస్తువులను విదేశాల నుండి దిగుమతి చేసుకునేందుకు చెల్లింపులు చేయడానికి ఇవి ఉపయోగపడతాయి. ఏదైనా అత్యవసర ఆర్థిక సంక్షోభం లేదా విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు బాహ్య రుణాలను తీర్చడానికి ఈ నిల్వలు దేశానికి భరోసానిస్తాయి. భారతదేశ విదేశీ మారక నిల్వలు ఏప్రిల్ 2026లో 551.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి, అంతకు ముందు నెలలో ఇవి 552.3 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. మిలియన్ల డాలర్ల డేటా నెలవారీగా నవీకరించబడుతుంది. ఇది ఏప్రిల్ 1989 నుండి ఏప్రిల్ 2026 వరకు అందుబాటులో ఉంది. ఈ డేటా సెప్టెంబర్ 2024లో 617.1 బిలియన్ డాలర్ల సర్వకాలిక గరిష్ట స్థాయికి, జూన్ 1991లో 1.1 బిలియన్ డాలర్ల రికార్డు కనిష్ట స్థాయికి చేరుకుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నెలవారీ విదేశీ మారక నిల్వలను డాలర్లలో అందిస్తుంది. తాజా నివేదికల ప్రకారం, అక్టోబర్ 2025 నాటికి భారతదేశ విదేశీ మారక నిల్వలు 7.4 నెలల దిగుమతులకు సమానంగా ఉన్నాయి. మార్చి 2026లో దీని ద్రవ్య సరఫరా ఎం 2 గతేడాదితో పోలిస్తే 882.4 బిలియన్ డాలర్లు పెరిగింది. మార్చి 2026నాటికి భారతదేశ దేశీయ రుణం 3,504.2 బిలియన్ డాలర్లకు చేరుకుంది, ఇది గతేడాదితో పోలిస్తే 14.2 శాతం పెరుగుదలను సూచిస్తుంది. గత ఏడాది 2.8 శాతంగా ఉన్న దేశ నిరర్థక రుణాల నిష్పత్తి, 2025 మార్చిలో 2.2 శాతానికి తగ్గింది. భారత దేశ గృహరుణం మార్చి 2025 నాటికి 17.6 శాతానికి చేరుకుంది.ఇది దేశ నామమాత్రపు జీడీపీలో 17.6 శాతంగా ఉంది. ప్రపంచ దేశాల మాదిరిగానే భారత్ కూడా బంగారాన్ని కీలక రిజర్వ్ ఆస్తిగా కొనసాగిస్తోంది. రిస్క్ మేనేజ్‌మెంట్, రిజర్వ్ డైవర్సిఫికేషన్, దీర్ఘకాలిక ఆర్థిక భద్రత లక్ష్యంగా భారత విధానాలు కొనసాగుతున్నాయని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. బ్లూమ్‌బర్గ్ కథనం నేపథ్యంలో వెలువడిన ఊహాగానాలను కేంద్రం ఖండించడంతో మార్కెట్ వర్గాలు మళ్లీ దేశ ఆర్థిక ప్రాథమిక అంశాలపైదృష్టి సారించే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం భారత్ బంగారం నిల్వలను విక్రయించలేదని, విదేశీ మారక నిల్వలుబలంగానే ఉన్నాయని అధికారిక వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. భారత్ తన విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి,రూపాయి విలువను నిలబెట్టేందుకు బంగారం నిల్వలను విక్రయించిందంటూ వెలువడిన వార్తలను కేంద్ర ప్రభుత్వంఖండించింది. అంతర్జాతీయ వార్తా సంస్థ బ్లూమ్‌బర్గ్ కథనం నేపథ్యంలో మార్కెట్‌లో చర్చకు దారితీసిన ఈ అంశంపై అధికార వర్గాలు స్పష్టత ఇచ్చాయి. దేశ బంగారం నిల్వలను విక్రయించలేదని, అలాంటి వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నాయి. బ్లూమ్‌బర్గ్ ప్రచురించిన కథనంలో భారత్ ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో తన విదేశీ మారక నిల్వలకు మద్దతుగా కొంత బంగారాన్ని విక్రయించి ఉండొచ్చని సూచించడంతో మార్కెట్ వర్గాల్లో చర్చ మొదలైంది. దీంతో పెట్టుబడిదారులు, ఆర్థిక విశ్లేషకులు, వ్యాపారవర్గాలు భారత ఆర్థిక స్థితిగతులపై ప్రశ్నలు లేవనెత్తాయి. అధికారిక వర్గాలు మాత్రం ఈ ప్రచారాన్ని పూర్తిగా కొట్టిపారేశాయి. విదేశీ మారకనిల్వలను రక్షించేందుకు లేదా రూపాయి విలువను నిలబెట్టేందుకు బంగారం విక్రయించిన దాఖలాలు లేవని స్పష్టం చేశాయి. భారత రిజర్వ్ నిర్వహణ వ్యవస్థ బలంగా ఉందని, ప్రపంచ స్థాయి ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొనే సామర్థ్యం దేశానికిఉందని పేర్కొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరల హెచ్చుతగ్గులు, అమెరికా వడ్డీ రేట్లపై అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు వంటి కారణాలతో కేంద్ర బ్యాంకుల రిజర్వ్ వ్యూహాలపై దృష్టి పెరిగింది. ఈ క్రమంలో బంగారం నిల్వల తరలింపు, రిజర్వుల పునర్వ్యవస్థీకరణ లేదా అకౌంటింగ్ మార్పులను కొందరు తప్పుగా అర్థం చేసుకుని విక్రయాలుగా భావించి ఉండొచ్చనిఆర్థిక వర్గాలు చెబుతున్నాయి. అధికారికంగా ధృవీకరించని వార్తల ఆధారంగా పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవద్దని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం స్థిరమైన వృద్ధి,ఎగుమతులు,విదేశాల నుంచి వచ్చేనగదు ప్రవాహాలు, బలమైన బ్యాంకింగ్‌వ్యవస్థతో ముందుకు సాగుతోందని చెబుతున్నారు. విదేశీ మారకనిల్వలు దేశానికి బలమైన రక్షణ కవచంలా పనిచేస్తున్నాయని పేర్కొంటున్నారు. కొన్ని వారాలుగా ఒత్తిడిని ఎదుర్కొన్న భారత విదేశీ మారక నిల్వలు మళ్లీ భారీగాపెరిగాయి. మే 8తో ముగిసిన వారానికి దేశ విదేశీమారక నిల్వలు 6.295 బిలియన్ డాలర్లు పెరిగి


# భారత్‌లో 'ఎయిర్‌ట్రంక్' భారీ పెట్టుబడులు



## - 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటు
## - రూ.3 లక్షల కోట్ల పెట్టుబడి పెడుతోంది: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 5:** భారత్‌లో 'ఎయిర్‌ట్రంక్' సంస్థ భారీ పెట్టుబడులు పెట్టబోతోంది. సుమారు రూ.3 లక్షల కోట్లు (దాదాపు 30 బిలియన్ డాలరు) పెటుబడి పెటే ప్రణాళికలను ఎయిర్‌ట్రంక్ ప్రకటించింది. 5 గిగావాట్ల (జిడబ్ల్యు) డేటా సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇది భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో అతిపెద్ద పెట్టుబడులలో ఒకటిగా నిలుస్తుందన్నారు. ఆస్ట్రేలియాకు చెందిన డేటా సెంటర్ సంస్థ ఎయిర్‌ట్రంక్ పెట్టిన రూ.3 లక్షల కోట్ల పెట్టుబడి, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ రంగాలలో భారతదేశాన్ని ఒక ప్రపంచ కేంద్రంగా బలోపేతం చేస్తుందని, అదే సమయంలో ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని, స్థానిక సరఫరా గొలుసులకు మద్దతు ఇస్తుందని, ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని వేగవంతం చేస్తుందని ప్రధాని మోడీ వివరించారు. భారీ స్థాయిలో ప్రపంచ పెట్టుబడులు దేశంలోకి ప్రవహిస్తుండటంతో భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణం బలమైన ఊపందుకుంటోందని అన్నారు. "భారతదేశ డిజిటల్ మౌలిక సదుపాయాల ప్రయాణం అద్భుతమైన ఊపందుకుంటోంది. భారతదేశంలో సుమారు రూ.3 లక్షల కోట్లు (30 బిలియన్లు) పెట్టుబడి పెట్టడానికి, 5 గిగావాట్ (జిడబ్ల్యు) డేటా సెంటర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి ఎయిర్‌ట్రంక్ ప్రణాళికలను ప్రకటించింది" అని ప్రధాని మోడీ అన్నారు. వివిధ పరిశ్రమలలో క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా స్టోరేజ్‌కు డిమాండ్ వేగంగా పెరుగుతున్న తరుణంలో, ఈ పెట్టుబడి భారతదేశ డేటా సెంటర్ ఎకోసిస్టమ్‌కు గణనీయంగా ఊపునిస్తుందని భావిస్తున్నారు. "దేశ డిజిటల్ మౌలిక సదుపాయాల ఎకోసిస్టమ్‌లో ప్రతిపాదించిన అతిపెద్ద పెట్టుబడులలో ఇది ఒకటి" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఇలాంటి ప్రాజెక్టులు ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భారతదేశ పాత్రను మరింత బలోపేతం చేస్తాయని పరిశ్రమ నిపుణులు భావిస్తున్నారు. ఇలాంటి పెట్టుబడులు పెరుగుదల భారతదేశ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌పై పెరుగుతున్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తుంది. విధానపరమైన మద్దతు, ఆవిష్కరణలు, విస్తృత ప్రతిభావంతుల కారణంగా భారతదేశం తదుపరి తరం డిజిటల్ మౌలిక సదుపాయాలకు కీలక గమ్యస్థానంగా స్థిరంగా ఎదుగుతోందని ప్రధాని మోడీ అన్నారు. "ఇలాంటి పెట్టుబడులు క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ ప్రపంచ కేంద్రంగా భారతదేశ స్థానాన్ని బలోపేతం చేస్తాయి, అదే సమయంలో ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి, స్థానిక సరఫరా గొలుసులకు మద్దతు ఇస్తాయి. ఆవిష్కరణల ఆధారిత వృద్ధిని వేగవంతం చేస్తాయి. ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తు భారతదేశంలోనే ఎక్కువగా రూపుదిద్దుకుంటోందన్నది స్పష్టం" అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

## నాకు 41 యేళ్లు.. మా ఇంట్లో పెళ్లి చేయడం లేదు..



ఉత్తరప్రదేశ్‌లో పోలీసులను ఆశ్రయించిన ఓ మహిళ!

**లక్నో, జూన్ 5:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఓ విచిత్రమైన ఘటన చోటుచేసుకుంది. 41 ఏళ్ల మహిళ తన పెళ్లి జరగకపోవడానికి కుటుంబ సభ్యులే కారణమంటూ నేరుగా పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించడం చర్చనీయాంశమైంది. బాధిత మహిళ ఫిర్యాదు ప్రకారం, గత కొన్ని సంవత్సరాలుగా తనకు అనేక వివాహ సంబంధాలు వచ్చినప్పటికీ, తన కుటుంబ సభ్యులు వాటిని పదే పదే తిరస్కరించారని పేర్కొన్నారు. ముఖ్యంగా తన సోదరుడు, వదిన కావాలనే తన పెళ్లిని అడ్డుకున్నారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, పెళ్లి విషయంలో నిర్లక్ష్యం చేయడమే కాకుండా, మానసికంగా కూడా వేధింపులకు గురి చేస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఇరు పక్షాలతో మాట్లాడి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటన పెళ్లి, కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాలపై మరోసారి చర్చకు దారితీసింది. ఒక వ్యక్తి వివాహం జరగకపోవడం కేవలం కుటుంబ సమస్యేనా? లేక మానసిక వేధింపులు ఉంటే చట్టపరమైన జోక్యం అవసరమా? అనే ప్రశ్నలు ఇప్పుడు ముందుకు వస్తున్నాయి. ప్రస్తుతం పోలీసుల ఫిర్యాదుపై విచారణ కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారంపై మరిన్ని వివరాలు వెలుగులోకి రావల్సి ఉంది.

## అసెంబ్లీ ఓటమితో ఢిల్లీ వైపు దృష్టి మళ్లించిన మమత
### లోక్‌సభకు పోటీచేసేందుకు సన్నాహాలు



**కోల్‌కత్తా, జూన్ 5:** రాష్ట్ర మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ అసెంబ్లీఎన్నికల ఓటమి, పార్టీలో తిరుగుబాటు, లోక్‌సభ ఎంపిలుసైతం ప్రత్యేకకూటమిగా ఏర్పాటుకు తిరుగుబాటుచేస్తున్న క్రమంలో దీదీ లోక్‌సభకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆమె దృష్టి ఇపుడు ఢిల్లీ రాజకీయాలవైపు మళ్లింది. అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీయే అసెంబ్లీ సీటును గెల్చుకోలేకపోయింది. అటు పార్టీ పరాజయం, ఇటు తాను ఎమ్మెల్యేగా ఓడిపోయిన నేపథ్యంలో రాష్ట్రంలో ఉండటం కంటే ఢిల్లీయే బెటర్ అని మమతా భావిస్తోంది. అందుకే పార్లమెంట్‌వైపు చూస్తున్నారు. లోక్‌సభకు తిరిగి ఎంపీగా వెళ్లాలనుకుంటున్నారు. ఇప్పుడేమీ ఎన్నికలు లేవు. ఉప ఎన్నికలూ లేవు. అయితే ప్రస్తుతం టీఎంసీ తరఫున ఎంపీగా మాజీ క్రికెటర్ అయిన యూసుఫ్ పఠాన్ 2024లో జరిగిన ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని బహరాంపూర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆయన టీఎంసీ తరఫున లోక్‌సభ ఎంపీగా గెలుపొందారు. కాంగ్రెస్ అగ్రనేత అధిర్ రంజాన్ చౌదరిని భారీ మెజారిటీతో ఓడించారు. ఇప్పుడు ఆ స్థానం నుంచి మమత పోటీ చేయాలనుకుంటున్నారు. ఇందుకోసం ఆ సీటు నుంచి రాజీనామా చేయాలని యూసుఫ్ పఠాన్‌కు మమత సూచించారని ఆయన కూడా సానుకూలంగానే ఉన్నారని తెలుస్తోంది. అక్కడ జరిగే ఉప ఎన్నికలో టీఎంసీ తరఫున మమతా బెనర్జీ పోటీ చేస్తారు. మమతా బెనర్జీ గతంలో కూడా ఎంపీగా పనిచేశారు. 1974 నుంచి ఆరుసార్లు కోల్‌కతా సౌత్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచారు. 1984లో తొలిసారి జాధవ్‌పూర్ నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీగా గెలిచారు. అనంతరం 1989లో ఓడిపోయారు. కోల్‌కతా సౌత్ నియోజకవర్గం నుంచి 1991, 1996లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. అనంతరం ఆమె కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి, సొంత పార్టీ టీఎంసీని స్థాపించారు. 1998, 1999, 2004, 2009లో ఎంపీగా గెలిచారు. మరి యూసుఫ్ పఠాన్ రాజీనామా చేస్తే ఆ స్థానం నుంచి పోటీ చేసి గెలుస్తారా లేదా అనేది ఆసక్తిగా మారింది.

# కర్ణాటక కేబినెట్‌లో లుకలుకలు!
## మంత్రిత్వ శాఖలపై పలువురిలో అసమ్మతి
## మంత్రి రామలింగారెడ్డి రాజీనామా



**బెంగళూరు, జూన్ 5:** కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు తర్వాత కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల శాఖల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. మంత్రుల్లో సీనియర్లు తమకు తగిన ప్రాతినిధ్యంఇవ్వలేదని గుర్రుగా ఉన్నారు. వీరిలో అత్యంత సీనియర్ అయిన రామలింగారెడ్డి ఏకంగా రాజీనామాచేసారు. నూతన వారంతా ఢిల్లీ లాబీయింగ్‌కు సిద్ధం అయ్యారు. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్థిక శాఖను తన వద్దే ఉంచుకోగా, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత నమ్మకస్తుడైన సీనియర్ నేత ప్రియాంక్ ఖర్గేకు హోం మంత్రిత్వ శాఖ బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఆమోదించిన అధికారిక జాబితా విడుదలైంది. ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్థిక శాఖతో పాటు సిబ్బంది పరిపాలనా సంస్కరణల శాఖ, కేబినెట్ వ్యవహారాలు, ఇంటెలిజెన్స్ (అంతర్గత భద్రత), మరే ఇతర మంత్రికి కేటాయించని శాఖలను తన నియంత్రణలోనే ఉంచుకున్నారు. తద్వారా రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా వ్యవస్థలపై ఆయన పట్టు సాధించారు. ఇక అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడైన ప్రియాంక్ ఖర్గేకు హోం శాఖతో పాటు ఐటీ, బయోటెక్నాలజీ, ఈ గవర్నెన్స్ బాధ్యతలను కట్టబెట్టారు. డిప్యూటీ సీఎం జి.పరమేశ్వరకు రెవెన్యూ, యువజన సేవలు, క్రీడల మంత్రిత్వ శాఖ దక్కింది. సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కీలక శాఖలు నిర్వహించిన పలువురు సీనియర్ మంత్రులు ఈ కేబినెట్‌లోనూ తమ పాత పోర్ట్‌ఫోలియోలను నిల బెట్టుకున్నారు. ఎంబీ పాటిల్ పరిశ్రమలు, కేహెచ్ మునియప్ప పౌర సరఫరాలు, సతీష్ జార్కిహోళి పబ్లిక్ వర్క్స్, డాక్టర్ శరణ్ ప్రకాష్ పాటిల్ వైద్య విద్యలు యథాతథంగా కొనసాగుతున్నారు. కాగా, గతంలో డీకే శివకుమార్ నిర్వహించిన బెంగుళూరు నగరాభివృద్ధి శాఖను ఈసారి కృష్ణా బైరేగౌడకు అప్పగించారు. మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర సిద్ధరామయ్యకు పట్టణాభివృద్ధి శాఖ లభించింది. బెంగళూరు అభివృద్ధి వంటి కీలక శాఖల కోసం మంత్రుల మధ్య తీవ్రస్థాయిలో లాబీయింగ్ జరగడం, సీనియర్ నేత రామలింగారెడ్డి వంటి వారు అసంతృప్తి వ్యక్తం చేయడంతో శాఖల ప్రకటన ఆలస్యమైంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రాంతీయ, సామాజిక సమీకరణాలను సమతుల్యం చేస్తూ అధిష్ఠానం ఈ కేబినెట్ కూర్పును ఖరారు చేసింది. రానున్న వారాల్లో ఈ మంత్రివర్గాన్ని మరింత విస్తరించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మంత్రి రామలింగారెడ్డి రాజీనామాతో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో రేగిన కలకలంపై ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. రామలింగారెడ్డి తమకు సీనియర్ నేత మాత్రమే కాదని, తనకు అత్యంత ఆప్తమిత్రుడని సీఎం పేర్కొన్నారు. శాఖల కేటాయింపుపై ఆయనకున్న అసంతృప్తి నేపథ్యంలో, తానే స్వయంగా మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తానని వెల్లడించారు.

## 12 మందితో హిమంత బిశ్వశర్మ అసోం కేబినెట్ విస్తరణ

**గువాహతి, జూన్ 5:** అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ తన మంత్రివర్గాన్ని శుక్రవారంనాడు విస్తరించారు. కొత్తగా 12 మంది ఎన్డీయే ఎమ్మెల్యేలకు చోటు కల్పించారు. గువాహటిలోని లోక్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కొత్త మంత్రులతో గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య ప్రమాణస్వీకారం చేయించారు. తాజా విస్తరణతో ముఖ్యమంత్రితో కలిపి మంత్రి వర్గం 17కు చేరింది. కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రుల్లో అశ్విని రాయ్ సర్కార్, అశోక్ సంఘాల్, బిమల్ బోరా, బిశ్వజిత్ డైమరీ, జయంత మల్లా బరువా, కౌశిక్ రాయ్, కేషబ్ మహంతా, కిష్ణేందు పాల్, నీలిమా దేవి, పిజుష్ హజారికా, రనోజ్ పెగు, సుశాంత బోర్గో హైన్ ఉన్నారు. బిన్న భాషా సమ్మేళనంగా ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. మంత్రులు వివిధ భాషల్లో ప్రమాణస్వీకారం చేశారు. అస్సామీలో పలువురు ప్రమాణం చేయగా, బిమల్ బోరా సంస్కృతంలో, కౌశిక్ రాయ్ హిందీలో, కృష్ణేందు పాల్ బెంగాలీలో ప్రమాణం చేశారు. అస్సాంకు వరుసగా రెండోసారి ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ మే 12న ప్రమాణ స్వీకారం చేశారు. బీజేపీ నేతలు అజంతా నియోగ్, రామేశ్వర్ తేలి, అసోం గణపరిషత్ (ఏజీపీ) అధ్యక్షుడు అతుల్ బోరా, బోడోల్యాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) నేత చరణ్ బోరో మంత్రులుగా ప్రమాణం చేశారు. ఖనకపురలోని వెటర్నరీ కాలేజీ గ్రౌండ్‌లో జరిగిన ప్రమాణస్వీకారోత్సవంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. 129 మంది సభ్యుల అసెంబ్లీలో ముఖ్యమంత్రితో సహా 19 మంది మంత్రులకు మంత్రివర్గంలో అవకాశం ఉంది.

# 'సుప్రీం' తీరుపై మద్రాస్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి
### - ఆరు నెలల్లోపు తీర్పు ఇవ్వాలంటారు - మార్గదర్శకాలిస్తారు, కట్టుబడి ఉండాలి కదా!
### - ఇలా అయితే, నిరంకుశత్వానికి దారితీస్తుంది: జస్టిస్ జి.జయచంద్రన్ ధర్మాసనం వ్యాఖ్య

**చెన్నై, జూన్ 5:** తిరునెల్వేలి జిల్లాలోని రాధాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి 2016-2021 కాలానికి జరిగిన ఎన్నికలలో, మాజీ స్పీకర్ అప్పావును విజేతగా మద్రాస్ హైకోర్టు ఇటీవల ప్రకటించింది. సుప్రీంకోర్టులో ఈ వ్యవహారం పెండింగ్‌లో ఉండటం వల్ల తీర్పు వెలువడటంలో 10 యేళ్ల దురదృష్టకర జాప్యం జరిగిందని పేర్కొంటూ, జస్టిస్ జి. జయచంద్రన్ వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాలకు సంబంధించి కింది కోర్టు తీర్పుపై అప్పీల్ సుప్రీం కోర్టులో యేళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటంపై మద్రాస్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్నికల ఫలితాలకు సంబంధించిన కేసుల్లో ఆరు నెలల్లోపు తీర్పు ఇవ్వాలని సుప్రీం స్వయంగా గతంలో ఇచ్చిన తీర్పును ప్రస్తావించింది. ఈ మార్గదర్శకాలకు సుప్రీం కోర్టు కట్టుబడకపోతే దేశంలో నిరంకుశత్వానికి దారితీస్తుందని హెచ్చరించింది. 'ప్రజా ప్రాతినిధ్య చట్టం' ప్రకారం త్వరితగతిన విచారణ జరపాలన్న నిబంధనను న్యాయస్థానాలు పాటించనప్పుడు, అది ప్రజాస్వామ్యాన్ని, సార్వజనీన వయోజన ఓటు హక్కు నిజమైన స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. "దేశంలో రాజ్యాంగ పరిరక్షకుడిగా ఉన్న న్యాయవ్యవస్థ, ఇతర రాజ్యాంగ వ్యవస్థలతో సమన్వయంతో వ్యవహరించాలి. తద్వారా, రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత స్వాతంత్రం పొంది ప్రజాస్వామ్య పాలనను స్వీకరించిన దేశాలలో, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలలో ఒకటిగా మన దేశం గౌరవాన్ని నిలబెట్టాలి. 'ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951'లోని సెక్షన్ 86(7)లో ఉన్న ఆదేశాలను పాటించకపోవడం ప్రజాస్వామ్యాన్ని, సార్వజనీన వయోజన ఓటు హక్కు స్ఫూర్తిని బలహీన పరుస్తుంది. 'మహ్మద్ అక్బర్ కేసు'లో (పైన పేర్కొన్నది) న్యాయస్థానాలు చేసిన వ్యాఖ్యలను విస్మరించడం కొనసాగిస్తే, మనతో పాటే సుమారు 75 యేళ్ల క్రితం స్వాతంత్రం పొందిన ఇతర నిరంకుశ దేశాల పరిస్థితి మనకూ పట్టవచ్చని ఆందోళన చెందుతున్నాను" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. 2016 నాటి ఎన్నికల్లో ఎఐఎడిఎంకె అభ్యర్థి ఐ.ఎస్. ఇన్‌బదురై రాధాపురం నియోజకవర్గం నుంచి స్వల్ప మెజారిటీతో గెలిచారు. అయితే, ఈ ఫలితాన్ని అప్పావు మద్రాస్ హైకోర్టులో సవాలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్ల కౌంటింగ్‌లో అవకతవకలు జరిగాయని అన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు అప్పావుకు అనుకూలంగా తీర్పు వెలువరించింది. ఇన్‌బదురై ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు వెలువరించింది. దీంతో, ఇన్‌బదురై సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టు తీర్పుపై స్టే విధించింది.

## మహారాష్ట్రలో రైతులకు రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ

**ముంబయి, జూన్ 5:** మహారాష్ట్రలోని రైతులకు దేవేంద్ర ఫడ్నవీస్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని నిర్ణయించింది. పుణ్యశ్లోక్ అహిల్యాదేవి హోల్కర్ షేట్కారి కర్జ్‌ముక్తి యోజన పథకం కింద ఈ మాఫీ జరగనుంది. ఈ నిర్ణయం వల్ల మహారాష్ట్రలోని 56 లక్షల మంది రైతులకు మేలు జరగనుంది. దీనివల్ల మొత్తం 65 లక్షల వరకు రుణాలు మాఫీ అవుతాయి. ప్రభుత్వం రూ.36,585 కోట్లు కేటాయించనుంది. రైతులు ఇప్పటికే రుణాలు చెల్లించి ఉంటే వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. వీరికి రూ.50 వేల వరకు సాయం అందనుంది. అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షల వరకు రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ అవుతాయి. ఇందుకోసం భూయాజమాన్య డాక్యుమెంట్లు వంటివేమీ అక్కర్లేదు. రూ.2 లక్షలకు మించి రుణాలు ఉన్నవారికి వర్తిస్తుంది. వారు అదనపు డబ్బు ముందుగానే బ్యాంకులకు చెల్లించాలి. అంటే రూ.2 లక్షలకంటే ఎక్కువగా లోన్ తీసుకుంటే రూ.2 లక్షలు మినహాయింపు.



## సైనిక నియంతృత్వంలో ఆసిమ్‌మునీర్ టాప్!

**కరాచి, జూన్ 5:** పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం కేవలం కాగితాలకే పరిమితమైందని, తెరవెనుక అంతా సైనిక నియంతృత్వమే నడుస్తోందని అంతర్జాతీయ నిఘా ఏజెన్సీలు సర్వేచేసాయి. పాక్ సైన్యానికి సర్వ సైన్యాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ ఇప్పుడు దేశంలోని ప్రతి రక్షణ, పౌర సంస్థను తన నియంత్రణలోకి తెచ్చుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఈ క్రమంలో దేశంలో తీవ్ర తిరుగుబాటు ముప్పు పొంచి ఉందని అక్కడి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దేశ అత్యున్నత నిఘా సంస్థ ఐఎస్ఐను శాసిస్తున్న మునీర్ దేశంలోని అన్ని పోలీస్ బలగాలను కూడా సైన్యం పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. రక్షణ, అంతర్గత భద్రతకు సంబంధించిన అన్ని విభాగాలను ఒకే కమాండ్ కిందకు తెచ్చి తానే సర్వాధికారిగా మారాలనేది ఆయన వ్యూహం. ఈ ప్రతిపాదన గనుక అమల్లోకి వస్తే పాకిస్థాన్‌లోని ప్రాంతీయ ప్రభుత్వాలపై కూడా పౌర అధికారులకు కాకుండా నేరుగా సైన్యానికే పూర్తి పట్టు దక్కుతుంది.

## ప్రధాని మోడీ మంచి మిత్రుడే..
### అయినా 12.5 శాతం సుంకాలు తప్పవు
## స్పష్టం చేసిన ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 5:** యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత ప్రధాని నరేంద్ర మోదీపై ప్రశంసలు కురిపించారు. మోదీ తనకు మంచి మిత్రుడని చెప్పారు. త్వరలో భారత్, యూఎస్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదరబోతోందని కూడా తెలిపారు. భారత్‌లో యూఎస్ వాణిజ్య బృందం పర్యటన పూర్తైన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై తుది దశ చర్చల కోసం వచ్చిన యూఎస్ బృందం భారత అధికారులతో నాలుగు రోజుల పాటు కీలక సమావేశాల్లో పాల్గొంది. ఇక భారత వాణిజ్య విధానాలను మాత్రం ట్రంప్ మరోసారి విమర్శించారు. అమెరికా విధానాలతో భారత్ లాభపడిందని చెప్పారు. అమెరికా ఉత్పత్తులపై మాత్రం భారీగా సుంకాలు విధించేదని అన్నారు. కానీ పరిస్థితి ప్రస్తుతం పూర్తిగా మారిందని అన్నారు. ఇపుడు భారత్ వల్ల యూఎస్ భారీగా లాభపడుతోందని చెప్పారు. వాణిజ్య ఒప్పందంపై విలేకరులు అడిగిన ప్రశ్నకుఆయన జవాబిస్తూ మోడీ నాకు మంచి మిత్రుడేనని అయితే సుంకాలు మాత్రం కొనసాగుతాయని, 12.5 శాతం తప్పదని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 7న ట్రంప్, మోదీ ఫోన్ కాల్ అనంతరం ఇరు దేశాల మధ్య తొలి దశ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన మార్గదర్శకాలు ఖరారు చేసారు. రష్యా చమురు కొంటున్నందుకు భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాన్ని తొలగించడంతో పాటు తొలుత విధించిన 25 శాతం ప్రతీకార సుంకాన్ని 18 శాతానికి తగ్గించేందుకు యూఎస్ అంగీకరించింది. ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపు రాజ్యాంగవిరుద్ధమని యూఎస్ సుప్రీం కోర్టు ఫిబ్రవరి 20న తీర్పు వెలువరించింది. ట్రంప్ గతసుంకాల స్థానంలోఅన్ని దేశాలపైనా 10 శాతం సుంకం విధించారు. ఇది 150 రోజుల పాటు అమల్లో ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై ఇరు దేశాలు మరోసారి చర్చలు జరిపాయి. భారత బృందం అమెరికాలో పర్యటించగా తాజాగా అమెరికా బృందం భారత్‌కు వచ్చింది. డీల్ దాదాపు కుదిరినట్టే అని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా చర్చల అనంతరం ప్రకటించారు.

## కొత్త ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నా!
### వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తాం: అన్నామలై ప్రకటన
### రాజీనామాను ఆమోదించిన బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీన్



**చెన్నై, జూన్ 5:** తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై శుక్రవారం భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి, యువతపై దృష్టి సారించే 'వి ది లీడర్స్' అనే కొత్త ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ ఉద్యమం భవిష్యత్తులో రాజకీయ పార్టీగా రూపాంతరం చెందుతుందని, తదుపరి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని ఆయన తెలిపారు. తనను ప్రజా జీవితంలోకి ఆకర్షించిన లక్ష్యాన్ని కొనసాగించాలనే కోరికతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని అన్నామలై పేర్కొన్నారు. తమిళనాడులో సానుకూల మార్పు తీసుకురావడానికి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తాను బిజెపిలో చేరానని, అయితే ఇప్పుడు భిన్నమైన రాజకీయ మార్గాన్ని ఎంచుకున్నానని ఆయన చెప్పారు. డిసెంబర్ 2025లో పార్టీని వీడాలనే తన ఉద్దేశాన్ని బిజెపి నాయకత్వానికి ముందే తెలియజేసినట్లు అన్నామలై తెలిపారు. తమిళనాడు ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పార్టీలోనే కొనసాగాలని సీనియర్ నాయకులు కోరారని, అందుకే అధికారికంగా తప్పుకునే ముందు ఆ సమయం వరకు వేచి చూశానని ఆయన వివరించారు. తుది నిర్ణయం తీసుకునే ముందు బిజెపి అగ్రనేతలతో సంప్రదింపులు జరిపినట్లు కూడా ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పట్ల అత్యంత గౌరవాన్ని ప్రకటిస్తూనే, గత 18 నెలలుగా అనేక అంశాలపై బిజెపితో తనకు విభేదాలు ఉన్నాయని అన్నామలై వెల్లడించారు. పార్టీకి సమస్యగా మారడం తనకు ఇష్టం లేదని, అందుకే వేరే మార్గాన్ని ఎంచుకున్నానని, తన రాజకీయ ప్రయాణాన్ని ఒంటరి పోరాటంగా అభివర్ణించారు.

## సంక్షిప్తంగా..

### మణిపూర్‌లో మళ్లీ చెలరేగిన హింస - ముగ్గురు మృతి, పలు ఇళ్లకు నిప్పు



**ఇంఫాల్, జూన్ 5:** మణిపూర్‌లో మళ్లీ హింస చెలరేగింది. సాయుధ దుండగులు ఒక గ్రామంపై దాడి చేశారు. పలువురిపై కాల్పులు జరిపారు. పలు ఇళ్లకు నిప్పంటించారు. దుండగుల కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు మరణించారు. భద్రతా దళాలు ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నాయి. కాంగ్‌పోక్పి జిల్లాలో న్యూకీథెల్మాన్బి ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం తెల్లవారుఝామున 4 గంటల సమయంలో సాయుధులైన దుండగులు లోయిబోల్ గ్రామంపై దాడి చేశారు. సాయుధ మిలిటెంట్లు విచక్షణారహితంగా కాల్పులు జరుపడంతో ముగ్గురు వ్యక్తులు మరణించారు. పలు ఇళ్లకు వారు నిప్పంటించగా అవి కాలి బూడిదయ్యాయి. ఈ సంఘటనతో ఆ గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.

### బీహార్ మాజీ సిఎంలు లాలూ, రబ్రీదేవికి జెడ్ ప్లస్ భద్రత ఉపసంహరణ



**పాట్నా, జూన్ 5:** బీహార్ ప్రభుత్వం రాష్ట్ర మాజీ సిఎంలు, ఆర్‌జెడి అధినేత లాలూప్రసాద్ యాదవ్, రబ్రీదేవిలకు కల్పిస్తున్న అత్యున్నత స్థాయి జెడ్ ప్లస్ భద్రతను ఉసంహరించుకుంది. విఐపి భద్రతపై జరిపిన సమీక్షల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నారు. జనశక్తి జనతాదళ్ అధినేత, ఆర్జేడీ అధినేత లాలూ యాదవ్ పెద్ద కుమారుడు అయిన తేజ్ ప్రతాప్‌కు కల్పిస్తున్న వై కేటగిరీ భద్రతను కూడా ఉపసంహరించుకున్నట్లు అధికారులు తెలిపారు. లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీదేవిలకు ఇకపై బీహార్ ప్రత్యేక సాయుధ పోలీసులు భద్రత కల్పిస్తారు. ఎంపి మీసా భారతికి, తేజస్వి యాదవ్ భార్య రాజశ్రీ యాదవ్‌కు ఉన్న ప్రస్తుత భద్రతా ఏర్పాట్లు కొనసాగుతాయని ఓ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

### భారత్ విదేశాంగ విధానానికి రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసలు



**సెయింట్ పీటర్స్‌బర్గ్, జూన్ 5:** భారతదేశ విదేశాంగ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. ఇండియాతో బంధాన్ని మరింత విస్తృతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. రష్యాతో బంధం అంశంపై భారత్‌పై అమెరికా వత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించిందని, కానీ ఆ ప్రయత్నాల్లో అమెరికా విఫలమైనట్లు పుతిన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాలను అమెరికా బలహీనపరిచే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మేటి న్యూస్ ఏజెన్సీలతో పుతిన్ మాట్లాడారు. ఈ సందర్భంగా భారత ఆర్థిక వృద్ధిని ఆయన ప్రశంసించారు. భారత్ వ్యక్తిగత విదేశాంగ విధానాన్ని కూడా ఆయన మెచ్చుకున్నారు.

### అసోంలో గిరిజన తెగల 48 గంటల బంద్



**గువాహతి, జూన్ 5:** అస్సాంలోని మోరాన్, మోటోక్ సామాజిక సంఘాలు 48 గంటల బంద్‌కు పిలుపునిచ్చాయి. కొత్తప్రభుత్వ మంత్రివర్గంలో తమ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, ఈ రెండు ఆదిమవాసుల వర్గాలకు షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) హోదా కల్పించాలని డిమాండ్ చేశాయి. శుక్రవారం టిన్సుకియా, దిబ్రూగఢ్ జిల్లాల్లో ఆల్ మోరన్ స్టూడెంట్స్ యూనియన్, ఆల్ అస్సాం మోటోక్ యూత్ స్టూడెంట్స్ అసోసియేషన్, పలు అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో 48 గంటల బంద్ ప్రారంభించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని ఆ సంఘాల నేతలు హెచ్చరించారు. నిరసనకారులు పలుచోట్ల ప్రదర్శనలు నిర్వహించారు. టిన్సుకియా జిల్లాలోని రూపాయ్ సైడింగ్‌కాకోపతార్ టిని ఆలీ వద్ద ప్రధాన సమావేశం జరిగింది.

## పర్యావరణాన్ని కాపాడుకుంటేనే సమాజానికి మంచి భవిష్యత్తు

- మంత్రి కొల్లు రవీంద్ర



విజయవాడ, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి: పర్యావరణాన్ని కాపాడుకుంటేనే సమాజానికి మంచి భవిష్యత్తు ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. పర్యావరణ పరిరక్షణ వేడుకల్లో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. మంగినపూడి బీచ్‌లో విద్యార్థులతో కలిసి పరిశుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మొక్కలు నాటారు. బీచ్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. 'పర్యావరణాన్ని మనం కాపాడుకుంటేనే మనకు భవిష్యత్తు ఉంటుంది' అని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్క నాటి పరిరక్షించాలని కోరారు. పర్యావరణ సంరక్షణను ప్రతి ఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలన్నారు. మానవాళి ఉనికి ప్రశ్నార్థకం కాకూడదంటే పర్యావరణ పరిరక్షణ అత్యవసరమని మంత్రి వెల్లడించారు. గ్లోబల్ వార్మింగ్ లాంటి సమస్యల నుంచి బయటపడటం మన చేతుల్లోనే ఉందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడంలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సీడ్ బాల్స్ ద్వారా అడవుల విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## 'ఇంధనం వాహనాలకు స్వస్తి చెబుదాం... సైకిల్ వాడదాం'



శ్రీకాళహస్తిలో కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ మహమ్మద్ షరీఫ్

శ్రీకాళహస్తి, జూన్ 5 ప్రభాతవార్త: ప్రతి ఒక్కరు నేటి పరిస్థితిలో ఇంధనం వాహనాలకు స్వస్తి చెప్పి సైకిల్‌ను వాడుదామని పిలుపు నిస్తూ 'సైకిల్ ర్యాలీ'ని నిర్వహించారు. శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాయానికి అనుబంధంగా లోబావిలో నిర్వహిస్తున్న గంగా సదన్‌లో కవిసమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధులుగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ప్రభుత్వ మైనారిటీల వ్యవహారాల సలహాదారు శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ మహమ్మద్ పాల్గొన్నారు. ఈ కవి సమ్మేళనంలో రాయలసీమలోని వివిధ ప్రాంతాలకు చెందిన కవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో నాటి నాయకుడు నందమూరి తారకరామారావు నుంచి నేటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వరకు మైనారిటీలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ వస్తున్నారని వివరించారు. మైనారిటీలు ఏదీ కోరినా లేదనకుండా మంజూరు చేసేది ఒక్క తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు. అందులో ముఖ్యంగా హజ్ యాత్రకు తెలుగుదేశం ప్రభుత్వం గతంలోనూ ప్రస్తుతం కూడా చేయూత ఇస్తున్నారని వివరించారు. దేశం హయాంలో మైనారిటి కార్పొరేషన్ల ఉర్దూపాఠశాలలు, యూనివర్శిటీలు, షాదీ ఖానాలు, కమ్యూనిటి హాల్స్‌ను నిర్మించారన్నారు. అలాగే మసీదుల్లో పని చేసే నిరుపేదలైన పేష్ఇమాంలకు మౌజన్‌లకు గౌరవవేతనం మంజూరు చేసిన ఘనత చంద్రబాబునాయుడు ప్రభుత్వానిదే అన్నారు. ఐదేళ్ళ వైకాపా పాలనలో విధ్వంసం సృష్టించి ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఆంధ్రా చేస్తే రెండేళ్లుగా కూటమి అభివృద్ధికి 'బ్రాండ్ అంధ్రా'గా తీర్చి దిద్దుతున్నారన్నారు. నేడు మనకంటూ ఓ రాజధాని వచ్చిందన్నారు.

# 'ఏక్ పేడ్ మా కే నామ్' మొక్క నాటండి





గుంతకల్ రైల్వే డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా

ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న రైల్వే అధికారులు

గుంతకల్ (రైల్వే), జూన్ 5 ప్రభాతవార్త: గుంతకల్ రైల్వే డివిజనల్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ముగింపు కార్యక్రమం ఘనంగా గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంతకల్ డివిజన్ రైల్వే మేనేజర్ చంద్రశేఖర్ గుప్తా పాల్గొన్నారు. పర్యావరణ గురించి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం కేవలం వార్షిక వేడుక మాత్రమే కాదు, ప్రకృతిని రక్షించడం, వనరులను సంరక్షించడం, రాబోయే తరాలకు సుస్థిర భవిష్యత్తును అందించడం అనే మన సామూహిక బాధ్యతను గుర్తు చేసే సందర్భంగా ఇది నిలుస్తుంది. ప్రపంచం లోనే అతిపెద్ద ప్రజా రవాణా వ్యవస్థలలో ఒకటైన భారతీయ రైల్వేలు పర్యావరణ హిత విధానాలను ప్రోత్సహించడంలో ఎల్లప్పుడూ ముఖ్య పాత్ర పోషించిందన్నారు. గుంతకల్ డివిజన్ కూడా మహత్తర లక్ష్యానికి చురుకుగా సహకరించింది. అధికారులు, పర్యవేక్షకులు, సిబ్బంది, కాంట్రాక్ట్ కార్మికులు, ఇతర భాగస్వాములు ఎంతో ఉత్సాహంతో, నిబద్ధతతో ఇందులో పాల్గొన్నారు. "ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమం కింద మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించడం. పచ్చదనం, స్థిరమైన రైల్వే కార్యకలాపాల ప్రోత్సాహం కోసం వివిధ పర్యావరణ అనుకూల చర్యలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇంజనీరింగ్, మెకానికల్, మెడికల్, కమర్షియల్, ఎలక్ట్రికల్, ఆపరేటింగ్, ఎస్‌టి, పర్సనల్, ఆర్‌పిఎఫ్ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేశారన్నారు. రైల్వే ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచడంలో ముందుండి సేవలందించిన సఫాయి కర్మచారులు, పర్యవేక్షకులు, స్వచ్ఛంద సేవకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించి పాల్గొన్న ప్రజలకు, విద్యార్థులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధికారులు,

# గెలుపే లక్ష్యం: ప్రతి ఓటుపై దృష్టి పెట్టాలి

- ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలి: కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



విడవలూరు (నెల్లూరు), జూన్ 5 ప్రభాతవార్త: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని, గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సూచించారు. విడవలూరు మండలం ఊటుకూరు గ్రామంలో నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో కొత్తగా నమోదైన ఓట్లు, ఓటర్ల జాబితాలను బీఎల్వోలు, బీఎల్ఏలు, నాయకులు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరవేసేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన మహానాడు విజయవంతానికి సహకరించిన క్లస్టర్ నాయకులు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి నెలలో 25 రోజులు జిల్లా పార్టీ కార్యాలయం, నివాసంలో అందుబాటులో ఉంటానని, సమస్యలు ఉన్న నాయకులు, ప్రజలు నేరుగా కలవవచ్చని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలని, ఇంధన పొదుపు కోసం వాహనాల వినియోగాన్ని తగ్గించి సైకిళ్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈస్టర్న్ ఛానల్ డిస్ట్రిబ్యూట్ కమిటీ చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు రామిరెడ్డి విజయ భాను రెడ్డి, పూండ్ల అచ్యుత్ రెడ్డి, మండల ఇంచార్జ్ అడపాల శ్రీధర్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఆవుల వాసు, చెముకుల కృష్ణ చైతన్య, ఓగు నాగేశ్వరరావు, సత్తివోలు సత్యం రెడ్డి, తుమ్మల లక్ష్మయ్య, మండల అధ్యక్షులు ఏటూరు శ్రీహరి రెడ్డి, సమాధి శ్రీనివాసులు, దూది విజయ రాఘవన్, చేవూరు రాంప్రసాద్, సింహాద్రి అయ్యప్ప, జగన్మోహన్, ఇనగంటి సురేందర్ రెడ్డి, శ్రీహరికోట గోపి, రవిబాబు, ఆవుల రవిచంద్ర, సున్నపు పాపారావు, బీఎల్వోలు, బీఎల్ఏలు, క్లస్టర్ ఇన్చార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 9న విక్రమ సింహపురి స్నాతకోత్సవం

వెంకటాచలం (నెల్లూరు), జూన్ 5 ప్రభాతవార్త: విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ 10, 11, 12 స్నాతకోత్సవ వేడుకలు జూన్ 9వ తేదీన జరుగుతాయని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాసరావు వెల్లడించాడు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. 6,017 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, డిగ్రీ కోర్సులకు 4921 మంది, పీజీ కోర్సులకు1075, దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 9న నెల్లూరులోని ఈపిఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించే స్నాచకోత్సవ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పట్టాలు అందుకోనున్నారు. గోల్డ్ మెడల్ 45, పీహెచ్ డి పట్టాలు 21 21 మందికి అందజేయనున్నారు. ముగ్గుర ప్రముఖులకు డాక్టరేట్ ప్రధానం ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కే ఐ వరప్రసాద్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, ప్రొఫెసర్ గో వర్ధన్ దాస్ గవర్నర్ చేతుల మీదుగా డాక్టర్ ప్రధానం చేయనున్నారు. డిగ్రీ పట్టాలు పొందే విద్యార్థులకు ప్రత్యేకంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు ఆర్టీసీ బస్టాండు ఆత్మకూరు బస్టాండు అన్నమయ్య సర్కిల్ నుంచి బస్సులు బయలుదేరినట్లు వెల్లడించారు పాసుల పొందిన వారు మాత్రమే బస్సుల్లో అనుమతి కలదని తెలిపారు. ఇచ్చిన సమయానికి అక్కడికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్టర్ కే సునీత, ఎగ్జామ్ ఆఫ్ కంట్రోలర్ మధుమతి, సుజనా నాయక్, పాల్గొన్నారు.

# సైబర్ నేరంలో నయా మోసం

- నకిలీ ఏటిఎం ఇచ్చి నగదు దోపిడీ

తిరుపతి, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి: అత్యవసరానికి నగదు డ్రాచేయడానికి ఏటిఎంకు వెళ్ళిన బాధితురాలిని ఓ సైబర్‌నేరస్తుడు కొత్త తరహాలో నమ్మించి మోసం చేశాడు. ఆపైగా అదే బ్యాంకుకు చెందిన నకిలీ ఏటిఎం కార్డును ఇచ్చి ఆమె చేతిలోని నిజమైన ఏటిఎం కార్డును పట్టుకెళ్ళి ఏకంగా ఒకేరోజులో రూ.1.26 లక్షలు నగదు డ్రా చేసేశాడు. దీనిపై మొబైల్‌ఫోన్‌కు అందిన మెసేజ్‌లతో బాధితురాలు అప్రమత్తమై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిరుపతి మంచాలవీధికి చెందిన చీకటి కుసుమ తిరుపతి విష్ణు నివాసంలో కాంటాక్ట్ విధానంలో స్వీపర్‌గా పని చేస్తూంది. ఈమెకు తిరుపతి రాయల్ నగర్ కెనరా బ్యాంక్‌శాఖలో అకౌంట్ ఉంది. డబ్బు అవసరమై తన అవసరాల కొరకు గురువారం ఏటీఎం నుండి రూ.3వేలు నగదు డ్రా చేసుకునేందుకు ఆమె కార్డును కుమార్తెకు ఇచ్చి పంపింది. ఆమె కుమార్తె తిరుపతి పాత మెటర్నటీ ఆస్పత్రి కూడలిలోని కెనరా బ్యాంక్ ఏటిఎం లోడబ్బులు డ్రా చేసింది, డబ్బులు డ్రా చేసే సమయంలో ఎవరో ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫిర్యాది కుమార్తెతో మాటలు కలిపి ఆమెను మోసం చేయాలని ఉద్దేశ్యంతో ఆమె వద్ద ఉన్న కెనరా బ్యాంక్ ఏటిఎం కార్డును తీసుకుని వేరొక ఏటిఎం బ్యాంకు ఏటీఎం కార్డు ఇవ్వగా అది చూసుకోకుండా ఫిర్యాది కుమార్తె ఏటీఎం కార్డును ఇంటికి వెళ్ళింది. ఫిర్యాది తన బ్యాంకు ఖాతా నుండి సుమారు రూ.1,26 లక్షలు ఏటీఎం కార్డు ద్వారా వివిధ ఏటీఎం సెంటర్ల నందు డబ్బులు డ్రా చేసినట్లు గుర్తించింది. శుక్రవారం వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెస్ట్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ హేమాద్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో తండ్రి, కొడుకు మృతి

రాయదుర్గం, జూన్ 5 ప్రభాతవార్త: అనంతపురం జిల్లా రాయదుర్గం మండలం బొమ్మక పల్లి గ్రామంలో విద్యుత్ షాక్ తో తండ్రి, కొడుకు మృతి చెందారు. బొమ్మక్క పల్లి గ్రామానికి చెందిన ఆనందు కుమారుడు తేజ శుక్రవారం గుమ్మగట్ట మండలం కర సూరయ్య దొడ్డి గ్రామ పంచాయతీ కి చెందిన తాగునీటి సరఫరా బోరు మోటార్ మరమ్మత్తు రావడంతో ట్రాక్టర్ ద్వారా మోటారును పైకి ఎత్తుతుండగా ప్రమాదవశాత్తు పైనున్న కరెంట్ తీగలు ఇనుప పైపులకు తగిలి తండ్రి ఆనందు కొడుకు తేజ ఇద్దరూ క్షణాల్లోనే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరమణ ఆదేశాలతో గుమ్మగట్ట పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులు కాని పంచాయతీ అధికారులు కానీ సంఘటన జరిగిన స్థలానికి రాకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. తండ్రి కొడుకులు మరణంతో బొమ్మక్క పల్లి గ్రామంలో విషాద ఛాయలో నెలకొన్నాయి పొట్టకూటి కోసం పనులు చేసుకుంటూ బతుకుతారు గడుపుతున్న తండ్రి కొడుకులను విధి మృత్యు రూపంలో కవలించిందని వాపోయారు.

## 'ప్రశాంతమైన మనసే విజయానికి పునాది'




తిరుపతి, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి: ఆరోగ్యవంతమైన పోలీసు సిబ్బందే సమాజానికి ఉత్తమ సేవలు అందించగలరని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సూచించారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు, సిబ్బంది యోగా కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్య సూత్రాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన 'హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్' కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పాల్గొన్నారు. పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణ, విధి నిర్వహణలో సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడిందన్నారు. ఈ సందర్భంగా యోగా ధ్యాన సాధనల్లో స్వయంగా పాల్గొని సిబ్బందికి ప్రేరణనిచ్చారు. పోలీసు శాఖలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ప్రతి రోజూ ప్రజాసేవలో నిమగ్నమై ఉంటారని, విధి నిర్వహణలో బిజీగా ఉండటం వల్ల చాలామంది తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్యం ప్రతి ఒక్కరికీ అత్యంత విలువైన సంపద అని, ముఖ్యంగా ఎక్కువ సమయం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం అత్యవసరమని ఎస్పీ తెలిపారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాలని సూచించారు. భారతదేశానికి ప్రపంచానికి అందించిన గొప్ప వారసత్వాల్లో యోగ ఒకటని,యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెంపొందుతాయని చెప్పారు. యోగా సాధన అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించడంలో సహాయపడటమే కాకుండా, సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా, ధ్యాన సాధనలను ఆచరించారు.

## విజయవాడలో జీపులతో ఢీకొన్న కేసులో నిందితుల రిమాండ్ 19 వరకు పొడిగింపు

విజయవాడ, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడలో జీపులతో ఢీకొన్న కేసులో నిందితుల రిమాండ్ పొడిగిస్తూ న్యాయస్థాన ఆదేశం జారీ చేసింది. రిమాండ్ ముగియడంతో వర్చువల్ విధానంతో నిందితులను కోర్టులో హాజరుపరిచారు. విచారించిన కోర్టు నిందితులు బొల్లా ఓం, రోహిత్‌కు జూన్ 19 వరకు రిమాండ్ పొడగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. నిందితులు ఇద్దరిని విచారించేందుకు కస్టడీ కోరుతూ మరోసారి పిటిషన్ దాఖలు చేశారు. నిందితులు గత నెల ఒక యువతి కోసం విజయవాడలో జీపులతో ఢీకొంటూ హల్‌చల్ చేసారు. వీరిని పోలీసులు అరెస్ట్ చేసి గతంలో కోర్టు పరిచారు. అప్పట్లో వారికి రెండు వారాల రిమాండ్ విధించారు. ఈ కేసులో ఒక నిందితునిపై డ్రగ్స్ తీసుకున్నట్లు మరో కేసును పోలీసులు వైద్య పరీక్షల అనంతరం నమోదు చేసారు.

## టిటిడి ఇంజనీరింగ్ పోస్టుల భర్తీలో అక్రమాలు

- కొత్త వివాదం తెరపైకి వచ్చిందన్న వైసిపి భూమన

తిరుపతి, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడిలో 2023లో ఇంజనీరింగ్ పోస్టుల భర్తీలో నోటిఫికేషన్ విడుదల చేసిన తరువాత ఎదురైన న్యాయపరమైన సమస్యలతో ఆ నోటిఫికేషన్ నిలిపివేశామని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిటిడి చైర్మన్‌గా బిఆర్‌నాయుడు బాధ్యతలు చేపట్టిన ఏడాదిన్నర తరువాత మళ్ళీ అదే నోటిఫికేషన్‌పై ఇంజనీరింగ్ పోస్టుల భర్తీకి సన్నాహాలు చేయడం అక్రమాలు జరిగాయన్నారు. గతనెలలో 10, 11తేదీల్లో జరిగిన టిటిడిలోని 60 ఇంజనీరింగ్ పోస్టులు భర్తీలో అక్రమాలపై విచారణ జరిపించాలని కరుణాకర్‌రెడ్డి శుక్రవారం డిమాండ్ చేశారు. 27 ఎఇఇ, 10 ఎఇ,19 ఎటిఇ, విద్యుత్ జెఇ 4 పోస్టులు భర్తీకు నోటిఫికేషన్ ఇచ్చినట్లే ఇచ్చి నిలిపివేసిన 2023పైనే కొనసాగించా రన్నారు. మొత్తం 60 పోస్టులకు సంబంధించి ఖాళీలు అప్పటి సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో 2023 నవంబర్ 23న నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. 30వేల అప్లికేషన్‌లు వచ్చాయన్నారు. రాయలసీమ ప్రాంత వాసులకు ప్రత్యేక కేటాయింపులు జరపకపోవడంతో అప్పట్లోనే న్యాయ వివాదాలు తలెత్తే అవకాశం ఉండటంతో తాత్కాలికంగా నోటిఫికేషన్ నిలిపి వేశామని ఆయన గుర్తుచేశారు. ఎన్నికల తర్వాత నిర్వహించాలని నిలిపి వేశామని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పోస్టుల భర్తీచేయడానికి చర్యలు తీసుకోవడంలో అర్థం ఏమిటని కరుణాకర్‌రెడ్డి ప్రశ్నించారు. దీని వెనుక కుట్ర దాగి ఉందన్నారు.

## భర్తను కత్తిపీటతో కడతేర్చిన భార్య



ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

శ్రీకాకుళం, జూన్ 5 ప్రభాతవార్త: మద్యం కోసం అడిగినంత డబ్బులు ఇవ్వలేదనే కోపంతో భార్యపై దాడికి దిగడమే కాకుండా, ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేస్తున్న భర్తను భార్యే కత్తిపీటతో కొట్టి ప్రాణాలు తీసిన ఘోర ఘటన శ్రీకాకుళం నగరంలో కలకలం రేపింది. ప్రకాష్‌నగర్ కాలనీలో గురువారం అర్ధరాత్రి ఈ విషాదం వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, నరసన్నపేట మండలం దేవాది గ్రామానికి చెందిన ధర్మాన అసిరినాయుడు (49) గత ఏడాదిన్నరగా జలుమూరు జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య జయలక్ష్మి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు మణికంఠ స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఈ కుటుంబం రెండు నెలల క్రితమే నగరంలోని ప్రకాష్‌నగర్‌లో అద్దె ఇంట్లోకి మారింది. అసిరినాయుడు మద్యానికి బానిస కావడంతో, ప్రతిరోజూ డబ్బుల కోసం భార్యను వేధించేవాడు. గురువారం రాత్రి కూడా భార్య వద్ద మద్యం కోసం డబ్బులు తీసుకున్న ఆయన, కొద్దిసేపటికే మళ్లీ వచ్చి అదనపు డబ్బులు కావాలని గొడవ పడ్డాడు. జయలక్ష్మి నిరాకరించడంతో ఇద్దరి మధ్య వివాదం ముదిరింది. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన అసిరినాయుడు రెండు నెలల క్రితమే కొనుగోలు చేసిన ఎసిని పగలగొట్టడానికి ప్రయత్నించాడు. దీంతో ఆవేశం ఆపుకోలేకపోయిన జయలక్ష్మి, వెనుక నుంచి కత్తిపీటతో భర్త తలపై బలంగా కొట్టింది. తీవ్ర రక్తస్రావం కావడంతో అసిరినాయుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. గురువారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వచ్చిన కుమారుడు మణికంఠ, తండ్రి రక్తం మడుగులో పడి ఉండడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాడు. వెంటనే ఆయన 112 అత్యవసర నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. రెండో పట్టణ సిఐ ఈశ్వరరావు తన సిబ్బంది, క్లూస్ టీమ్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అయితే కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుకు, పోలీసుల ప్రాథమిక విచారణకు మధ్య తేడాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. డబ్బుల గొడవలో తండ్రి తనను కొట్టాడని, ఎదురుదాడిలో వెనక్కి నెట్టడంతో కిందపడి స్పృహ కోల్పోయాడని తల్లి తనకు చెప్పినట్లు కుమారుడు మణికంఠ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కానీ ఘటనా స్థలంలో లభించిన ఆధారాల ప్రకారం ఇది పథకం ప్రకారం జరిగిన హత్యగా అనుమానిస్తున్నామని సిఐ తెలిపారు. ప్రస్తుతం పోలీసులు ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తమిళనాడు తరహాలో తెలుగు వర్చువల్ అకాడమీ

- తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర



విజయవాడ, జూన్ 5 ప్రభాతవార్త ప్రతినిధి: తమిళనాడు తరహాలో తెలుగు వర్చువల్ అకాడమీ ఏర్పాటుకు డి.పి.ఆర్ సిద్ధం చేసినట్టు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర తెలియచేశారు. శుక్రవారం వడ్డేశ్వరంలోని అకాడమీ కార్యాలయంలో పాత్రికేయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమిళనాడులో 45 దేశాలకు తమిళం నేర్పిస్తున్న తరహాలో తెలుగు భాష నేర్పించడానికి వర్చువల్ అకాడమీ ఏర్పాటు చెయ్యాలన్న సంకల్పంతో ఈ బృహుత్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వివరించారు. దీనికి సంబందించిన డిపిఆర్ మంత్రి లోకేష్‌కి సమర్పిస్తున్నట్టు తెలియచేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా ముందుకు పోవడానికి ప్రాథమికంగా కనీసం వంద కోట్లు కేటాయించాలని కోరినట్టు ఆయన తెలియచేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన మైగ్రేటడ్ లేబర్‌తో పాటు ఇతర దేశాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొన్న వారికి కూడా భాషను పరిచయం చేస్తాము అన్నారు. అకాడమీ ముద్రించే ఇంటర్ పుస్తకాలు బుక్ షాప్స్‌లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు అకాడమీ పుస్తకాలు కొనుగోలు చేయడం లేదని, దాని వల్ల అకాడమీకి తీరని నష్టం జరుగుతుంది అన్నారు. ప్రభుత్వ సిలబస్‌తో తయారు అయిన పుస్తకాలు కొనుగోలు చేయకుండా తాము తయారు చేసుకొనే కంటెంట్ వినియోగించుకోవడం సరైంది కాదని అన్నారు. ముఖ్యంగా చైతన్య, నారాయణ, బాష్యం లాంటి సంస్థలు తమ విద్యార్థులు కొనుగోలు చేసేలా మార్గదర్శకత్వం చెయ్యాలని అన్నారు. భవిష్యత్తులో ప్రతి కాలేజీ సందర్శిస్తామని, 2010లో ఉమ్మడి రాష్ట్రంలో అకాడమీ పుస్తకాలు కొనుగోలు చేసేలా జీవో విడుదల చేశారని, దానిని ఇప్పటికీ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందని, అకాడమీ నష్టాలలోకి పోకుండా చర్యలు తీసుకోవాలి అని ఇప్పటికే లోకేష్‌ని కోరినట్టు విల్సన్ తెలియచేశారు. తెలుగు అకాడమీ కంటెంట్ వాడకుండా పైరసీ చేస్తే కాపీరైట్ ఉల్లంఘనకు పాల్పడినట్టు అవుతుంది అన్నారు. లక్షలాది మంది ఇంటర్ విద్యార్థుల హక్కులు కాపాడ్డానికి అకాడమీ సిద్ధంగా వుంది అన్నారు. అకాడమీ కంటెంట్ వాడే ప్రైవేట్ పాఠశాలల పై కఠిన చర్యలకు సిఫారస్ చేస్తాము అన్నారు.

**యోజన తరహాలో మ్యాగజైన్:** యోజన తరహాలో త్వరలో మ్యాగజైన్ విడుదల చేస్తున్నామని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర తెలిపారు. విద్యా, వైజ్ఞానిక, సాహిత్యం మహిళా సాధికారిత లక్ష్యంగా మ్యాగజైన్ రూపొందిస్తున్నట్టు విల్సన్ తెలియచేసారు.

**అకాడమీ పోస్టుల భర్తీ:** అకాడమీ పోస్టుల భర్తీ విషయంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు లేఖ రాయడం జరిగిందని, ఎపిపిఎస్‌సి ఆలస్యం చేసే పరిస్థితి ఉంటే ఇతర ప్రభుత్వ ఏజెన్సీలకు అప్పగించాలని తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్.డి. విల్సన్ శరత్ చంద్ర కోరారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఔనత్యం కాపాడాలి అంటే కేబినెట్ క్యాడర్ ఇవ్వాలని విల్సన్ కోరారు.

**సంస్కృత అకాడమీకి స్థలం:** తిరుపతి కేంద్రంగా సంస్కృత అకాడమీ అభివృద్ధి చేస్తామని, అందుకు గాను తిరుమలలో ఐదు ఎకరాలు కేటాయించాలని విల్సన్ కోరారు. ఈ మేరకు టిటిడి చైర్మన్ బి.ఆర్. నాయుడుకి విజ్ఞప్తి చేశామన్నారు. జాతీయ సంస్కృత యూనివర్సిటీ తిరుపతిలో వున్న నేపథ్యంలో స్థల సేకరణ అనివార్యం అన్నారు. సంస్కృత భాష అభివృద్ధి కోసం తిరుమల తిరుపతి నిధులు కేటాయించాలని కోరారు. సిఆర్‌డిఏ స్థలంలో తెలుగు అకాడమీ ప్రధాన భవనం కోసం రెండు ఎకరాల స్థలం అడిగినట్లు తెలిపారు. త్వరలో స్థలం కేటాయిస్తే అకాడమీ నిధులతో భవన నిర్మాణం చేసుకుంటామన్నారు.

## జిటి ఎక్స్‌ప్రెస్‌పై రాళ్ల దాడి లోకో పైలట్‌కు తీవ్ర గాయాలు



ఒంగోలు (క్రైమ్), జూన్ 5 ప్రభాతవార్త: ప్రకాశం జిల్లా సింగరాయకొండ సమీపంలో ఢిల్లీ- చెన్నై జీటీ ఎక్స్‌ప్రెస్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనలో రైలుపై మద్యం సీసాలు, రాళ్లు విసరడంతో ఇంజిన్ ముందు భాగంలోని అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో లోకో పైలట్ జయరామ్ తీవ్రంగా గాయపడగా, రైల్వే అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. దాడి కారణంగా ఇంజిన్ క్యాబిన్‌లో ఉన్న లోకో పైలట్ ముఖం, శరీరంపై గాయాలు కావడంతో రైలును సమీపంలోని ఉలవపాడు రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు.

లోకో పైలట్ ఆరోగ్య పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఘటన సమాచారం అందుకున్న రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఎదురుగా వస్తున్న రైలు నుంచి ప్రమాదవశాత్తూ మద్యం సీసా లేదా రాయి వచ్చి తగిలిందా, లేక రైల్వే ట్రాక్ పక్కన ఉన్న ఆకతాయిలు ఉద్దేశపూర్వకంగా దాడి చేశారా అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు.

ఈ ఘటనతో రైల్వే అధికారుల్లో ఆందోళన నెలకొంది. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడం ఊరటనిచ్చినప్పటికీ, రైళ్ల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. సంఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు తెలిపారు. స్థానిక ప్రాంతాల్లోని సీసీ కెమెరా దృశ్యాలను కూడా రైల్వే పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం.

# అక్రమ స్పా సెంటర్లపై పోలీసుల ఉక్కుపాదం


**- అనుమతులు లేకుండా డార్క్ రూమ్స్‌ల నిర్వహణ**

**-చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : కమిషనర్ సుమతి**



వివరాలను వెల్లడిస్తున్న సీపీ సుమతి

**మన్సూరాబాద్, జూన్ 5 , ప్రభాతవార్త :** అక్రమ కార్యకలాపాలు, అనధికారిక క్రాస్ మసాజ్ సేవలు, భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు భారీ స్పెషల్ డ్రైవ్ ను శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఎస్వోటీ బృందాలతో కలిసి మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని స్పా సెంటర్లపై సమగ్ర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 113 సెంటర్లు తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన 46 సెంటర్ల నిర్వాహకులు, మేనేజర్లపై క్రిమినల్ కేసుల ను నమోదు చేశారు. ఎల్బీనగర్ లోని క్యాంపు కార్యాలయంలో సీపీ సుమతి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా స్పా సెంటర్లలో నిబంధనలు ఉల్లంఘన తో పాటు చాలావరకు స్పా సెంటర్లు అవసరమైన అనుమతులు, అప్రూవల్స్ లేకుండా, సక్రమంగా రికార్డులను నిర్వహించడం లేదని అన్నారు. స్పా సెంటర్ సూచించే డిస్‌ప్లే బోర్డులు లేకుండా సెంటర్లు ఉన్నాయని అన్నారు. జోన్లవారీల తనిఖీల వివరాలుఎల్బీనగర్ జోన్ లోని ఐదు పోలీస్ స్టేషన్ పరిధిలోని 47 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 17 కేసులు నమోదు చేశామనీ సీపీ తెలిపారు . ఉప్పల్ జోన్ లోని ఏడు పోలీసు స్టేషన్ల పరిధిలోని 30 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 11 కేసులు నమోదు చేశామన్నారు. మల్కాజిగిరి డివిజన్ లోని ఏడు పోలీసు స్టేషన్ల పరిధిలోని 17 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 7 కేసులు నమోదు అయ్యాయన్నారు. కంటోన్మెంట్ జోన్ లో ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని 19 సెంటర్లలో తనిఖీలు నిర్వహించి, 11 కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు . నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తగిన చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు , అనుమానాస్పదంగా, అనధికారంగా, అక్రమంగా నడుస్తున్న స్పా సెంటర్ల గురించి సమాచారం ఉంటే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా కమిషనరేట్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలను పోలీస్ కమిషనర్ సుమతి కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. సమావేశంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ పరిధిలోని పోలీస్ ఉన్నతాధికారులు, పోలీసులు, ఎస్వోటీ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బిసి గురుకుల పాఠశాల సిబ్బంది నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న చిన్నారెడ్డి

# సిఎం ప్రజావాణిలో 718 దరఖాస్తులు

**పలు సమస్యలపై భారీగా తరలి వచ్చిన దరఖాస్తుదారులు**

**దరఖాస్తులు స్వీకరించిన ప్రజావాణి ఇన్‌చార్జి డా.జి.చిన్నారెడ్డి**

**బేగంపేట జూన్ 5,ప్రభాతవార్త :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 228వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 718దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 333దరఖాస్తులు,ఇందిరమ్మ ఇండ్ల కోసం 251దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 48దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి 01దరఖాస్తులు వచ్చాయి.ఇతర శాఖలకు సంబంధించి 85దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణీ ఇంచార్జ్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు ఎండార్స్ చేసి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలల కుక్స్,స్వీపర్లు, వాచ్‌మెన్లు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు ఇప్పించాలని,పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరగా స్పందించిన చిన్నారెడ్డి బీసీ గురుకుల పాఠశాలల ఇంచార్జ్ కార్యదర్శి మల్లయ్య భట్టుతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేసారు.వేసవి కాలంలో వనస్థలి పురం ప్రభుత్వ పాఠశాల విధ్యార్థులు గణితం,ఆంగ్లభాష,విషయాల్లో శిక్షణ పొంది గొప్పగా రాణించిన బాల బాలికలు సీఎం ప్రజావాణీకి వచ్చి తమ ప్రతిభను చాటారు.వారికి చిన్నారెడ్డి ఆశీస్సులు అందజేసారు.ఇలాంటి శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసే విష యాన్ని ప్రభుత్వ దృష్టికి తీసికెళ్తామని చిన్నారెడ్డి అన్నారు.కస్తూర్బా పాఠశాల నాన్ టీచింగ్ సిబ్బంది తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరారు.విధ్యాశాఖ అధికారులతో చిన్నారెడ్డి ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేసారు.శుక్రవారం సీఎం ప్రజావాణీకి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ ఉమేందర్,ఎన్ఆర్ఐ సమన్వయ మండి వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి,సీఎం ప్రవాసీ ప్రజావాణీ సమన్వయ కర్త బొజ్జా అమరేందర్ రెడ్డి వివిధ శాఖల అదికారులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కును కాపాడుకుందాం

**తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్**




విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్

**ధర్నాచౌక్, జూన్ 5, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కును కపాడుకుందామని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో విద్యా ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణలను నిరసిస్తూ కవాడిగూడ ఏసిటిసి కాలేజి నుంచి ఇందిరాపార్కు ధర్నాచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీఎస్ఈసీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ చక్రధరరావు అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమం నుద్దేసించి ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ రాజ్యాంగం లోని ఆర్టికల్ 21ఏ ప్రకారం ఉచిత, నిర్బంధ విద్య ప్రతి బిడ్డ ప్రాథమిక హక్కు అని, ఈ హక్కును కాపాడాల్సిన ప్రభుత్వమే ఈరోజు విద్యను అంగట్లో సరుకుగా మార్చి, కార్పోరేట్ శక్తులకు కట్టబెడుతోందని మండిపడ్డారు. జాతీయ విద్యా విధానం ద్వారా విద్యా వ్యవస్థను మతీకరణ, కేంద్రీకరణ చేస్తున్నారని, ఎన్టిఏ వంటి సంస్థల వైఫల్యం వల్ల నీట్ పరీక్ష రాసిన 22లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు బుగ్గిపాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ రాజ్యాంగా ఉండాల్సిన ప్రభుత్వం, కార్పోరేట్ కంపెనీలాగా మారటం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ప్రొఫెసర్ చక్రధరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ కార్పోరేటీకరణ విధానాలనే ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందని, కేవలం కమీషన్ల కోసమే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను ముందుకు తీసుకువస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20శాతం నిధులు విద్యకు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం ధర్నాకు సంఘీభావం తెలిపిన అనంతరం మాట్లాడుతూ విద్యా వ్యవస్థ అనేది పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్నప్పుడే సామాన్య, పేద వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ విద్యను కాపాడేందుకు టీఎస్ఈసీ చేస్తున్న పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. సమాచార హక్కు మాజీ కమీషనర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టాన్ని క్షేత్రస్థాయిలో అమలుచేయటంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కార్పోరేట్ శక్తుల ప్రయోజనాల కోసం చట్టాలను నీరుగారుస్తూ, సామాన్యులకు విద్యను దూరం చేసే విధానాలను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఐఎంఎల్ నేత పోటు రంగారావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జే.చలపతిరావు, టి.హన్మండ్లు, ఆల్ ఇండియా ఫోరం ఫర్ రైట్ టు ఎడ్యుకేషన్ నాయకులు ఎం.గంగాధర్, ఎ.నర్సింహారెడ్డి, మీరా, టీఎస్ఈసీ నాయకులు ప్రొఫెసర్ కే.లక్ష్మీనారాయణ, టిపిటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సి.హెచ్. అనిల్‌కుమార్, టి.లింగారెడ్డి పాల్గొన్నారు.




# ప్రపంచ వేదికపై పోచంపల్లి చేనేత వైభవం

**చేనేత కళకు అంతర్జాతీయ గుర్తింపు లక్ష్యంగా 'థ్రెడ్ పోచంపల్లి'**

**నేతన్నల ప్రతిభకు ప్రపంచ మార్కెట్ దిశగా అడుగులు: మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి**

**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త :** తెలంగాణ చేనేత కళా వైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో మరింత విస్తరించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న థ్రెడ్ పోచంపల్లి హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్ శుక్రవారం హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేతజౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప రంగం చేనేతేనని పేర్కొన్నారు. పోచంపల్లి ఇక్కత్ కళ తెలంగాణకు మాత్రమే కాకుండా దేశానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. జీఐ ట్యాగ్ ద్వారా పోచంపల్లి చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని, ఈ ప్రత్యేకతను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం, రంగ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాల్లో రూ.1,400 కోట్లకు పైగా వ్యయం చేసిందని తెలిపారు. నేతన్నల ఉపాధి భద్రత, ఆధునిక శిక్షణ, మార్కెటింగ్ అవకాశాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్లోబల్ మార్కెట్ అవసరాలకు అనుగుణంగా చేనేత కుటుంబాల యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ పోచంపల్లి నేతన్నల ప్రతిభ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచిందన్నారు. అగ్గిపెట్టెలో పట్టేంత సన్నని చీరలను నేసిన ఘనత పోచంపల్లి చేనేత కళాకారులదేనని కొనియాడారు. పోచంపల్లి ఇక్కత్, పుట్టపాక తెలియా రుమాళ్లు వంటి ఉత్పత్తులు యాదాద్రి భువనగిరి జిల్లాకు ప్రపంచవ్యాప్త ఖ్యాతిని తెచ్చిపెట్టాయని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 12 వేల మంది చేనేత కార్మికులు, అనుబంధ వృత్తిదారులు ఈ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వారి ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ కల్పించడం, మెరుగైన ఆదాయం అందించడం లక్ష్యంగానే ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సుమారు 100 చేనేత స్టాల్స్‌తో పాటు స్వయం సహాయక సంఘాలు, అనుబంధ సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా వినియోగదారులకు చేనేత ఉత్పత్తుల వైవిధ్యాన్ని పరిచయం చేస్తున్నట్లు తెలిపారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ ద్వారా చేనేత కార్మికులకు మరిన్ని మార్కెటింగ్ అవకాశాలు లభిస్తాయని, వారి కృషికి తగిన గుర్తింపు దక్కుతుందని అన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వేలాది కుటుంబాలకు చేనేత రంగం జీవనాధారంగా నిలుస్తోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పోచంపల్లి చేనేత వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేయడం, నేతన్నలకు కొత్త మార్కెట్ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నామని తెలిపారు. జూన్ 5 నుంచి 7 వరకు మూడు రోజులపాటు కొనసాగనున్న ఈ ఎగ్జిబిషన్‌లో చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్లు, టై అండ్ డై సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, కళాకారులు పాల్గొంటున్నారు. చేనేత రంగానికి విశేష సేవలందించిన పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్యలను ఈ సందర్భంగా పలువురు అభినందించారు. 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన చేనేత రంగానికి కొత్త ఉత్సాహాన్ని, నేతన్నలకు విస్తృత మార్కెట్ అవకాశాలను తీసుకురానుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి , జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి టి నాగిరెడ్డి, చేనేత జౌళిశాఖ అధికారి శ్రీనివాస్, భువనగిరి డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్, పోచంపల్లి మున్సిపల్ ఛైర్మన్ తడక వెంకటేశం, డిపిఆర్ఓ అరుంధతి ,గుండాల చేనేత సహకార సంఘం ఛైర్మన్ దడక ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణానదిని ఈదిన కలెక్టర్ లక్ష్మీశా



ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ సభ్యులతో కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, జూన్ 5, ప్రభాతవార్త :** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా కృష్ణానదిని ఈది వినూత్న సందేశాన్ని అందించారు. ఆక్వాడెవిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ లక్ష్మీశా అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఉదయం విజయవాడలోని భవానిఘాట్ నుండి కృష్ణానదిని ఈదుతూ అవతలి ఒడ్డుకు చేరుకున్నారు. అవతలి ఒడ్డున మొక్కలు నాటారు. కలెక్టర్ ధైర్యసాహసాలకు పలువురు అభినందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నదులు కేవలం నీటివనరులు మాత్రమే కాదని, జీవవైవిధ్యానికి, వ్యవసాయ, తాగునీటి అవసరాలకు, పర్యావరణ సమతుల్యతకు మూలాదారమని పేర్కొన్నారు. నదులను కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈకార్యక్రమంలో పాల్గొన్నట్లు కలెక్టర్ తెలిపారు.

**యోగాడేకు సర్వం సిద్ధం :** ఈనెల 7వతేదీ నుండి 21వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా తెలిపారు. శుక్రవారం సిపి రాజశేఖరబాబుతో కలిసి మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 7వతేదీ పోలీస్‌సిబ్బందితో కలిసి విజయవాడలోని బిఆర్‌టిఎస్‌రోడ్‌లో థీమాటిక్ యోగా, 10వతేదీ పవిత్ర సంగమం వద్ద, 13వతేదీ బెరంపార్కు వద్ద, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బిఆర్‌టిఎస్‌రోడ్‌లో ప్రతిరోజూ ఉదయం 6గంటలకు నిత్యయోగా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జూన్ 21న జిల్లాస్థాయి కార్యక్రమం జరుగుతుందని, ఇందులో 300మంది మాస్టర్ ట్రైనర్లు, 5వేల మంది యోగాశిక్షకులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

ప్రతిఒక్కరూ ఈకార్యక్రమాల్లో పాల్గొని జయప్రధం చేయాలని పిలుపునిచ్చారు.

# గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యానికి రూ.2,500కోట్లు : మంత్రి సంధ్యారాణి



ఉత్తమప్రతిభ కనపరచిన విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి సంధ్యారాణి

**విజయవాడ, జూన్ 5, ప్రభాతవార్త :** సరైన రహదారి సౌకర్యం లేని గిరిజన గ్రామాల ప్రజల ఇబ్బ ందులు తొలగించేందుకు కూటమి ప్రభుత్వం గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిం చేందుకు రూ.2,500కోట్ల నిధులు కేటాయించి, పలు గ్రామాలకు రహదారులు నిర్మించినట్లు రాష్ట్రగిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఇటీవల విడుదలైన పదవతరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షాఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన గిరిజన విద్యార్థినీవిద్యార్థులను, వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను శుక్రవారం విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సత్కరించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్య మంత్రి చంద్ర బాబునాయుడు నేతృత్వంలోని తమ ప్రభుత్వం గిరిజన విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం ప్రతభుత్వం ప్రతివిద్యార్థిపై దాదాపు లక్షరూపాయలు వరకు ఖర్చుచేస్తున్నట్లు వివరి ంచారు. గతంలో గంజాయి సాగు చేసిన ప్రాంతాల్లో గంజాయిని నిర్మూలించి ప్రస్తుతం అక్కడ రెండు లక్షల ఎకరాల్లో కాఫీతోటల పెం పకం చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో నిలిపివేసిన గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు, టార్పాలిన్‌లు, ఆయిల్ ఇంజన్లు, ట్రాక్టర్లు అందచేస్తున్నట్లు మంత్రి తెలియచేసారు. పల్నాడు జిల్లా ఎత్తిపోతల ఆశ్రమపాఠశాల విద్యార్థులు పాములను ముందుగానే గుర్తించే ప్రోటోటైప్‌షూ రూపొందించి రాష్ట్రస్థాయిలో అవార్డు సాధించటం గర్వకారణమన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని గిరిజన విద్యార్థులు ఐఏఎస్, ఐపిఎస్ వంటి అత్యున్నతస్థాయి ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. 600మార్కులకు గానూ 591 సాధించిన పార్ధు, 590మార్కులు సాధించిన జాస్మిన్‌లు సమాజానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈసందర్భంగా 176మంది విద్యార్థులకు మొమెంటోలు అందించి సత్కరించారు. ఈకార్యక్రమంలో సోషల్‌వెల్‌ఫేర్ కార్యదర్శి యం.మల్లిఖార్జుననాయక్, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఎస్.భార్గవి, గురుకులం విద్యాసంస్థల కార్యదర్శి యం.గౌతమి, ట్రైకార్ యండి మణికుమార్, గిరిజన సంక్షేమశాఖ జేడి

# కృష్ణ, గోదావరి సంగమంలో పుణ్యనదీ హారతులు



నవహారతులను పూజాదికాలతో ప్రారంభిస్తున్న పండితులు

**ఇంద్రకీలాద్రి, జూన్ 5, ప్రభాతవార్త** పవిత్ర కృష్ణ, గోదావరి పుణ్య నదుల సంగమం వద్ద పుణ్యనదీ హారతులు శుక్రవారం సమర్పించారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయ శాఖ కమిషనర్ వార్ల ఆదేశాల ప్రకారం ఎన్.టి.ఆర్ జిల్లా యంత్రాంగం సహకారంతో ఈరోజు సాయంత్రం శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం (పవిత్ర కృష్ణ, గోదావరి పుణ్య నదుల సంగమం) వద్ద పుణ్యనదీ హారతులు కార్యక్రమం లాంచనంగా పునః ప్రారంభం జరిగింది. మొదటగా దేవస్థానం స్థానాచార్య వి శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర క్షేమం, ప్రజా సంక్షేమం కోరుతూ ప్రత్యేక పూజా కార్యక్రమములు జరిగి, నదీమతల్లికి పసుపు కుంకుమలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం దేవస్థానం వైదిక సిబ్బంది పవిత్ర నదీమతల్లులకు పంచ హారతులు సమర్పించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ మాట్లాడుతూ భారతీయ సాంప్రదాయంలో ఆలయాలు,నదుల ప్రాముఖ్యత ఎనలేనిదని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పుణ్య నదీ హారతి కార్యక్రమం శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయం నుండి నిర్వహించడానికి ఏర్పాటు చేశామని, గతంలో మాదిరిగా వైభవంగా ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహణకు పూర్తి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు జీవి నాగేశ్వరరావు, అవ్వారు శ్రీనివాసరావు, పి. రాఘవరాజు, సరోజినీ దేవి, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు, దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కిషోర్ కుమార్,

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమా దేవి తదితరులు పాల్గొన్నారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో యూత్ టైం బ్యాంక్ సేవలు ప్రారంభం అయ్యాయి.

# కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ బే సిటీ ప్రాజెక్టు

**విశాఖ ఎకనమిక్ రీజియన్ సమీక్షలో అధికారులకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం**

**విశాఖపట్నం,జూన్ 05: (ప్రభాత వార్త )** బే సిటీగా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ పై సీఎం 9 జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. విశాఖలోని కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ ఈ బేసిటీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. వీఈఆర్ పై ఓ ప్రాజెక్టు మోనిటరింగ్ యూనిట్ ను కూడా ఏర్పాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచనలు ఇచ్చారు. గ్రేహౌండ్స్ కు చెందిన 303 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్ ను నిర్మించాలని ఆదేశించారు. అలాగే కైలాసగిరి ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. అన్ని వర్గాల ప్రజలకూ ఆహ్లాదం కలిగించేలా బీచ్ వాటర్ స్పోర్ట్స్ తో పాటు వినోదం కలిగించే వివిధ ప్రాజెక్టులు చేపట్టేలా పెట్టుబడులను ఆహ్వానించాలన్నారు. విశాఖలోని జంతు ప్రదర్శన శాలను కూడా ఆధునీకరించి పర్యాటకుల్ని ఆకర్షించేలా చూడాలని సూచించారు. విశాఖలో ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధక్షేత్రాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో అఖండ గోదావరి ప్రాజెక్టుతో పాటు, పోలవరం ప్రాజెక్టు, పాపికొండలు లాంటి పర్యాటక ప్రాంతాలు అదనపు ఆకర్షణ.

# బిసిలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**: రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**

**చిక్కడపల్లి జూన్ 5 ( ప్రభాతవార్త ) :** దేశంలో 75 కోట్లకు పైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడమే లక్ష్యంగా జూలై చివరి వారంలో దేశ రాజధాని ఢిల్లీలో భారీ బహిరంగ సభ, జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా రాజకీయ, విద్యా, ఉద్యోగ రంగాల్లో బీసీలకు జనాభా ప్రకారం తగిన వాటా దక్కలేదని, గత పాలకులు బీసీలకు తీవ్ర అన్యాయం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదిత ఢిల్లీ మహాసభకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఒడిశా, గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి వేలాది మంది బీసీ నాయకులు, ప్రజలు తరలివస్తారని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల అగ్రనేతలు కూడా ఈ సభలో పాల్గొంటారని వెల్లడించారు. త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు, అన్ని రంగాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల పెంపుపై వినతిపత్రం సమర్పించనున్నట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ప్రధాని మోడీ ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన నాయకుడిగా, విశ్వగురువుగా గుర్తింపు పొందారు. ఇంతటి బలమైన నాయకత్వంలోనే బీసీలకు న్యాయం జరగకపోతే, భవిష్యత్తులో మరే ఇతర పాలకుల వల్లా అది సాధ్యం కాదన్నారు. బీజేపీ ప్రభుత్వం అణగారిన వర్గాల అభ్యున్నతికి కట్టుబడి ఉందనడానికి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కావడమే నిదర్శనమని కృష్ణయ్య పేర్కొన్నారు. కేంద్ర మంత్రివర్గంలో 27 మంది బీసీలకు స్థానం కల్పించడంతో పాటు, నలుగురిని గవర్నర్లుగా చేశారని గుర్తుచేశారు. ఒక గిరిజన మహిళను రాష్ట్రపతిగా, దళిత వర్గానికి చెందిన వ్యక్తిని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా నియమించి, దేశంలోని ఉన్నత పదవులన్నింటినీ బిసి, ఎస్సి, ఎస్టీ లకే అందించిన ఘనత మోడీ ప్రభుత్వానిదేనన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ తరహా నిర్ణయాలు తీసుకోలేదని ప్రశ్నించారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగ బద్ధత కల్పించడం, ఓబీసీ కులాల వర్గీకరణ కోసం జస్టిస్ రోహిణి కమిషన్‌ను నియమించడం కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

# ఎపిలో కొనసాగుతున్న విభిన్న వాతావరణం

**విజయవాడ,జూన్5,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. మరో మూడు రోజులు పిడుగులతో కూడిన వర్షాలు, కొన్నిచోట్ల ఎండ ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఉండాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. శుక్రవారం నెల్లూరు జిల్లా గూడూరులో 44.6 డిగ్రీలు, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 43.7, పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో 43.3, కృష్ణా జిల్లా కానుమోలు, మన్యం జిల్లా సాలూరులో 43.1, ప్రకాశం జిల్లా కరేడులో 43, విజయనగరం జిల్లా రాజాంలో 42.7, అనకాపల్లి జిల్లా రాజాంలో 42.6, బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం, ఏలూరు జిల్లా నారాయణపురం, తిరుపతి జిల్లా పూలతోటలో 42.3 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు.

ప్రపంచాన్ని ఊపేస్తున్న

# సాకర్ ఫీవర్




ఎత్తు
37 సెం. మీ
బరువు
6 కిలోలు
18 క్యారెట్ల
బంగారం

**ఫిఫా ప్రపంచకప్‌కు వేళవుతోంది. ప్రపంచ మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌కు మరో అయిదు రోజుల్లో తెరలేవనుంది. నెలరోజులకు పైగా ప్రపంచాన్ని ఉర్రూతలూగించనుంది. ఇప్పటికే ప్రపంచానికి ఫుట్‌బాల్ జ్వరం పట్టుకుంది. భారత జట్టు ఈ టోర్నీలో లేకున్నా... మనదేశానికి సాకర్ ఫీవర్ అంటుకుంది. అర్జెంటీనా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతుండగా... ఫ్రాన్స్, ఇంగ్లాండ్, స్పెయిన్, పోర్చుగల్ వంటి జట్లు ప్రధాన పోటీదారులుగా ఉన్నాయి.**

**న్యూయార్క్:** ఫిఫా ప్రపంచకప్ ఆరంభానికి సమయం సమీపిస్తుండడంతో ఈ టోర్నీ సంబంధించిన అంశాలపై ప్రపంచం ఆసక్తిగా గూగుల్‌లో సెర్చ్ చేస్తోంది. ముఖ్యంగా ఫీఫా ట్రోఫీ ఇపుడు అందరి దృష్టిని విశేషంగా ఆకట్టుకుంది. ఈ ట్రోఫీని మొదటిసారి 1970లో రూపొందించారు. ఇది 37 సెంటీమీటర్ల ఎత్తు, 6 కిలోల బరువు ఉంటుంది. దీన్ని 18 క్యారెట్ల బంగారంతో తయారుచేశారు. అడుగుభాగం ఆకుపచ్చ మలాకైత్ ఖనిజంతో అలంకరింపబడింది. దీని విలువ ప్రస్తుతం 170 కోట్లకు పైగానే ఉంటుంది. భూమిని పైకి ఎత్తిపట్టుకున్న ఇద్దరు మానవ ఆకృతుల రూపంలో అద్భుతంగా ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీని ఇటాలియన్ శిల్పి సిల్వియో గజానిగా రూపొందించారు.

**బ్రెజిల్ సొంతమైన పాత ట్రోఫీ**

బ్రెజిల్ జట్టు 1970లో మూడో ప్రపంచకప్ నెగ్గి పాత జులెస్ రిమెట్ ట్రోఫీని శాశ్వతంగా సొంతం చేసుకుంది. దీంతో 1974 నుంచి కొత్త ట్రోఫీ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది. ట్రోఫీ డిజైన్ల కోసం పోటీ సైతం నిర్వహించగా, గజానిగా రూపొందించిన నమూనా ఎంపికైంది. 1974 నుంచి విజేతలకు ఈ ట్రోఫీని అందజేస్తున్నారు. తొలిసారి జర్మనీ కెప్టెన్ బెకెన్ బాయర్ అందుకున్నాడు. గత అనుభవం వల్ల ఫిఫా ప్రపంచకప్ అసలైన ట్రోఫీని గెలిచిన జట్టు అందుకుంటుంది. కానీ అది తమ వెంట తీసుకెళ్లడానికి అనుమతించారు. అసలైన ట్రోఫీ ఫిఫా వద్దే ఉంటుంది. ఫైనల్ ముగిసిన వెంటనే దానిని జ్యూరిచ్‌లోని ఫిఫా ప్రధాన కార్యాలయానికి విమానంలో తిరిగి పంపిస్తారు. దానికి బదులుగా, గెలిచిన దేశానికి బంగారు పూత పూసిన కంచు ప్రతిరూపం రెప్లికా ట్రోఫీని అందజేస్తారు. దీనితోనే విజేత జట్టు స్వదేశానికి చేరుకుంటుంది. అందుకే ఫీఫీ ప్రపంచకప్ ట్రోఫీని వరల్డ్ స్పోర్ట్స్‌లో అత్యంత విలువైన, గుర్తింపు పొందిన ట్రోఫీలలో ఒకటిగా పరిగణిస్తారు.

# పాక్‌ను చిత్తు చేసిన యువ భారత్

## ఆసియా కప్ అండర్18 హాకీ ఫైనల్లో జపాన్‌తో ఢీ

**కకామిగహారా(జపాన్):** దాయాది పాకిస్థాన్‌ను యువ భారత్ చిత్తు చిత్తు చేసింది. కాకపోతే ఇది హాకీ మైదానంలో. జపాన్‌లో జరుగుతున్న ఆసియా-18 హాకీ కప్‌లో భారత యువ జట్టు అద్భుత ప్రదర్శన చేసింది. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 5-3 గోల్స్ తేడాతో ఓడించింది. సగర్వంగా ఫైనల్లోకి దూసుకెళ్లింది. నేడు జపాన్‌తో కప్ కోసం తలపడనుది.

ఆట ప్రారంభం నుండి భారత టీమ్ ఆధిక్యం చాటింది. పదే పదే పాక్ డిఫెన్స్‌ను చేధిస్తూ పాక్ గోల్ పోస్ట్‌పై దాడులు చేసింది. చివరకు 12వ నిమిషంలో సఫలమైంది. పెనాల్టీ స్ట్రోక్‌ను అశీష్ తాని గోల్‌గా మలిచి భారత్‌కు 1-0 ఆధిక్యం అందించాడు. మొదటి క్వార్టర్ ముగిసే వరకు భారత్ ఆ ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. రెండో క్వార్టర్‌లో పాకిస్థాన్ దూకుడుగా ఆడటం ప్రారంభించింది. 27వ నిమిషంలో అదిల్ గోల్‌తో పాక్ 1-1తో సమవుజ్జీగా నిలిచింది. నేడు ఆసియా కప్ ఫైనల్లో జపాన్‌తో తలపడనుంది.

అంతకుముందు భారత అండర్-18 బాలికల జట్టు ఫైనల్ చేరడంలో విఫలమైంది. ఫెనాల్టీ షూటౌట్‌లో భారత్ వెనకడింది. చైనా 3-1 గోల్స్ తేడాతో నెగ్గి ఫైనల్లో ప్రవేశించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 2-2తో సమవుజ్జీగా నిలిచాయి. నౌషీన్ నాజ్ 3వ నిమిషంలో, కిరణ్ ఎక్కా 54వ నిమిషంలో భారత్‌కు గోల్స్ అందించారు. దీంతో ఫలితం తేల్చడానికి పెనాల్టీ షూటౌట్ నిర్వహించగా, చైనా మూడు అవకాశాలను సద్వినియోగం చేసుకుంది. భారత్ ఆటగాళ్లు మూడింటిలో రెండు గోల్స్ చేయడంలో విఫలమయ్యారు. చైనా గోల్ కీపర్ లీ గ్జా అద్భుతంగా అడ్డుకుంది.




# పతిరాగే 92.62 మీటర్లు నమోదు

**రోమ్:** ఇటలీలోని రోమ్‌లో జరిగిన డైమండ్ లీగ్‌లో శ్రీలంక జావెలిన్ త్రోయర్ రుమేష్ పతిరాగే అత్యధికంగా 92.62 మీటర్ల దూరం నమోదుచేసి చరిత్ర సృష్టించాడు. తొలిసారి డైమండ్ లీగ్ స్వర్ణం అందుకున్నాడు. 2024 ఒలింపిక్ ఫైనల్ తర్వాత ప్రపంచంలోనే అత్యుత్తమ త్రోగా ఇది నిలిచింది. అలాగే ఆసియా అథ్లెటిక్ చరిత్రలో ఇది రెండో అత్యుత్తమ ప్రదర్శన. ఈ క్రమంలో భారత జావెలిన్ స్టార్ నీరజ్ చోప్రా(90.23 మీటర్లు)ను వెనక్కి నెట్టాడు.

ఈ మైలురాయి అందుకున్న తొలి శ్రీలంక జావెలిన్ త్రోయర్‌గా రికార్డు నెలకొల్పాడు. ప్రపంచ జావెలిన్‌లో శ్రీలంకకు కొత్త గుర్తింపు తీసుకువచ్చాడు.

శ్రీలంక జావెలిన్ త్రోయర్ పతిరాగే... ఈ డైమండ్ లీగ్ ఫైనల్ తొలి ప్రయత్నంలో 84.49 మీటర్లు నమోదుచేశాడు. రెండో ప్రయత్నంలో 90 మీటర్లకు పైగా విసిరాడు. చివరి ప్రయ త్నంలో ఏకం గా 92.62 మీటర్లు నమోదుచేశాడు. ఈ ప్రదర్శనతో రుమేష్ పతిరాగే ప్రపంచ ఆల్‌టైమ్ జాబితాలో ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. 90 మీటర్ల మార్కును దాటిన నాల్గవ ఆసియా జావెలిన్ త్రోయర్‌గా, మొత్తం మీద 28వ అథ్లెట్‌గా పతిరాగే నిలిచాడు. పాకిస్థాన్‌కు చెందిన అర్షద్ నదీమ్ 92.97 మీటర్లతో ఆసియా రికార్డు అతని పేరిట ఉంది. భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా మూడో స్థానానికి చేరాడు. శ్రీలంక అథ్లెటిక్ చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలవనుంది.




# ఫ్రెంచ్ ఫైనల్లో జ్వెరెవ్, కొబోలీ

**పారిస్:** ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో అనూహ్య పరిణామాల మధ్య ఫైనల్ సమరం ఖరారైంది. గత కొన్నేళ్లుగా టైటిళ్లపై ఆధిపత్యం చెలాయించిన ఆటగాళ్లు టోర్నీ నుంచి నిష్క్రమించడంతో ఈసారి కొత్త గ్రాండ్‌స్లామ్ విజేత ఆవిర్భవించనున్నారు. మొదటి సెమీఫైనల్లో జర్మనీకి చెందిన అలెగ్జాండర్ జ్వెరెవ్ నాలుగు సెట్ల హోరాహోరీ పోరులో 7-5, 6-2, 3-6, 6-3తో చెక్ యువ సంచలనం జాకుబ్ మెన్సిక్‌పై విజయం సాధించి ఫైనల్ చేరాడు. తొలి సెట్‌ను చెమటోడ్చి నెగ్గిన జ్వెరెవ్ తరువాతి సెట్‌ను అలవోకగా నెగ్గి ఆధిక్యం చాటాడు. ఈ దశలో పుంజుకున్న మెన్సిక్ మూడో సెట్ నెగ్గి ఊపుమీదకనిపించాడు. అనుభవజ్ఞుడైన జ్వెరెవ్ నాలుగో సెట్ నెగ్గి పురుషుల సింగిల్స్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు.

మరో సెమీఫైనల్లో ఇటలీ ప్లేయర్ ప్లావియో కొబోలీకి వాపోవర్ లభించింది. ప్రత్యర్థి ఇటలీకే చెందిన మాట్టియో అర్నాల్డి వైరల్ ఫీవర్‌తో మ్యాచ్‌కు దూరమయ్యాడు. దీంతో తొలి గ్రాండ్ స్లామ్ ఫైనల్లో అడుగుపెట్టిన కొబోలీ... జ్వెరెవ్‌తో టైటిల్ కోసం తలపడనున్నాడు. ఇప్పటివరకు గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలవని ఈ ఇద్దరు ఆటగాళ్లలో ఒకరు ఆదివారం జరిగే ఫైనల్ అనంతరం తొలిసారి మెజర్ చాంపియన్‌గా నిలవనున్నారు. దీంతో ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్ సమరం అత్యంత ఆసక్తికరంగా మారింది.

# 34 ఎత్తుల్లో ప్రజ్ఞానంద గెలుపు

**ఓస్లో:** నార్వే చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద దూసుకెళ్తున్నాడు. వరల్డ్ చాంపియన్ గుకేశ్‌పై 34 ఎత్తుల్లోనే ఓడించాడు. వరుసగా మూడు విజయాన్ని తన ఖాతాలో నాలుగో రౌండ్‌లో గుకేల్ చేతిలో ఎదురైన పరాజయానికి ప్రజ్ఞానంద బదులు తీర్చుకున్నాడు. ఈ విజయంతో టైటిల్ రేసుకు ప్రజ్ఞానంద చేరువయ్యారు. 15 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. వెస్లే 15.5 పాయింట్లతో అగ్రస్థానంలో, అలిరెజా ఫిరౌజా 14.5 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నారు. గుకేష్8 పాయింట్లతో కొనసాగుతున్నాడు.

# లార్డ్స్ టెస్ట్‌లో బౌలర్ల హవా; పట్టు బిగించిన ఇంగ్లండ్

**లార్డ్స్:** న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ పట్టు బిగించింది. ఇంగ్లండ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులకే ఆలౌట్ చేశామన్న ఆనందం న్యూజిలాండ్‌కు ఎక్కువసేపు నిలవలేదు. కివీస్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 113 పరుగులకే కుప్పకూలింది. ఓవర్‌నైట్ స్కోరు 6 వికెట్లకు 61 పరుగులతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్... ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి ఎక్కువసేపు నిలవలేకపోయింది. న్యూజిలాండ్ జట్టులో కైల్ జేమీసన్ (38 నాటౌట్) టాప్ స్కోరర్‌గా నిలవగా.. గ్లెన్ ఫిలిప్స్ (34) పర్వాలేదనిపించాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ఓలీ రాబిన్‌సన్ 5 వికెట్లతో చెలరేగగా, జోష్ టంగ్ 3, అకిన్‌సన్‌లు రెండు వికెట్లు తీశాడు. దీంతో ఇంగ్లండ్‌కు 27 పరుగుల తొలి ఇన్నింగ్స్ స్వల్ప ఆధిక్యం లభించింది. రెండో రోజు ఆటముగిసే సరికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 166 పరుగులు సాధించింది. జేమీ స్మిత్ (31), అకిన్‌సన్ (7) పరుగులతో క్రీజులో ఉన్నారు.ఓపెనర్ ఎమిలియో గే (57) అర్థసెంచరీ సాధించాడు. బెన్ డకెట్ (33) పర్వాలేదనిపించాడు.

కివీస్ బౌలర్లలో నాథన్ స్మిత్ మూడు వికెట్లు తీయగా, విలియం రూర్కే 2 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ 193 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. బౌలర్లకు విపరీతంగా అనుకూ లిస్తున్న లార్డ్స్ పిచ్‌పై బ్యాటర్లు క్రీజ్‌లో నిలదొక్కుకోవడం కష్టమే. మరో మూడు రోజులు ఆట మిగిలి ఉండడంతో ఇంగ్లండ్‌కు విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# మార్కెట్లకు రెపోరేట్ ఎఫెక్ట్

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ





**ముంబయి, జూన్ 5:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గకపోవడం ఆర్థికవృద్ధి అంచనాలు కూడా ఆర్బీఐ తగ్గించడం వంటి వాటి ప్రభావంతో శుక్రవారం దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) నిర్ణయాల వెల్లడి అనంతరం ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఫలితంగా, బీఎస్ఈ సెన్సెక్స్ 116.67 పాయింట్లు క్షీణించి 74,243.34 వద్ద ముగిసింది. అలాగే ఎన్‌ఎస్ఈ నిఫ్టీ 49.85 పాయింట్లు తగ్గి 23,366.70 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో ట్రెంట్ 2.23శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.95శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.52శాతం క్షీణించి మార్కెట్లకు మరికొంత ప్రభావం చూపించాయి. ఇక బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.10శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.01శాతం చొప్పున క్షీణించాయి. మార్కెట్ల పరంగా బిఎస్ఇలో 2056 షేర్లు పెరిగితే 2138 షేర్లు క్షీణించాయి.మరో 217 కంపెనీల షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి మారకం విలువలు 94.94వద్ద కొనసాగాయి. అంతకుముందురోజు 95.7450వరకూ కొనసాగిన సంగతి తెలిసిందే. అమెరికాపదేళ్ల బాండ్లరాబడులు 0.02శాతం క్షీణించి 4.476వద్ద కొనసాగాయి.

కమోడిటీ మార్కెట్లలోబ్రెంట్ ముడిచమురు ఆగస్టు నెల సెటిల్‌మెంట్లు 5 సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 94.98గా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో ఆగస్టునెల సెటిల్‌మెంట్ పసిడిధరలు 0.86శాతం క్షీణించి రూ.1,58,180వద్ద కొనసాగాయి. వారాంతంలో యూరోపియన్ షేర్లు కూడా గరిష్టస్థాయిలోనే ముగిస్తే ఆసియా షేర్లుమాత్రం స్వల్పంగా క్షీణించాయి. టెక్‌స్టాక్స్‌లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు ఆసక్తిచూపారు.ఇకవాల్‌స్ట్రీట్ మార్కెట్లు మిశ్రమంగా ఉన్నాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు874.86పాయింట్లుపెరిగింది.ఎస్‌అండ్‌పి 500 కూడా 0.41శాతం పెరిగింది. నాస్‌డాక్ కాంపోజిట్ సూచీ మాత్రం 0.09 శాతం క్షీణించింది. దేశీయ స్టాక్స్‌లో టాటా స్టీల్ 1.80శాతం క్షీణించింది. ఎసిఎంఇ సోలార్ 3.12పెరిగితే భెల్ 0.58శాతం క్షీణించింది. లూపిన్ 90.80శాతం పెరిగింది. అలెంబిక్ ఫార్మా 0.12శాతం బజాజ్ ఎలక్ట్రికల్స్ 2.55 శాతం, బ్లూస్ప్రింగ్ ఎంటర్‌ప్రైజెస్ 11.40శాతం చొప్పున పెరిగాయి. ఇక నెఫ్రో కేర్ హెల్త్‌సర్వీసెస్ 2.25శాతం పెరిగాయి. ఇక ఐపిఒల పరంగా హెక్సాగాన్ న్యూట్రిషన్ 1.61రెట్లు ఎక్కువ బిడ్డింగ్ జరిగింది. బిడ్డింగ్ 9వ తేదీ ముగుస్తుంది. ఇష్యూధర రూ.42నుంచి రూ.45గా నిర్ణయించారు. సిఎంఆర్‌గ్రీన్‌టెక్నాలజీస్ కూడా 126.87 రెట్లు బిడ్లు వచ్చాయి. ఇష్యూ ఈనెల 3వ తేదీ ప్రారంభం అయి శుక్రవారంతోముగిసింది. ఐపిఒ ఇష్యూ ధర రూ.182 నుంచి రూ.192గా నిర్ణయించింది.

## 682 బిలియన్ డాలర్లకు ఫారెక్స్ ఖజానా

**ముంబయి,జూన్ 5:** భారత్ విదేశీ కరెన్సీ ఖజానా నిల్వలు 938 మిలియన్ డాలర్లుపెరిగి 682.321 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు ఆర్బీఐ వెల్లడించింది. గతనెల 28వ తేదీతో ముగిసిన వారంలో నిల్వలు కొంత మేర పెరిగాయని వివరించింది. అంతకుముందు వారిలో 7.511 బిలియన్ డాలర్లు తగ్గి 681.384 బిలియన్ డాలర్లుగా ఉన్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 27వ తేదీతోముగిసిన వారంలో ఫారెక్స్ కిట్టీ ఒక్కసారిగా ఆల్‌టైమ్ గరిష్టానికి పెరిగింది. 728.494 బిలియన్ డాలర్లకు చేరింది. మధ్యప్రాచ్యం ఉద్రిక్తతల ప్రభావంతో కొన్ని వారాలపాటు రూపాయి క్షీణత కొనసాగడంతో ఒత్తిళ్లు ఎదురయ్యాయి. విదేశీ కరెన్సీ వినియోగాన్ని కట్టడిచేసేందుకు ప్రధానిమోడీ పదేపదే పొదుపుమంత్రం పఠించిన సంగతి తెలిసిందే. విదేశీ ప్రయాణాలు తగ్గించాలని, ఇంధన వినియోగం తగ్గించాలని, బంగారం కొంతకాలం కొనవద్దంటూ సూచనలుచేసిన సంగతి తెలిసిందే. ఆర్బీఐ విదేశీ ఖజానా పటిష్టతకే ఇదంతా జరిగింది. ఇక విదేశీ కరెన్సీ ఆస్తులపరగా అయితే నిల్వలు 3.116 బిలియన్ డాలర్లు పెరిగి 546.148 బిలియన్ డాలర్లకు చేరాయి. కరెన్సీ ఆస్తులు అంటే డాలరేతర కరెన్సీలు యూరో, పౌండ్,యెన్ వంటి కరెన్సీల హెచ్చుతగ్గుల విలువలను కరెన్సీ ఆస్తులుగా పరిగణిస్తారు. ఇక బంగారం నిల్వలు మాత్రం 2.186 బిలియన్‌డాలర్లు క్షీణించి 112.6 బిలియన్ డాలర్లకు చేరాయి. ఎస్‌డిఆర్‌లు కూడా స్థిరంగా 18.747 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. ఇక ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వు స్థాయి 8 మిలియన్ డాలర్లు పెరిగి 4.826 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు తేలింది.






## ప్రాథమిక దశలోనే ప్లాస్టిక్ కరెన్సీ

**ముంబయి, జూన్ 5:** ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు చలామణిలోకి రాబోతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంపై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టతనిచ్చారు. ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్న మాట వాస్తవమేనని, అయితే ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని అన్నారు. దేశంలో పేపర్ కరెన్సీ వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, ప్లాస్టిక్ నోట్లను తీసుకురావడానికి గల సాధ్యాసాధ్యాలపై ఆర్‌బీఐ కసరత్తు చేస్తోంది. కాగితపు నోట్ల ముద్రణకు భారీగా ఖర్చు అవ్వడం, అవి త్వరగా పాడైపోయి చలామణి నుంచి తొలగించాల్సి రావడం వంటి కారణాల వల్లే ఈ ప్రత్యామ్నాయంపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాస్టిక్ నోట్ల వల్ల కలిగే ప్రయోజనాలు, వాటి వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సాంకేతిక, ఆపరేషనల్ సమస్యలపై ఆర్బీఐ నిపుణులు అధ్యయనం చేస్తున్నారు. నిజానికి, ప్లాస్టిక్ నోట్ల ప్రస్తావన ఈనాటిది కాదు. 2014 ఫిబ్రవరిలోనే కేంద్ర ప్రభుత్వం దీనిపై పార్లమెంటుకు సమాచారం అందించింది. భౌగోళిక, వాతావరణ వైవిధ్యాలను పరీక్షించడానికి దేశవ్యాప్తంగా ఐదు నగరాలను (కొచ్చి, మైసూర్, జైపూర్, సిమ్లా, భువనేశ్వర్) ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా రూ. 100 కోట్ల విలువైన ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టాలని భావించారు. అప్పట్లో కొన్ని సాంకేతిక, నిర్వహణ లోపాల వల్ల ఈ ప్రాజెక్టు తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇప్పుడు ఆర్‌బీఐ మళ్లీ ఈ ఫైల్‌ను కదిలించడంతో త్వరలోనే దేశంలో ప్లాస్టిక్ నోట్లు అందుబాటులోకి వస్తాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

# ఎన్ఆర్ఐలు, ఒసిఐల పెట్టుబడుల పరిమితి పెంపు

## ఈక్విటీలు పెంచేందుకు ఆర్బీఐ కొత్త నిబంధనలు

**ముంబయి:** భారత స్టాక్ మార్కెట్లో విదేశీ పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకుఆర్బీఐ తన పాలసీ సమీక్షలో విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులు 4.62లక్షల కోట్లుగా ఉండవచ్చని నిర్ణయించింది.ఎఫ్‌పిఐల ఈ పరిమితి దాటకూడదు. ఇక ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులపరిమితిని రూ.1.53 లక్షలకోట్లుగామొదటి ఆరునెలల కాలానికి నిర్ణయించింది. సెబీ రిజిస్ట్రేషన్ లేకుండానే భారత స్టాక్ మార్కెట్లోని ఈక్విటీ షేర్లలో ఎన్ఆర్ఐలు, ఓసీఐలు పెట్టే పెట్టుబడి పరిమితులను పెంచుతున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ప్రకటించారు.

ద్రవ్య పరపతి సమీక్ష సమావేశం అనంతరం మాట్లాడిన ఆయన ఈ ప్రత్యేక సౌకర్యాన్ని విదేశాల్లో నివసిస్తున్న ఇతర వ్యక్తిగత ఇన్వెస్టర్లకు వర్తింపజేస్తున్నట్లు వెల్లడించారు. దేశంలోకి విదేశీ నిధుల ప్రవాహాన్ని పెంచేందుకు ఆర్‌బీఐ మరికొన్ని ఉపశమన చర్యలను ప్రకటించింది. ప్రభుత్వ బాండ్ల మార్కెట్లోకి విదేశీ మూలధనాన్ని తీసుకురావడానికి ఫుల్లీ యాక్సెస్డ్ రూట్ (ఎఫ్ఏఆర్) కింద 15, 30, 40 సంవత్సరాల కాలపరిమితి గల కొత్త ప్రభుత్వ సెక్యూరిటీలను కూడా చేర్చుతున్నట్లు గవర్నర్ తెలిపారు. జనరల్ రూట్ కింద విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లపై ఉన్న స్వల్పకాలిక పెట్టుబడి పరిమితులు,ఇతర నిబంధనలను పూర్తిగా తొలగిస్తున్నట్లు చెప్పారు.

కేంద్రం ప్రకటించిన పన్ను మినహాయింపులు, ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయాలతో దేశంలోకి విదేశీ పెట్టుబడులు భారీగా రావడానికి సహాయపడతాయని సంజయ్ మల్హోత్రా ఆశాభావం వ్యక్తం చేశారు. ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాన్ని వెనక్కి తీసుకురావడానికి గల కాలపరిమితిని తిరిగి తొమ్మిది నెలలకు పునరుద్ధరిస్తున్నట్లు ప్రకటించారు. భారత విదేశీ మారకపు రేట్ల విధానంలో ఎలాంటి మార్పులు లేవని రూపాయి విలువను మార్కెట్ శక్తులే నిర్ణయిస్తాయని గవర్నర్ స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిరతల వల్ల ఒక్కోసారి మార్కెట్లో అంచనాలకు భిన్నంగా తీవ్ర ఒడుదొడుకులు వచ్చే అవకాశం ఉందని గవర్నర్ చెప్పారు. అలాంటి సమయాల్లో ఆర్థిక కార్యకలాపాలు దెబ్బతినకుండా ఆర్‌బీఐ కచ్చితంగా రంగంలోకి దిగి మార్కెట్‌ను నియంత్రిస్తుందని వివరించారు. తమ లక్ష్యం మార్కెట్ ఆధారిత మార్పులను అడ్డుకోవడం కాదని, కేవలం అస్తవ్యస్తమైన కదలికలను అదుపు చేయడమేనని స్పష్టం చేశారు





# రెపోరేట్ల జోలికి వెళ్లని ఆర్బీఐ

## 5.25% వద్దనే కొనసాగించాలని ఎంపిసీ ఏకాభిప్రాయం

**ముంబయి, జూన్ 5:**భారతీయ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య పరపతి విధాన కమిటీ ఎంపీసీ రెపో రేట్లను యధాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. మార్కెట్ వర్గాల అంచనాలకు అనుగుణంగానే పాలసీ రెపో రేటును 5.25 శాతం వద్ద కమిటీ ఏకగ్రీవ నిర్ణయం తీసుకుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జూన్ 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు జరిగిన సమావేశం అనంతరం ఆర్‌బీఐగవర్నర్ సంజయ్ మల్హోత్రా ఈ నిర్ణయాలను శుక్రవారం ప్రకటించారు. ఈనిర్ణయంతో స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటు 5శాతం, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్‌ఎఫ్) రేటు, బ్యాంక్ రేటు 5.5శాతంగా కొనసాగుతాయి. దేశ ఆర్థిక వ్యవస్థలోని తాజా పరిస్థితులు, భవిష్యత్ అంచనాలను క్షుణ్ణంగా సమీక్షించిన తర్వాతే కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని గవర్నర్ వివరించారు. మరోవైపు, ఆర్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను తగ్గించింది. గతంలో 6.9 శాతంగా అంచనా వేయగా, ప్రస్తుతం 6.6 శాతానికి సవరించింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి, భౌగోళిక రాజకీయ ఉద్రిక్త తలు, సరఫరా గొలుసులోఅంతరాయాలు పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ద్రవ్యోల్బణంపై హెచ్చరిక ద్రవ్యోల్బణం గురించి మల్హోత్రా మాట్లాడుతూ, ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం (సీపీఐ) తక్కువగానే ఉన్నప్పటికీ, మూడో త్రైమాసికంలో ఇది ఆర్‌బీఐ గరిష్ఠ సహన పరిమితికి చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ ఏడాది సాధారణంకంటే తక్కువవర్షపాతం నమోదయ్యే సూచనలు, ఎల్ నినో ప్రభావం వంటి అంశాలు ద్రవ్యోల్బణానికి ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని హెచ్చరించారు. అయితే, కీలకమైన టోకు ద్రవ్యోల్బణం 3.7శాతం వద్ద స్థిరంగా ఉండటం కొంత ఊరటనిచ్చే అంశమని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగాపటిష్టంగా ఉందని, ప్రైవేట్ వినియోగం వృద్ధికి మద్దతుగా ఉందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా సవాళ్లు ఉన్నప్పటికీ సేవల ఎగుమతులు బలంగా ఉంటాయని, వస్తు ఎగుమతులు కూడా వృద్ధిని నమోదు చేస్తున్నాయని, అయితే, పెరుగుతున్న వ్యయాల ఒత్తిడి వివిధ రంగాలపై ప్రభావం చూపుతోందని అంగీకరించారు.





# అంబానీని దాటేసిన చైనా బిలియనీర్

**బీజింగ్, జూన్ 5:** సంపదలో రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని చైనాకు చెందిన టిక్‌టాక్ వ్యవస్థాపకుడు ఝాంగ్‌యిమింగ్ వెనక్కి నెట్టారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో జాంగ్ నికర ఆస్తి విలువ 92.8 బిలియన్ డాలర్లకు చేరింది. ముకేశ్ అంబానీ 86.9 బిలియన్ డాలర్లతో మూడో స్థానానికి పడిపోయారు. ఝాంగ్ ఆసియాలోనే రెండో అత్యంత ధనవంతుడిగా, చైనాలోనే నంబర్1 కుబేరుడిగా అవతరించారు. ప్రస్తుతం ఈ జాబితాలో భారత్‌కు చెందిన గౌతమ్ అదానీ 117.4 బిలియన్ డాలర్లు అగ్రస్థానంలో కొనసాగుతున్నారు.

చైనాలోని ఫుజియాన్ ప్రాంతంలో జన్మించిన 43 ఏళ్ల ఝాంగ్ యిమింగ్ నాంకై విశ్వవిద్యాలయం నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థల్లో పనిచేసిన ఆయన 2012లో బీజింగ్‌లోని ఓ చిన్న అపార్ట్‌మెంట్ రూమ్ నుంచి బైట్‌డ్యాన్స్ కంపెనీని ప్రారంభించారు. కేవలం అల్గోరిథమ్స్ ఆధారంగా యూజర్లకు నచ్చిన కంటెంట్‌ను అందించే టౌటియావో అనే న్యూస్ ప్లాట్‌ఫామ్‌ను ఝాంగ్‌యిమింగ్ తెరిచారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., Renigunta Road, 3rd Mile Stone, Tirupati-517507 Ph. No. 2238770, Fax:: 08772238790, RNI No.64860/9 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.

# అంగన్‌వాడీ లబ్ధిదారులకు నాణ్యమైన పోషకాహారమే లక్ష్యం

## ఆహార భద్రత ప్రమాణాల అమలుపై ప్రభుత్వ ప్రత్యేకదృష్టి

## రేపు రాష్ట్రవ్యాప్తంగా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 5:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే పోషకాహార సేవలను మరింత నాణ్యంగా, సురక్షి తంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అంగన్వాడీ సేవల బలోపేతం, ఆహార భద్రత ప్రమాణాల కచ్చితమైన అమలుపై పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, పంపిణీ వ్యవస్థ తదితర అంశాలపై మంత్రి సీతక్క స్వయంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులతో తరచూ వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ సమీక్షలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రతపై అంగన్‌వాడీ సిబ్బందికి మరింత అవగాహన కల్పించేందుకు ఈ ఆదివారం (జూన్ 7) వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే ను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో అంగన్వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల సేకరణ, నిల్వ, వంట ప్రక్రియ, పరిశుభ్రత ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, లబ్ధిదారులకు సురక్షి తమైన పోషకాహారం అందించే విధానాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం కోసం జిల్లాల వారీగా ఫుడ్ సేఫ్టీ అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా నియమించారు. వారు అంగన్‌వాడీ సిబ్బందికి ఆహార భద్రత, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యక్ష శిక్షణ అందించనున్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం శిక్షణ ఇస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలు భవిష్యత్ తరాల ఆరోగ్యానికి పునాది. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందించే ప్రతి ఆహార పదార్థం నాణ్యంగా, సురక్షి తంగా ఉండేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే స్ఫూర్తితో ఆహార భద్రత ప్రమాణాలను మరింత పటిష్టం చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీ వ్యవస్థ ద్వారా అందించే సేవల నాణ్యతను మరింత పెంచడం, పోషకాహార లోపాలను తగ్గించడం, లబ్ధిదారుల ఆరోగ్యాన్ని పరిరక్షి ంచడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు ఆహార భద్రత ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేసేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు.



## ప్రధానమంత్రి మోడీ పిలుపునకు మద్దతుగా మొక్క నాటిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ దేశవ్యాప్తంగా ఇచ్చిన ఏక్ పేడ్ మా కే నామ్ పిలుపు స్ఫూర్తితో, అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శుక్రవారం ఉదయం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో మొక్క నాటారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రకృతిని కాపాడటం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం మనందరి కర్తవ్యమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించిన ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమం కేవలం మొక్కలు నాటే కార్యక్రమం మాత్రమే కాదని, అది తల్లిపట్ల గౌరవాన్ని వ్యక్తపరుస్తూనే ప్రకృతిని కాపాడుకోడం పట్ల సమాజంలో అవగాహన పెంపొందించే ఒక మహత్తర ప్రజా ఉద్యమమని తెలిపారు. ప్రకృతి పరిరక్షణ, వాతావరణ మార్పుల దుష్ప్రభావాల నివారణ, జీవవైవిధ్య సంరక్షణ (బయోడైవర్సిటీ) కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపుకు స్పందించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సుస్థిరాభివృద్ధి, హరిత అభివృద్ధి (గ్రీన్ గ్రోత్) లక్ష్యాలతో దేశం ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దేశ ప్రజలందరూ ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగస్వాములై, హరిత భారత నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషించాలని జి. కిషన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## మహిళా శక్తి రైతు కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు

### జనగాం జిల్లాలో 62 కేంద్రాలకు లైసెన్స్ జారీ

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మహిళా శక్తి రైతు కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను విక్రయించే బాధ్యతలను అప్పగించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రైతులకు అవసరమైన అన్ని సేవలు వేగంగా, సులభంగా అందేలా ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని భావిస్తోంది. రైతులకు అవసరమైన అన్ని సేవలు ఒకే వేదికపై అందించడమే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా తొలి విడతలో జనగాం జిల్లాలో రైతులకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు విక్రయించేందుకు తెలంగాణ ప్రభుత్వం 62 మహిళా శక్తి రైతు సేవా కేంద్రాలకు లైసెన్సులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. దీని నిమిత్తం లావాదేవీలు, స్టాక్ పర్యవేక్షణ, పంపిణీ, ధరల నిర్ధారణ కోసం ఈ మహిళా శక్తి రైతు కేంద్రాలకు ఈపీఓఎస్ (ఈ పోస్) యంత్రాలను అధికారులు పంపిణీ చేశారు. రాష్ట్రంలో స్వయం సహాయక బృందాలు నడుపుతున్న ఎరువుల దుకాణాలకు ఇంత పెద్ద సంఖ్యలో లైసెన్సులు జారీ చేయడం ఇదే మొదటిసారి అని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రికార్డుల నిర్వహణను సరైన విధంగా నిర్వహించాలని సూచించారు. మహిళా శక్తి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు బహుళ సేవలు అందించేందుకు వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఒకే చోట సేవలు అందించేందుకు, కేంద్రాల సభ్యులకు రైతు వేదికలలోని వ్యవసాయ విస్తరణ అధికారులు శిక్షణ ఇస్తారని అధికారులు చెబుతున్నారు. ఈ కేంద్రాలకు కేవలం ఎరువుల లైసెన్స్ లు మాత్రమే కాకుండా విత్తన లైసెన్సులు, పురుగు మందుల లైసెన్సులు కూడా అందించినట్లు తెలిపారు. రైతులకు సరఫరా చేసే ప్రక్రియలో భాగంగా ప్రతి లావాదేవీకి సంబంధించి రికార్డులు ఖచ్చితంగా నిర్వహించాలని, నిల్వలు, పంపిణీ వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు.




గాంధీ ఆస్పత్రి

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిలిచిన ఒపి సేవలు

**హైదరాబాద్ (సికిందరాబాద్), జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవుట్ పేషెంట్ సేవలు నిలిచి పోయాయి. ప్రభుత్వ వైద్యుల బదిలీ ప్రక్రియలో ప్రభుత్వం జీవో నెం. 38 నిబంధనలను తుంగలో తొక్కుతూ ఏకపక్షంగా వ్యవహరించారని నిరసిస్తూ తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజీజీడీఏ) బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి నగరంలోని గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ ఆస్పత్రి సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ వైద్య సేవలను నిలిచిపోయాయి. అత్యవసర సేవలు, ఇన్పేషెంట్ సేవలు యథావిధిగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 38 ప్రకారం బదిలీలు జరగకపోవడం లేదని డాక్టర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా స్పౌజ్ కోటాలో దరఖాస్తు చేసుకున్న వారికి, అనారోగ్య సమస్యలు ఉండి ప్రాధాన్యత కోరుతున్న వారికి న్యాయం జరగడం లేదని టీజీజీడీఏ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏల్లుగా మారుమూల ప్రాంతాల్లో సేవలందిస్తూ, వ్యక్తిగత కారణాలతో బదిలీలు కోరుతున్న వైద్యుల వినతిని అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. గుర్తింపు పొందిన సంఘం నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలనే నిబంధనను కూడా అమలు చేయడం లేదని మండిపడుతున్నారు.

# ఆర్థిక వ్యవస్థపై రాహుల్ నిరాధార వ్యాఖ్యలు

## స్వార్థ రాజకీయాల కోసం అసత్యపు వాదనలు

## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ప్రభుత్వం అన్ని షాక్ అబ్జార్బర్‌లను (ఆటంకపరిచే వ్యవస్థలను) తొలగించడం వల్ల భారతదేశం 'ఆర్థిక సునామీ' వైపు వెళుతుందని, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ తన స్వార్థ రాజకీయాల కోసం చేసిన అసత్యపు వాదన నిరా ధారమైనది మాత్రమే కాదు, అది నిజంగా దేశ ప్రజలలో లేని భయాందోళనలను రెచ్చగొట్టడమే అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశపు ఆర్థిక వ్యవస్థ షాక్ అబ్జార్బర్‌లను నిజంగానే తొలగించి ఉంటే, అంతర్జాతీయ మార్కెట్‌లో విపరీతంగా పెరిగిన ముడి చమురు ధరలు, పశ్చిమ ఆసియాలో సంఘర్షణ, దిగుమతులు, ఎగుమతులపై సప్లై చైన్‌లో అంతరాయాలు, ఆర్థికంగా ప్రపంచం అనేక రకాల సవాళ్ళు ఎదుర్కొం టున్నప్పటికీ, నిరంతర భౌగోళిక రాజకీయ అనిశ్చితి ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ ఎందుకు నిలకడగా కొనసాగుతుందని ప్రశ్నించారు. భారతదేశం ఒక బాహ్య ఒత్తిడిని ఎదుర్కొంటోంది, కానీ నిస్సహాయ స్థితిలో లేదు. ప్రభుత్వం ఏ రకమైన షాక్ అబ్జార్బర్‌లను తొలగించలేదు. 140 కోట్ల భారత ప్రజల సహకారంతో గత దశాబ్ద కాలంలో మోడీ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థను మరింత పటిష్టం చేశారు. ఈ సందర్భంగా మనం కొన్ని తాజా గణాంకాల ను పరిశీలించినట్లయితే బలమైన ఆర్థిక కార్యకలాపాలను ప్రతిబింబిస్తూ, ఏప్రిల్, 2026లో ఇవే బిల్లుల జారీ 11.8శాతం ఉండగా మే, 2026లో అది 12.9శాతానికి వృద్ధి చెందిందన్నారు. తయారీ రంగ పిఎంఐ ఏప్రిల్‌లో 54.7 వద్ద స్థిరంగా విస్తరణ పరిధిలో కొనసాగి, మే నెలలో 56.6కు మెరుగుపడిందన్నారు. ప్రపంచ దేశాలలో సేవల రంగం పిఎంఐ భారీగా పతనమైనా మనదేశంలో ఏప్రిల్‌లో 58.8 కాగా, మే నెలలో అది 58.9 వద్ద మరింత బలంగా ఉందని, ఏప్రిల్‌లో విద్యుత్ వినియోగం 3.5శాతం ఉండగా, మేలో అది 5.9శాతం పెరిగిందని, ఏప్రిల్‌లో పట్టణ వాహన అమ్మకాలు 11.8శాతం పెరగ్గా, గ్రామీణ వాహన అమ్మకాలు అంతకంటే బలంగా 13.8శాతం పెరిగాయన్నారు. ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 3.48 వద్ద అదుపులో ఉందని, ఇది ఎఫ్‌డిఐ నిర్దేశించిన 4శాతం లక్ష ్యం కంటే తక్కువ ఏప్రిల్ చివరి నాటికి బియ్యం, గోధుమల బఫర్ నిల్వలు 817.53 లక్షల టన్నులుగా ఉన్నాయన్నారు. ఇవి బలమైన దేశ ఆహార భద్రతా కవచాన్ని అందిస్తున్నా యన్నారు.

## కొందుర్గు-పరిగి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌తో హైదరాబాద్‌కు తాగునీరు లభ్యత

### పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** కొందుర్గు, పరిగి లక్ష్మీదేవిపల్లి రిజ ర్వాయర్‌తో హైదరాబాద్‌కు తాగునీరు లభించడమే కాకుండా ఈ ప్రాంతంలోని సాగునీటి అవసరాలు కూడా తీర్చే అవకాశం ఉంటుం దని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ చేవేళ్ల ప్రాణహిత ప్రాజెక్టు కోసం గతంలో శంకరపల్లి మండలంలో పెద్ద ఎత్తున టన్నల్ ను తొవ్వినప్పటికి గత ప్రభుత్వం ఆ పనులు రద్దుచేసి వదిలేసిందని ఆరోపించారు. జూరాల నుంచి నీళ్లు తీసుకొని ఉంటే మా ప్రాంతానికి నీటి సమస్య తీరేదనీ, గత ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాకు చుక్కనీరు కూడా ఇవ్వలేదనీ ఆవేదన చెందారు. కొందుర్గు , పరిగి, లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ కోసం భూసేకరణ జరిపి 2.8 టిఎంసిలతో రిజర్వాయర్ నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడం నిజంగా గతంలో నేను అనేక పోరాటాలుకు సానుకూల స్పందన సిఎం ఇచ్చారని కొనియాడారు.

గత ప్రభుత్వం లోపభూయిష్టమైన విధానాల వల్ల అనేక ప్రతిపాదిత నీటి ప్రాజెక్టులు ముందుకు వెళ్లలేకపోయాయనీ అన్నారు. పాలమూరు రంగారెడ్డి ని తాగునీటి ప్రాజెక్టుగా చూపించి శ్రీశైలం నుంచి సోర్స్ పాయింట్ పెట్టడం వల్ల అంతరాష్ట్ర వివాదాలు తలెత్తాయనీ ఆయన వివరించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు లో 90 శాతం పనులు పూర్తి చేశామని బిఆర్ఎస్ నాయకులు అబద్ధాలు చెపుతున్నారనీ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 30 శాతం పనులు మాత్రమే పూర్తి అయ్యాయనీ ఆయన తెలిపారు. కొందుర్గు, పరిగి, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు 670 మీటర్ల ఎత్తులో ఉందనీ దీని వల్ల హైదరాబాద్‌కు తాగునీరు ఇవ్వొచ్చు ఈ రిజర్వాయర్ నుంచి తెలంగాణలో ఏ ప్రాంతానికైనా నీళ్లు ఇచ్చే అవకాశం ఉందనీ ఆయన తెలిపారు.

# ప్రపంచ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యుతవకు నైపుణ్యం

## జపాన్-తెలంగాణ సహకారానికి కొత్త దిశ

## ఉపాధి, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చలు: మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ప్రపంచ ఆర్థిక అవసరాలకు అను గుణంగా తెలంగాణ యువతకు సాంకేతిక, సమాచార వినిమ యశిక్షణ ఇస్తూ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ సౌజన్యంతో తెలంగాణ ప్రభుత్వం మంచి మానవ వనరులను తయారిస్తున్నామని రాష్ట్రకార్మిక ఉపాధి గనులు భూగర్భశాఖ మంత్రి జి వెంకటస్వామి అన్నారు. జపాన్‌లోని హిరోషిమా ప్రిఫెక్చర్‌కు చెందిన ప్రతినిధి బృందం శుక్రవారం తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు ,భూగర్భశాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి తో జపాన్ ప్రతినిది బృందం సమా వేశమైంది. ఈ సమావేశాన్ని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ (టామ్‌కామ్) సమన్వయం చేసింది. సమావేశంలో జపాన్ ప్రతినిధులు వివిధ పరిశ్రమలు, రంగాల్లో భారత యువతకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల గురించి మంత్రికి వివరించారు. తెలంగాణ– జపాన్ మధ్య నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాల విస్తరణ, శిక్షణ పొందిన మానవ వనరుల అభివృద్ధి వంటి అం శాలపై పరస్పర సహకార అవకాశాలపై చర్చలు జరిగాయి. హైదరాబాద్‌తో జపాన్ నగరాల అనుబంధానికి రెండు దశాబ్దాల చరిత్ర ఉందని, ప్రస్తుతం ఆ భాగస్వామ్యం 20వ సంవత్సరాన్ని జరుపుకుంటోందని ప్రతినిధి బృందం పేర్కొంది. ఈ సందర్భంగా మంత్రి డా. వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలను అంది పుచ్చుకునేలా తెలంగాణ యువతను ప్రభుత్వం సిద్ధం చేస్తోందన్నారు.

రాష్ట్ర యువతకు విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పించ డంలో, వారి ఉపాధి సామర్థ్యాలను పెంపొందించడంలో టామ్‌కామ్ అత్యంత వృత్తిపరమైన, లక్ష ్యబద్ధమైన కృషి చేస్తోందని తెలిపారు. జపాన్ సాంకేతిక నైపుణ్యం, పని సంస్కృతి తనను ఎంతో ఆకట్టుకున్నాయని మంత్రి పేర్కొన్నారు. జపాన్ యంత్రాల కచ్చితత్వంతోపాటు అక్కడి ప్రజల వినయం, క్రమశిక్షణ తనను ప్రభావితం చేశాయని అన్నారు. ఈ సమావేశంలో లేబర్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ అండ్ ఫ్యాక్టరీస్ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన తెలంగాణ అభివృద్ధి అవకాశాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉద్యోగ నైపుణ్యాల పెంపు, అంతర్జాతీయ ప్లేస్‌మెంట్ అవకాశాల గురించి వివరించారు. అలాగే తెలంగాణ–హిరోషిమా ప్రిఫెక్చర్ మధ్య సహకారం, ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు సంయుక్త కార్యాచరణ బృం దం (జాయింట్ వర్కింగ్ గ్రూప్) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హిరోషిమా ప్రిఫెక్చర్ నారా జపాన్ హబ్ ప్రతినిధుల ఆధ్వర్యంలో వచ్చిన బృందంలో డైరెక్టర్ ఫునైషి , ఇండస్ట్రియల్ హ్యూమన్ రిసోర్సెస్ డివిజన్ కోగా యుయా , ఇండస్ట్రియల్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ డివిజన్ హరజోనో యోషిహిరో – సూపర్వైజర్, లోకల్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ డివిజన్ టోయి మారియా – ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ డివిజన్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తుమ్మిడిహెట్టిని నిర్మిస్తే కాంగ్రెస్ బలపడుతుందని బిఆర్ఎస్, బిజెపి ఆందోళన

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తుమ్మిడిహట్టిని నిర్మిస్తే కాంగ్రెస్ బలపడుతుందని బిజెపి, బిఆర్ఎస్ ఆందోళన పడుతున్నాయని, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఉనికి కోసం, పార్టీని బతికిం చుకోవడం కోసం అడ్డదిడ్డంగా మాట్లాడుతు న్నాడని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపిం చారు. సిఎల్‌పిలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ప్రాణహిత మీద బ్యారేజ్ నిర్మిస్తే ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో 16 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చని, ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్ట్ కోసం గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 11 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, 71 కిలో మీటర్ల కెనాల్ వర్క్ కూడా పూర్తి అయిందని మహారాష్ట్రతో అనుమతి ఇప్పించడానికి రామచంద్రరావు తుమ్మిడి హట్టి పైన ఎందుకు నోరుమెదపడటం లేదని ఆయన ప్రశ్నించారు. ప్రాణహిత మీద తుమ్మిడి హట్టి మీద బ్యారేజీని 150 మీటర్ల ఎత్తుతో నిర్మిస్తే 100 టిఎంసిల నీళ్లను వినియో గించు కోవచ్చనీ గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు ఇవ్వొచ్చని ఆయన తెలిపారు. తుమ్మిడిహట్టి పైన మాట్లాడటానికి ఇరిగేషన్ మంత్రి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర సిఎంకు లేఖ రాస్తే ఇప్పటి వరకు స్పందించలేదని ఆవేదన చెందారు. బిజెపి కి తెలంగాణ రైతులపైన చిత్తశుద్ధి లేదన్నారు. అతి తక్కువ ముంపుతో తుమ్మిడిహట్టి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. మహా రాష్ట్రలో భూములు కోల్పోయేవారికి పరిహారం ఇవ్వడానికి ప్రయత్నం సిద్ధంగా ఉన్నా తెలంగాణ బిజెపి స్పందించలేదనీ ఆరోపించారు. మహారాష్ట్ర సిఎం అపాయింట్‌మెంట్ ఇప్పించడానికి బిజెపి ఎందుకు స్పందిచడం లేదని ప్రశ్నించారు. 70 యేళ్ల కాంగ్రెస్ పాలనలో శ్రీరాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం, మానేరు, కడెం ఇలా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించిందనో పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ హయాంలో 8 లక్షల కోట్ల అప్పు చేసి కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారు..అది కూడా కూలిపోయిందని ఆదిశ్రీనివాస్ అన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో మా వాటా ను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోమని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాల పైన రాజీ లేదనీ అన్నారు. కర్ణాటకతో ఏమైనా సమస్యలు ఉంటే చర్చించుకుని పరిష్కరించుకుంటామని అన్నారు.

# పర్యావరణం నాశనం దిశగా 'అభివృద్ధి' తగదు

### ఆదానీకి నికోబార్ ఐలాండ్ అప్పగింతకు కుట్ర

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** అభివృద్ధి అవసరమే కానీ, అది పర్యావరణాన్ని నాశనంచేసే విధంగా కాకుండా ప్రకృతిని కాపాడే దిశగా సాగాలనీ తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు నిచ్చారు. శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌లో మాట్లాడుతూ రాహుల్ గాంధీ పిలుపుకు మద్దతుగా, అండమాన్ నికోబార్ దీవుల పరిరక్షణ కోసం మా సంఘీభావం తెలియ జేస్తున్నామనీ తెలిపారు. ప్రకృతి పరంగా, భౌగోళికంగా ఎంతో పేరు గాంచిన నికోబార్ ఐలాండ్‌ను అదానీకి అప్పగించే కుట్ర సాగుతోందనీ ఆరోపించారు. పారిశ్రామిక అభివృద్ధి పేరుతో దీన్ని నాశనం చేస్తున్న పరిస్థితులను రాహుల్ గాంధీ తీవ్రంగా ప్రతిఘటిస్తున్నారని భారత ప్రజలు ఆయనకు బాసటగానిలిచి ప్రకృతిని కాపాడుకోవాలని కోరారు. అక్కడ ఉన్న నావికాదళ స్థావరం విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వకుండా, పర్యావరణానికి సంబంధించిన వేలాది మొక్కలను, వృక్షాలను కొట్టేస్తూ ప్రకృతికి తీవ్రవిఘాతం కలిగిస్తున్నారనీ ఆయన ఆవేదన ెచెందారు. పర్యావరణాన్ని సమతుల్యం చేస్తూ సాగే అభివృద్ధి అయితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదు కానీ, కేవలం అదానీని సంతృప్తి పరచడానికే ఒక పూర్తి ఐలాండ్‌ను అప్పగించి, దాన్ని పాడుచేసే ప్రయత్నం జరగడం సరైంది కాదనీ అన్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, రాహుల్ గాంధీ స్ఫూర్తికి, ఆయన చేస్తున్న పోరాటానికి అందరూ సామాజికంగా తమ మద్దతుగా నిలవాలని కోరుతున్నామని తెలిపారు.

## అండమాన్ నికోబార్ దీవుల రక్షణ.. రాహుల్ పిలుపునకు సంపూర్ణ మద్దతు

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** పర్యావరణహితంగా కొనసాగే అభివృద్ధికే కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందనీ నికోబార్ ఐలాండ్ ఆదానికి వాణిజ్య అవసరాలకోసం అప్పగింతను అడ్డుకోవడానికి దేశ ప్రజలు రాహుల్‌గాంధీకి బాసటగా నిలవాలని టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. అండమాన్ దీవుల పరిరక్షణకు రాహుల్‌గాంధీ ఇచ్చిన పిలుపుకు టిపిసిసి తన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అండమాన్ నికోబార్ దీవుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ ప్రియులు మద్దతు పలుకుతున్నారని ఆయన తెలిపారు.. ప్రకృతి సంపదలను కాపాడుతూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలన్నది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని ఆయన తెలిపారు, పర్యావరణాన్ని ధ్వంసం చేసే అభివృద్ధి దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు.




పోలీసు వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులతో డిజిపి ఆనంద్. చిత్రంలో పిఅండ్ఎల్ ఐజి గజారావు భూపాల్ తదితరులు

## పోలీసు వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో తెలంగాణ పోలీసులకు పతకాలు

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** హరియాణాలోని మధుబన్‌లో జరిగిన అఖిల భారత మూడో పోలీసు వెయిట్ లిఫ్టింగ్, క్లస్టర్ (వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, యోగా) పోటీల్లో తెలంగాణ పోలీసు క్రీడాకారులు మూడు పతాకాలు సాధించారు. మహిళల 84 కిలోల విభాగంలో మల్కాజిగిరి సిసిఎస్ మహిళా కానిస్టేబుల్ రేణుక రతజం పతకం సాధించగా పురుషుల పవర్ లిఫ్టింగ్ 59 కిలోల విభాగంలో భద్రాద్రి కొత్త గూడెం జిల్లా సాయుధ బలగం కానిస్టేబుల్ వంశీ కాంస్య పతకం అందుకున్నారు. కాగా యోగాలో మహి ళల జట్టుకు కాంస్య పతకం దక్కింది. ఈ జట్టులో ఈగల్ డిఎస్‌పి లక్ష్మీ, భద్రాచలం కానిస్టేబుల్ రత్నకుమారి, మహబూబ్‌నగర్‌కు చెందిన కానిస్టేబుల్ సౌభాగ్య, రామగుండంకు చెందిన కానిస్టేబు ల్. శ్రీలత, ఇల్లందు కానిస్టేబుల్ రాణి పాల్గొన్నారు. కాగా వెయిట్ లిఫ్టింగ్, క్లస్టర్ పోటీల్లో పత కాలు సాధించిన పోలీసు క్రీ డాకారులను డిజిపి ఆనంద్ శుక్రవారం తన కార్యాలయంలో అభినందిం చారు. భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆయన కోరారు. క్రీడాకా రులకు వెన్ను దన్నుగా వున్న కోచ్ రాము, ఏఆర్ఎస్ఐ రమేష్‌లను కూడా డిజిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో పి అండ్ ఎల్ ఐజి గజారావు భూపాల్, స్పోర్ట్స్ ఆఫీసర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు త్వరగా నిర్వహించాలి: డిజిపి ఆనంద్

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు త్వరగా నిర్వహించాలని సంబంధిత అధికారులను డిజి పి ఆదేశిం చారు. పోలీసు అధికారుల సంఘం ప్రతి నిధులు శుక్రవారం నాడు డిజిపి ఆనంద్‌ను కలిసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చే శారు. పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక కావాల్సి వుందని డిజిపి తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారం కోసం పోలీసు అధికారుల సంఘం కీలక పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు వీలైనంత త్వరగా నిర్వ హించాలని ఆయన ఆదేశించారు. డిజిపిని కలిసిన వారిలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు గోపిరెడ్డి సహా ఇతర నాయకులు వున్నారు. వారు డిజిపి ఆనంద్‌కు ఒక వినతిపత్రాన్ని అందించారు.

## పర్యావరణ స్పృహతో పుడమిని రక్షిద్దాం

### సింగరేణి సిఎండి బుద్ధప్రకాష్ జ్యోతి

**హైదరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త:** ప్రతీ ఒక్కరూ పర్యావరణ స్పృహతో భూమి తల్లి రక్షణకు పూనుకోవాలని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, మొక్కలు నాటుతూ పచ్చదనాన్ని పెంచుతూ పర్యావరణకు దోహదపడాలని సూచించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శుక్రవారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలోను, తన వ్యక్తిగత జీవితంలో కూడా ప్రతీ ఒక్కరూ పర్యావరణ స్ఫూర్తిని పాటించాలన్నారు. అనంతరం అందరితోను పర్యావరణ ప్రతిజ్ఞ స్వీకరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి ఆయన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గౌతమ్ పోట్రు, ఈడీ బి. వెంకన్న, జనరల్ మేనేజర్ టి. శ్రీనివాస్ పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల్లో కూడా అంత ర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు, పలుచోట్ల మొక్కలు నాటారు.

# అందానికే అందానివై పఫ్ టాప్స్

ఫ్యాషన్ ఫ్యాషన్




అమ్మాయిల అందాన్ని వికసించిన పూలతో పోలుస్తుంటారు కవులు. అలాంటి సోయగాన్ని అందమైన బొకేలో అమరిస్తే ఎలా ఉంటుంది. అని డిజైనర్లకి ఆలోచన వచ్చిందేమో! అందుకే ఈ పఫ్ టాప్‌లను తీసుకొచ్చినట్టున్నారు. ప్లెయిన్ నెక్ స్టైల్.. చేతుల దగ్గర లేయర్డ్ పఫ్‌హ్యాండ్స్, కిందకొచ్చేసరికి సన్నగా బెల్ట్‌ను చుట్టుకొని కుచ్చులుగా కనిపిస్తూ.. ఈ టాప్‌లు అలాగే తోస్తాయి మినిమమ్ మేస్టేజ్ దీని ప్రత్యేకత. వస్త్రం. మొత్తాన్నీ దీనిలో వాడేస్తారు. కటింగ్ పాళ్లు చాలా తక్కువ. ఎక్కువగా కనిపించేది ఆర్గంజానే అయినా సిల్క్, కాటన్, నెట్ వస్త్రరకాల్లోనూ దొరుకుతున్నాయి. బెల్‌బాటమ్, పెన్సిల్ ప్యాంట్, లెహెంగా, స్కర్ట్ ఏదైనా సరే.. పఫ్‌టాప్ మీదకి చక్కగా సెట్టయిపోతోంది. బాటమ్ వేర్ హెవీ డిజైన్లతో ఉంటే ఇది కాంట్రాస్ట్‌గా ప్లెయిన్ లుక్‌తో వస్తుంది. అదే కాస్త గ్రాండ్‌గా కావాలనుకుంటే సీక్వన్లు, పూలు, బీడ్స్ వర్క్‌తో ఉన్న పఫ్ టాప్‌లను ఎంచుకుంటే సరిపోతుంది. హోరెత్తించే పార్టీలే కాదు.. సంప్రదాయ వేడుకలకూ తగ్గ డిజైన్లున్నాయి. ఏ వేడుకకి ఎంచుకోవాలన్నది మీవంతు. పఫ్ టాప్‌తో పూలగుత్తిలా మెరవడానికి సిద్ధం



# ఆమె గాత్రం సుమనో హారం



ఒకప్పుడు లతామంగేష్కర్ గాత్రాన్ని ఎంతగా అభిమానించారో అదే స్థాయిలో పాడే మరో గాయని ఉన్నారంటే నేటి తరం వాళ్లకేమోగానీ, పాత తరంవారందరికీ తెలుసుంటుంది. ప్రతిష్టాత్మక విశిష్ట పద్మభూషణ్ బిరుదు కూడా పొందారామె. ఆమె హిందీ, బెంగాలీ, మరాఠీ, అస్సామీ, గుజరాతీ, కన్నడ, అంగికా, భోజ్‌పురి రాజస్థానీ ఒడియా పంజాబీలతో పాటు అనేక భాషలలోని సినిమాలకు పాటలు పాడింది.ఓ మధురమైన బాణీ, శ్రుతులతో వినిపించే ఎంతో మధురమైన పాటల్ని ఈ నాటికీ గుర్తుంచుకుంటాం. అలాంటి పాటల్ని 'లత'గొంతు పోలిన శ్రావ్యమైన స్వరంతో వినిపించే మరోగాయని సుమన్ కళ్యాణ్ ఉన్నారు. ఇద్దరి స్వరంలో తేడా వెంటనే కనిపెట్టలేం. అందుకే 'బినాకాగీత్‌మాలా' పాటలు వింటున్నప్పుడు లతా మంగేష్కర్, సుమన్ కళ్యాణ్‌పూర్ పేర్లను ప్రత్యేకించి వేర్వేరు యాసలలో చెప్పడం తెలిసిందే. లేకుంటే అదెవరిగొంతో గుర్తుపట్టడం కష్టం. ఒకటేనని భ్రమపడే గ్రాతం వారిద్దరిదీ. 1962లో 'బాత్ ఏక్ రాత్'కి సినిమాలో ఓ మధురగళం వినిబడినప్పుడు అది లతాదో సుమన్ కళ్యాణ్‌పూర్‌దో గుర్తు పట్టలేనంతగా అప్పటి నుంచి వారి గాత్రాలను విడివిడిగా గుర్తించే శ్రోతలు ఎక్కువయ్యారు. పాతతరం సంగీత ప్రియులకు సుమన్ కళ్యాణ్‌పూర్‌ది బాగా గుర్తు పట్టే గళం. 'బ్రహ్మచారి' సినిమా మీరెవరైనా చూసి ఉంటే 'ఆజ్ కల్ తేర్ మేర్ ప్యార్‌కీ.. హర్‌జబాన్' అనే పాట వింటుంటే రఫీ, సుమన్‌లు కలిసి పాడిన యుగళగీతం అందర్నీ కాస్తంత హుషారెక్కిస్తుంది. గంతువేయిస్తుంది. ఇప్పటికీ మంచిపోలేని మాధుర్యం ఎన్నో సూపర్‌హిట్ పాటలకు నేపథ్యగాయనిగా ఆమె శ్రోతలను అలరించారు. గాత్ర శుద్ధి ఉన్న సుమన్ లతాతో పోటీ పడ్డారని చెప్పాలి. అలనాటి ఆ పాత మధురాలను మనకు వదిలి 89వ ఏట ఇటీవలనే ఈ లోకాన్ని వీడి వెళ్లారు.

# ఆరోగ్య భాగ్యం శనగలు

శనగలంటే చిన్న చిన్న గుండ్రటి ఆకారంలో ఉండే పప్పు దినుసులు. వీటిని సాంప్రదాయ వంటకాల్లో, ఆరోగ్యం కోసం వాడుతారు. ఎందు కంటే పోషకాలు ప్రోటీన్స్ సమృద్ధిగా ఉండే పోషకాల పవర్‌హౌస్ కాబట్టి. ఇది 20-80 సెం.మీ ( 2 అడుగులు) పెరిగే వార్షిక మొక్క. వీటిని ఎక్కువగా భారత్‌లో పండస్తారు. 5,970000 టన్నుల శనగ ఉత్పత్తిలో ప్రపంచంలో మొదటిది. తర్వాత టర్కీ, పాకిస్తాన్, ఆస్ట్రేలియా, ఇరాన్, మయన్మార్, కెనడా. ఇథియో పియా, అమెరికాలు ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇవి లేత గోధుమ రంగు బఠానీ ఆకారపు చిక్కుళ్ళు అని చెప్పవచ్చు. వీటి పరిఆణం 5-12 మి.మి ఉంటుంది. శనగపప్పు యొక్క బుషెల్ బరువు 60 పౌండ్లు ఉంటుంది. కాల్చిన చీక్‌పీస్‌ని ఐరోపాలో కాఫీకి బదులుగా తయారు చేస్తారు. భారత్‌లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్రా, యుపి. కర్నాటకలో ఎక్కువగా పండస్తారు. ప్రపంచం లోనే అత్యధికంగా పండించడే పప్పుదినుసుల్లో దీన్ని సాగు చేస్తు న్నారు. ప్రపంచ పోషకాహార వంటకాల్లో ఇటు సాంప్ర దాయకంగా అటు ఆధునికంగా సుస్థిర పాత్రని సంపాదించిన శనగలు గురించి ఎంత చెప్పిన అలవి కాదు. 12,600 ఏళ్ళ క్రితం అడవుల్లో పెరి గిన శనగల నుంచి దాదాపు 60 రకాల్ని గుర్తించడమైంది. వీటిని సలాడ్స్, తాలింపుల్లో కూరలో ఎక్కువగా వాడుతారు. కొన్ని సంస్కృతలో శనగల్ని పాప్‌కార్న్‌లాగా పాప్‌చేసి పిండిలో రుబ్బుతారు. చిన్న పిల్లలు తినేందుకు వీలుగా శెనగలతో చేసిన పాలు, బట్టర్ వంటి ఎన్నో ఉత్పత్తుల్ని మోడ్రన్ లైఫ్ స్టయిల్‌తో వచ్చే అనారోగ్య సమస్యల్నితగ్గిస్తుంది. అంతేగాకుండా శెనగలతో చేసిన చిక్ పీ ఆయిల్‌ని జుట్టు చర్మం, కీళ్ళ నొప్పులు తగ్గించడానికుపయోగిస్తారు.

**రకాలు :** వీటిలో కొన్ని ముఖ్యమైన రకాల గురించి తెలుసుకుందాం. **దేశీ శనగలు :** ఇవి చిన్నవిగా గట్టివిగా మరియు గోధుమ రంగు లేదా ముదురు గోధుమ రంగులో కన్పిస్తాయి. వీటిలో సైబర్ అధికంగా ఉండడంవల్ల వీటిని మైక్రోస్ప్రర్మా అని అంటారు. **కబూలీ శనగలు :** ఇవి మెత్తగా పెద్దవిగా, తెల్లగా ఉండి ఉండి తక్కువ ఫైబర్, అధిక ప్రోటీన్‌తో ఉంటుంది. వీటని ఎక్కువగా సలాడ్స్-హమ్మస్, వంటి అంతర్జాతీయ వంట్లో ఉపయోగిస్తారు. ఇవి వండటానికి తేలికగా ఉంటాయి వీటినే మారోస్ప్రర్మా అని అంటారు.

**బ్లాక్ చిక్పీస్:** ఇవి ముదురు రంగులో ఉండే చిన్న రకమైన శనగలు బ్లాక్ యిక్పీస్, కాలా నల్లరకమైన శనగలు అంటారు. వీటిలో ఫైబర్ ఐరన్ ఎక్కువగా ఉండడం వల్ల బరువు తగ్గి జీర్ణ కోశ వ్యవస్థకి మేలు చేస్తాయి.

**గ్రీన్ చిక్పీస్:** తాజాగా కోసంన పచ్చి శనగలు, ఇవి సీజనల్‌గా, తాజా రుచితో అధిక పోషకాలతో నిండి ఉంటుంది. □

ఏ పేరంటం జరిగినా, ఇంట్లో, గుళ్లో పూజలు నైవేద్యంగా, ప్రసాదంగా ఇచ్చేది శనగలు అనే చెప్పాలి. అంతేగాకుండా చరిత్రలో మొట్టమొదటగా పండించిన కూరగాయల్లో ఇది ఒకటి దీన్ని 8500 బిపిలో ఆగ్నేయా టర్కీలో, ఫ్రాన్స్‌లో 6790 బిసిలో మొదట గుర్తించడమైనది. వీటిని ఛనా, చనా, చన్నా, గర్బంజో, ఈజిప్టియన్ బఠానీ, చిక్పీ అని అంటారు. చీక్పి అనేది చిచేపీస్ నుండి వచ్చింది. ఇది లాటిన్ నుండి వచ్చింది. సిసర్లు, గార్బోంజో అనే పదం ఆధునికి స్పానిష్ నుండి వచ్చింది. అరబిక్‌లో చిక్‌పీస్ అంటే హమ్మస్ అనే అర్థం కూడా ఉంది. ఇంగ్లీష్- చక్‌పీ, గార్బంజో బీన్, చిక్ పీ. స్ప్లిట్‌పీస్, ఈజిప్టియన్ పీస్ హిందీ- ఛానా, కాలాఛనా, కబూలీ చనా తమిళ్ : కొత్తు కడలై, సనాగులు, కన్నడ: కడ్లే, మరాఠీ : హర్బరా, పంజాబీ: చోలే, గుజరాతీ: చాన్య, చన్, బెంగాలీ : చోళ, కాశ్మీరీ : చాను, సంస్కృతం : చనన. తెలుగు : శనగలు, సనగలు, తాడి బఠానీ, బొంగారాలు/బొంగడాలు అని వివిధ పేర్లతో వ్యవహరిస్తారు.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# విశ్వరూపం



కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు విశ్వరూపాన్ని దర్శింపచేశాడు. అంతేనా.. ఆ పరంధాముడు తన విశ్వ రూపాన్ని బాల్యావస్థలోనే పెంపుడు తల్లి యశోదకు తొలుత చూపించాడు. మన్ను తిన్నావా? అని దండించ వోయినప్పుడు నోరు తెరిచి తన నిజస్వరూపాన్ని చూపాడు. ఉద్యోగ పర్వంలో రాయబారం కోసం ధృతరాష్ట్రుని కొలువుకు వెళ్లినప్పుడు కౌరవులు శ్రీకృష్ణుణ్ణి బంధించాలని ప్రయత్నించారు. వారిని హెచ్చరించటానికి తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. విజయుడికి నిజస్వరూపాన్ని ప్రదర్శించాడు. కురుక్షేత్ర యుద్ధసమయంలో భగవద్గీతను బోధిస్తూ విజయుడికి నిజస్వరూపాన్ని ప్రదర్శింపజేయడం జగ ద్విదితమే! ఇక చివరిసారి మహా భారత యుద్ధం తర్వాత శ్రీకృష్ణుడు సోదరి సుభద్రను తీసుకుని ద్వారకకు బయల్దే రాడు. మార్గమధ్యంలో ఉదంకుడు అనే రుషి అతిథ్యాన్ని స్వీకరించాడు. యుద్ధ విషయం తెలియని ఆ మహర్షి కౌరవుల క్షేమ సమాచారాలు అడి గాడు. వారు సమరంలో చనిపోయాం"ని శ్రీకృష్ణుడు చెప్పాడు. అది విన్న ఉదంకుడు అతడిపై అగ్రహించాడు. నీకు యుద్ధాన్ని ఆపగలిగే శక్తి ఉన్నా! ఆపలేదు అంటూ శపించ బోయాడు. అప్పుడు శ్రీకృష్ణ పరమాత్మ ' ఓ మునీ! నీ తపోశక్తిని వృథా చేసుకోవద్దు. నేను సర్వాంతర్యామిని అంటూ తన విశ్వ రూపాన్ని ప్రదర్శించాడు. ఇలా భారత, భాగవతాల్లో నాలుగుసార్లు శ్రీకృష్ణుడు తన దివ్యమైన విశ్వరూపాన్ని చూపాడు. □


**చెలి**

సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు,ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్:Cheli@vaartha.com

# తెర

# నూతన చిత్రం 'మొహబ్బత్' ప్రారంభం

సంతోష్ కల్వచెర్ల, శ్రేయాసి సేన్ జంటగా ఏబీఎస్ ప్రొడక్షన్ బ్యానర్ మీద అఫ్రోజ్ షేక్ నిర్మిస్తున్న నూతన చిత్రం 'మొహబ్బత్' ఈ చిత్రానికి స్క్రీన్ ప్లేని అందిస్తూ మ్యాక్ దర్శకత్వం వహించనున్నారు. ఈ మూవీ ప్రారంభోత్సవం శుక్రవారం నాడు ఘనంగా జరిగింది. ఈ చిత్ర పూజా కార్యక్రమాలకు చిన్న శ్రీశైలం యాదవ్ , ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి నవీన్ యాదవ్ క్లాప్ కొట్టగా చిత్ర నిర్మాత అఫ్రోజ్ షేక్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. అనంతరం నవీన్ యాదవ్ గారు చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ని కూడా లాంచ్ చేశారు. ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ.. 'మొహబ్బత్' సినిమా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నన్ను పిలిచినందుకు



ధన్యవాదాలు. దర్శకుడు సలీమ్ మాలిక్ (మ్యాక్) మాట్లాడుతూ.. నిర్మాత అఫ్రోజ్ గారు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా"మొహబ్బత్‌"ను నిర్మించేందుకు ముందుకు వచ్చారు. నిర్మాత అఫ్రోజ్ షేక్ మాట్లాడుతూ.. నా ఏబీఎస్ ప్రొడక్షన్ బ్యానర్ మీద మొదటి ప్రాజెక్ట్‌గా"మొహబ్బత్‌"ను నిర్మిస్తున్నాను. ఈ మూవీ మంచి విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉంది. మ్యాక్ మంచి దర్శకుడు. సంతోష్, శ్రేయాసిలకు ఈ సినిమాతో మంచి సక్సెస్ వస్తుందని ఆశిస్తున్నాను. .హీరోయిన్ శ్రేయాసి సేన్ మాట్లాడుతూ.. 'మొహబ్బత్' చిత్రంలో అన్ని రకాల అంశాలుంటాయి. ఈ కథ నాకు చాలా నచ్చింది. .హీరో సంతోష్ కల్వచెర్ల మాట్లాడుతూ.. .. అఫ్రోజ్‌కి సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. మా డైరెక్టర్ మ్యాక్ అద్భుతమైన టాలెంటెడ్. ఇలాంటి ఓ ప్రేమ కథకు సంగీతం ప్రధానం. సునీల్ కశ్యప్‌తో పని చేస్తుండటం ఆనందంగా ఉంది అని అన్నారు.

# 'సోల్ ఆఫ్ లెనిన్'కి అద్భుతమైన స్పందన



మనం ఎంటర్ ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్య దేవర నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం"లెనిన్". అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రలలో నటించిన ఈ మూవీకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ చిత్రం జూన్ 26న థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, పాటలు ప్రేక్షకుల్లో అంచనాలు మరింతగా పెంచేశాయి. ఇటీవల మేకర్స్ 'సోల్ ఆఫ్ లెనిన్' అంటూ ఆడియెన్స్‌ని సర్ ప్రైజ్ చేశారు. 'పెద్ది' సినిమా ప్రస్తుతం థియేటర్లో సందడి చేస్తోంది. 'పెద్ది' ప్రదర్శనలకు ఈ 'సోల్ ఆఫ్ లెనిన్'ను జోడించారు. ఈ పాటలో అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే మధ్య ఉండే ప్రేమ, వారి బాండింగ్‌ను చక్కగా చూపించారు. ప్రేమ కంటే గొప్ప యుద్ధం లేద్ధు అనే క్యాప్షన్‌తో ఈ పాట సినిమాపై అంచనాలను మరో స్థాయికి తీసుకెళ్లింది కళ్యాణ్ చక్రవర్తి సాహిత్యం, వాగ్దేవి గాత్రం ఈ పాటను మరింత అందంగా మలిచాయి. ఈ పాటలోని ప్రతి ఫ్రేమ్, ప్రతి విజువల్ భావోద్వేగాలతో కూడిన ఒక కొత్త ఎక్స్‌పీరియెన్స్‌ను అందిస్తుందని హామీ ఇస్తున్నాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని థమన్ ఎస్ అందించారు. పాటలు, నేపథ్య సంగీతం ఈ సినిమా స్థాయిని మరింత పెంచుతాయని భావిస్తున్నారు. లియోన్ బ్రిట్టో సినిమాటోగ్రఫర్‌గా, నవీన్ నూలి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రం జూన్ 26, 2026న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.



# 'దూత' నాగార్జున క్లాప్‌తో ప్రారంభం

లుయువ సామ్రాట్ నాగచైతన్య అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన సూపర్‌నేచురల్ థ్రిల్లర్ 'దూత'తో ఓటీటీలో సంచలన అరంగేట్రం చేశారు. 'దూత' ప్రపంచవ్యాప్తంగా సంచలన విజయాన్ని సాధించింది. ఈ సూపర్‌నేచురల్ థ్రిల్లర్ పలు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రేక్షకులను ఆకట్టుకుని గ్లోబల్ ఫెనామెనాన్‌గా నిలిచింది.తొలి సీజన్ నాగచైతన్యకు డిజిటల్ ప్రేక్షకుల్లో మరింత గుర్తింపును తీసుకురావడమే కాకుండా, నటుడిగా ఆయనలోని మరో కొత్త కోణాన్ని ఆవిష్కరించింది. ఇప్పుడు ఈ ఫ్రాంచైజీతో తన అనుబంధాన్ని మరింత ముందు కు తీసుకెళ్తూ, నాగచైతన్య సీక్వెల్ కోసం నిర్మాతగానూ మారుతున్నారు. శరత్ మరార్‌తో కలిసి అన్నపూర్ణ స్టూడియోస్, నార్త్‌స్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. మొదటి సీజన్‌కు ప్రధాన బలంగా నిలిచిన తన అద్భుత కథన శైలితో విక్రమ్ కె కుమార్ రెండో సీజన్‌కు దర్శకత్వం వహించనున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను నేడు సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కింగ్ నాగార్జున అక్కినేని క్లాప్ కొట్టి, స్క్రిప్ట్‌ను చిత్రబృందానికి అందజేశారు.తండేల్ బ్లాక్‌బస్టర్ విజయానంతరం 'వృషకర్మ' చేస్తున్న నాగచైతన్య తన తదుపరి ప్రధాన ప్రాజెక్ట్‌గా 'దూత 2'ను ఎంచుకోవడం విశేషం. అంతేకాక నిర్మాతగా కూడా భాగస్వామి కావడం, ఈ కథపై ఆయనకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోంది. ఈసారి విక్రమ్ కె కుమార్ మరింత ఉత్కంఠభరితమైన, మిస్టరీతో నిండిన కథను సిద్ధం చేశారు. ఈ సిరీస్‌లో పార్వతి తిరువోతు, ప్రియా భవానీ శంకర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తున్నారు. బసుజల్: ది వోర్టెక్స్' తొలి సీజన్‌కు పనిచేసిన వి.ముకేశ్వరన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఈషాన్ ఛాబ్రా సంగీతం సమకూరుస్తున్నారు.

# 2027లో వెంకీ, అనిల్ రావిపూడి మూవీ



విక్టరీ వెంకటేష్ ప్రస్తుతం మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' సినిమాలో నటిస్తున్నాడు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది దసరా కానుకగా విడుదల చేయాలనే లక్ష్యంతో త్రివిక్రమ్ శరవేగంగా షూటింగ్ పూర్తి చేస్తున్నాడు. ఇదిలా ఉండగా, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడితో వెంకటేష్ చేయబోయే నెక్స్ట్ ఎంటర్‌టైనర్ కూడా పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. అనిల్ రావిపూడి ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేయగా, ఈ నెలలోనే సినిమాను ప్రారంభించనున్నాడు. జూన్ 15న హైదరాబాద్‌లో ఈ చిత్రానికి సంబంధించిన గ్రాండ్ పూజా కార్యక్రమం జరగనుంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో నందమూరి కళ్యాణ్ రామ్ మరొక హీరోగా నటిస్తుండటం విశేషం. జూన్ మూడో వారంలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మొదటగా వెంకటేష్ లేని కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారు. మరోవైపు వెంకటేష్"ఆదర్శ కుటుంబం" షూటింగ్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేసి, జూలై చివరి నాటికి అనిల్ రావిపూడి సెట్స్‌లో జాయిన్ అవ్వాలని ప్లాన్ చేస్తున్నాడు.ఈ మల్టీస్టారర్ ఎంటర్‌టైనర్‌లో కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్‌లుగా నటిస్తుండగా జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, జీ స్టూడియోస్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. ఈ భారీ వినోదాత్మక చిత్రాన్ని సంక్రాంతి 2027 కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# 'సిగ్మా' ఎనర్జిటిక్ ఫస్ట్ సింగిల్ సిగ్మా స్టయిల్



సందీప్ కిషన్ హీరోగా లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిత్రం 'సిగ్మా' జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం అనౌన్స్మెంట్ నాటి నుంచే సినీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించింది. టీజర్‌కు అద్భుతమైన స్పందన రావడంతో మరింత హైప్‌ను సొంతం చేసుకుంది. ఈ సినిమా కోసం మ్యూజిక్ సెన్సేషన్ ఎస్. తమన్ బ్లాక్ బస్టర్ ఆల్బమ్ కంపోజ్ చేశారు. తాజాగా హీరో దుల్కర్ సల్మాన్ 'సిగ్మా' ఫస్ట్ సింగిల్ 'సిగ్మా స్టైల్'ను లాంచ్ చేశారు. తమన్ స్వయంగా కంపోజ్ చేసి ఆలపించిన ఈ ఎనర్జిటిక్ ట్రాక్ మాస్ బీట్‌లతో అదిరిపోయింది. థమన్ సిగ్నేచర్ స్టైల్ మ్యూజిక్, హైవోల్టేజ్ రిథమ్స్ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సందీప్ కిషన్ తన స్టైలిష్ డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకోగా, ఫారియా అబ్దుల్లా కూడా టు అదిరిపోయే డ్యాన్స్ స్టెప్స్‌తో పాటకు మరింత కలర్ తీసుకొచ్చింది. జేసన్ సంజయ్ రాసిన క్యాచీ లిరిక్స్, థమన్ మాస్ ట్యూన్, సందీప్ ఫారియా డైనమిక్ పెర్ఫార్మెన్స్ కలిసి"సిగ్మా స్టైల్"ను ఇన్‌స్టంట్ చార్ట్‌బస్టర్‌గా నిలబెట్టాయి. ఈ సాంగ్‌తో సినిమాపై క్యూరియాసిటీ, ఎక్స్‌పెక్టేషన్స్ మరింతగా పెరిగాయి. ఈ చిత్రంలో రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్, అంబు దాసన్, యోగ్ జాపీ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.ఈ చిత్రానికి కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ కేఎల్ ఎడిటింగ్ నిర్వహిస్తున్నారు. హరిహరసుతన్ వీఎఫ్‌ఎక్స్ సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తున్నారు.

# థియేటర్స్ ఇవ్వకపోతే ఆత్మహత్య శరణ్యం

## 'ఓ అందాల రాక్షసి' హీరో, మూవీ మేకర్ షెరాజ్ మెహదీ ఆవేదన



రిలీజ్‌కు కూడా థియేటర్లు ఇవ్వలేదు.చిన్న సినిమాలను చంపేస్తున్న మాఫియా. ఎక్కువ థియేటర్స్‌లో వస్తేనే సినిమా ఓటీటీకి అర్హత దొరుకుతుంది. న్యాయం జరిగే వరకు నా పోరాటం కొనసాగుతుంది. తెలుగు సినిమా పరిశ్రమలో మాఫియా చిన్న సినిమాలను చంపేస్తోందని 'ఓ అందాల రాక్షసి' హీరో, మూవీ మేకర్ షెరాజ్ మెహదీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రిలీజ్ కే కాదు, రీరిలీజ్‌కు కూడా థియేటర్లు ఇవ్వలేదని ఇవ్వడం లేదని, థియేటర్స్ ఇవ్వకపోతే ఆత్మహత్య శరణ్యం అన్నారు. తెలుగు ఫిలిం చాంబర్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ,"మంచి సినిమాలను కిల్ చేస్తున్నారు. చిన్న సినిమాలను చంపేస్తున్నారు. నైజాం ఏరియాలో ఒక్క థియేటర్ కూడా ఇవ్వలేదు.చిన్న సినిమాల పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని,"ప్రపంచంలో ఎక్కడా లేని పరిస్థితి మన ఇండస్ట్రీలో ఉంది. బాలీవుడ్‌లో కూడా ఇలా ఉండదు" అని వ్యాఖ్యానించారు. సెన్సార్ బోర్డు నిబంధనలు చిన్న సినిమాలకు భారంగా మారుతున్నాయని, తిదీదిది వంటి చార్జీలు కూడా నిర్మాతలను కుంగదీస్తున్నాయని తెలిపారు.చిన్న సినిమాలకు థియేటర్లు, సరైన అవకాశాలు కల్పించకపోతే కొత్త ప్రతిభ ఎదగడం కష్టమవుతుందని,